
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 334
శనివారం 24-2-2024


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'



చంద్రుడి ఒడిలో ఒడిస్సియస్
తొలి ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర.. 50 ఏళ్ల తర్వాత అమెరికా ముద్ర
-6లో



..వారికి సాయం చేయండి
పేటీఎం కస్టమర్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాన్ని పరిశీలించాలన్న ఆర్‌బీఐ
- 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




అభివృద్ధికి నమూనాగా భారత్
భారత్ వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి మోడల్‌గా మారడం ఖాయమని, ఇది 'మోదీ గ్యారంటీ' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- వివరాలు 6లో



అతి త్వరలోనే కేజ్రీవాల్ అరెస్ట్
మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌కు సీబీఐ ప్రయత్నిస్తోందని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు.
- వివరాలు 6లో



13 తర్వాత 'లోక్‌సభ' షెడ్యూల్!
మార్చి 13 తర్వాత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం వర్గాలు శుక్రవారం వెల్లడించాయి.
- వివరాలు 6లో



రష్యాపై భారీ ఆంక్షలు
ఉక్రెయిన్‌పై యుద్ధానికి తెగబడ్డ రష్యాపై 500పై చిలుకు ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు.
- వివరాలు 6లో

11,000 పోస్టులతో డీఎస్సీ!
టీచర్ పోస్టుల భర్తీకి కసరత్తు
16లో

'మేడిగడ్డ' ఖర్చు ప్రభుత్వమే భరించాలి
- మళ్లీ అగ్రిమెంట్ చేసుకుంటేనే పునరుద్ధరణ పనులు చేస్తాం
- అన్నారం గేట్లు ఎత్తి.. చేసిన పనులను దెబ్బతీశారు
- సాగునీటి పారుదలశాఖకు ఎల్‌అండ్‌టీ మరో లేఖ

2లో

ఢిల్లీలో పదవికి రాజీనామా చేశా
నాగర్‌కర్నూల్ ఎంపీ సీటుకు బరిలో ఉంటా: మల్లురవి
2లో





మేడారం గద్దెలపై సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులు ఆసీనులు కావడంతో శుక్రవారం పోటెత్తిన భక్తజనం (ఇన్‌సెట్‌లో) సమ్మక్క గద్దె వద్ద మొక్కుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

> రూ.500కే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డున్న పేదవారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్యారంటీలను 27న ప్రారంభిస్తాం. కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఇచ్చిన ప్రతి హామీ అమలుచేస్తాం.
> - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

27నే మరో 2 గ్యారంటీలు

రూ.2 లక్షల రుణమాఫీపై తొందరలోనే రైతులకు శుభవార్త

కాళేశ్వరం అక్రమాలపై త్వరలోనే జ్యుడీషియల్ విచారణ

కేసీఆర్ కుటుంబ అవినీతి మోదీకి పట్టదా?..

- బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి స్నేహం
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పిస్తాం
- మేడారంలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

సిలిండర్‌కు ముందుగా పూర్తి డబ్బులు చెల్లించాల్సిందే!
- ఆ తర్వాత నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ
- తెల్లరేషన్ కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తేనే అర్హులు

2లో

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

ఓఆర్ఆర్‌పై పటాన్‌చెరు సమీపంలో దుర్ఘటన

భారీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి రెయిలింగ్‌ను గుద్దుకున్న కారు

ప్రమాదంలో తీవ్రగాయాలు.. ఘటనా స్థలంలోనే మృతి

- కారు నడుపుతున్న పీఏ ఆకాష్‌కు తీవ్ర గాయాలు
- ప్రమాదానికి కొన్ని గంటల ముందు దర్గాలో మొక్కులు చెల్లించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే
- గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం.. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులర్పించిన సీఎం రేవంత్, కేసీఆర్, రాజకీయ ప్రముఖులు





నుజ్జునుజ్జయిన వాహనం ముందు భాగం (ఇన్‌సెట్‌లో) లాస్య నందిత

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు/పటాన్ చెరు టౌన్/కంటోన్మెంట్: దివంగత రాజకీయ నేత జి. సాయన్న కుమార్తె, బీఆర్ఎస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. లాస్య నందిత (37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై రామేశ్వరం బండ సమీపంలో ఆమె ప్రయాణిస్తున్న కారు ఓ గుర్తుతెలియని భారీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని ఆపై నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను గుద్దుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు సీట్లో కూర్చున్న నందిత తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే

మిగతా 3వ పేజీలో ▶

సీటుబెల్ట్ ధరించినా తీవ్రత ఎలా!
3లో

క్లుప్తంగా...

సాగర్ ప్రాజెక్టు మెయింటెనెన్స్ పనులకు ఓకే

- అనుమతినిచ్చిన కేఆర్ఎంబీ
- విద్యుదుత్పాదన కేంద్రాలను పరిశీలించిన కేఆర్ఎంబీ బృందం



విద్యుదుత్పాదన కేంద్రం వద్ద కేఆర్ఎంబీ బృందం

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు మెయింటెనెన్స్ పనులను చేసుకోవచ్చని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) అధికారులు తెలంగాణ ఇంజనీర్లకు అనుమతి ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డ్యాంపై గొడవ జరిగిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం డ్యాం మెయింటెనెన్స్ పనులను నిలిపివేసింది. తిరిగి ఇటీవల ఆ పనులు చేపట్టింది. అయితే, పనులు జరుగుతుండగా ఆంధ్రప్రదేశ్ తరఫు అధికారులు డ్యాంపై పనులు చేయవద్దని అభ్యంతరం తెలిపారు. పనులను ఆపకుండా చేస్తుండటంతో ఏపీ ప్రభుత్వం కేఆర్ఎంబీకి లేఖలు రాసింది. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ అధికారులు గురు, శుక్రవారాల్లో సాగర్ ప్రాజెక్టు దిగువన గల ప్రధాన విద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని, కుడి కాల్వపైనున్న విద్యుదుత్పాదన కేంద్రాన్ని, మెయింటెనెన్స్ పనులను పరిశీలించారు. అనంతరం విజయవిహార్ అతిథిగృహంలో తెలంగాణ ఇంజనీర్లతో, సాగర్ ప్రాజెక్టు అధికారులతో సమావేశమై సీజనల్ పనులన్నింటినీ త్వరలో పూర్తి చేయాలని తెలంగాణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సమ్మక్క సారలమ్మలనే మోసం చేశారు

తెలంగాణ ప్రజలను మోసం చేయడం బీజేపీకి పెద్ద పనేం కాదు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సారలమ్మలనే బీజేపీ నేతలు మోసం చేశారని, తెలంగాణ ప్రజలను మోసం చేయడం ఆ పార్టీకి పెద్ద పనేం కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఆరోపించారు. సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తామని రెండేళ్ల క్రితం కేంద్రమంత్రి అర్జున్‌ముండా చెప్పి వెళ్లారని, ఇప్పుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అక్కడకు వెళ్లి తాము అలా చెప్పలేదని బుకాయిస్తున్నారని బీజేపీపై ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బాధ్యత కలిగిన కేంద్రమంత్రులు అమ్మవార్ల ముందే ఇన్ని అబద్ధాలు చెబుతారా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్, ప్రధాని మోదీల మధ్య రాజకీయ ప్రేమాయణం జరిగిందని, రెండేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు మళ్లీ ఒకరి ప్రయోజనాల కోసం మరొకరు పాటుపడేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కవితను లిక్కర్ కేసులో అరెస్టు చేస్తారని అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెప్పేవారని, కాంగ్రెస్ అధికారంలోకి రాదేమోననుకుని కవితను అరెస్టు చేసే ఎపిసోడ్ ఆపేశారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు ఆ కేసులో నిందితురాలిగా చేర్చారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో సానుభూతి ఓట్లు పొందేందుకే మళ్లీ ఈ సురభి నాటకాన్ని మొదలుపెట్టారని విమర్శించారు.

ఈఎన్సీ(జనరల్)గా అనిల్ కుమార్ బాధ్యతల స్వీకారం

నేడు కడెం ప్రాజెక్టు పరిశీలన



సాక్షి, హైదరాబాద్: నీటి పారుదల శాఖ ఈఎన్సీ (జనరల్)గా గుమ్మడి అనిల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండువారాల క్రితం ఈఎన్సీ (జనరల్)గా ఉన్న సి.మురళీధర్ రాజీనామా చేయగా.. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మూడురోజుల కిందట ప్రభుత్వం అనిల్‌కుమార్‌కు ఈఎన్సీ (జనరల్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆయన కొత్త బాధ్యతలు స్వీకరించారు. కడెం ప్రాజెక్టును ఆయన శనివారం పరిశీలించనున్నారు.

ఇదండీ సంగతి



సీనియర్లు కాబట్టే ఆమాత్రం రెస్పెక్ట్ ఇచ్చారు. జూనియర్లయితే చెప్పడానికే వీలుకాదు! సంతోషించండీ..

27నే మరో 2 గ్యారంటీలు

ముఖ్య అతిథిగా ప్రియాంకాగాంధీ హాజరవుతారు

రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే రైతులకు శుభవార్త

- కాళేశ్వరం అక్రమాలపై త్వరలోనే జ్యుడీషియల్ విచారణ
- కేసీఆర్ అవినీతి మోదీకి పట్టదా?
- బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి స్నేహం
- మేడారంలో మీడియాతో సీఎం రేవంత్



మేడారంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో సీతక్క

సాక్షిప్రతినిధి, వరంగల్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ పేదవారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఈనెల 27వ తేదీన ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన వెల్లడించారు. ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క–సారలమ్మలను సీఎం శుక్రవారం దర్శించుకున్నారు. తల్లులకు ఆయన నిలువెత్తు బంగారం (66 కిలోల బెల్లం), పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడారం మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీపై బ్యాంకులతో చర్చిస్తున్నామని, త్వరలోనే రైతులకు శుభవార్త చెబుతామన్నారు. అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మార్చి 2న మరో 6వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఉద్యోగాలు ఇచ్చినా ఇవ్వలేదంటూ మామాఅల్లుడు, తండ్రీకొడుకు తమ ప్రభుత్వంపై గోబెల్స్‌లా అబద్ధపు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.

కేసీఆర్ కుటుంబ దోపిడీపై బీజేపీ స్పందించలేదు

కాళేశ్వరం ప్రాజెక్టులో దోపిడీ, అక్రమాలు, నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్టు చూపామని, కేసీఆర్ కళ్లు మూసుకొని ఫాంహౌస్‌లో ఉండటంతోనే ఏపీ సీఎం కృష్ణాజలాలు తరలించుకుపోయారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులతో కేసీఆర్ దివాలా తీయించారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్లుగా దోపిడీకి పాల్పడుతుంటే పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగిన చందంగా ఏనాడూ ప్రధాని నరేంద్రమోదీ అడ్డుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డపై తాము జ్యుడీషియల్ విచారణకు అనుమతి ఇచ్చిన తర్వాత దానిని సీబీఐకి అప్పగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారని, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు కేసీఆర్, కేటీఆర్, ఆ కుటుంబంపై కేసు పెట్టారా, సీబీఐ, ఈడీ, ఐటీ అన్నీ కేంద్రం దగ్గరే ఉన్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ దోపిడీలో వాటా కోసమే తప్ప దానిపై చర్యలు తీసుకోవాలనే ఆలోచన బీజేపీ నేతలకు లేదన్నారు. త్వరలోనే రిటైర్డ్ హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల ఆధ్వర్యంలో సాగే విచారణను బీఆర్ఎస్ నాయకులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఇంజనీరింగ్ నిపుణుల కమిటీ నివేదికలు సిద్ధం చేస్తోందని, ఆ ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

తెలంగాణ సమాజానికి స్వేచ్ఛ ఇచ్చాం

గతంలో జర్నలిస్టులను సచివాలయంలోకి రానివ్వలేదని, ఇప్పుడు ప్రతీ చాంబర్‌కు వెళ్లే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తనను, సీతక్కను గతంలో సచివాలయానికి వెళ్లనివ్వలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందరికీ సచివాలయానికి వెళ్లే స్వేచ్ఛ ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఆ స్వేచ్ఛ ఇచ్చిందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి నిరంతరం చేస్తామని, జాతర వచ్చినప్పుడే కాకుండా నిరంతరం మంత్రులు సీతక్క, కొండా సురేఖ సహాయంతో ఈ ప్రాంత అభివృద్ధిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగుల్లో న్యాయం జరిగిందా లేదా అని ప్రభుత్వ ఉద్యోగులను అడగాలని ఆయన ప్రజలకు సూచించారు. గతంలో నెల చివర వరకు జీతాలు వచ్చేవికావని, మొదటి నెల నాలుగో తేదీన, రెండో నెలలో మొదటి తేదీన ఇవ్వడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఆశ్చర్యపోతున్నారని తెలిపారు.

మీడియా అకాడమీకి త్వరలో చైర్మన్

త్వరలోనే మీడియా అకాడమీకి చైర్మన్‌ను నియమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కాలేదని, పదేళ్లు ఓపిక పట్టారని, త్వరలోనే జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని తేవడంతోనే జర్నలిస్టుల పని అయిపోలేదని కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టడానికి సహకరించాలని కోరారు. వాళ్ల ఇద్దరి (బీజేపీ–బీఆర్ఎస్‌నుఉద్దేశించి) సమన్వయం మీకు తెలుసని, ఉదయం, సాయంత్రం మాట్లాడుకుంటున్నారన్నారు. పది సీట్లు బీజేపీకి, ఏడు సీట్లు కేసీఆర్‌కు మాట్లాడుకొని ఎన్నికలకు రాబోతున్నారని, ఆ చీకటి ఒప్పందాన్ని మీడియా మిత్రులు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

చేవెళ్ల సభతో శ్రీకారం..: చేవెళ్లలో భారీ బహిరంగ సభను నిర్వహించి.. ఆ సభలోనే రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీలను ప్రియాంకా గాంధీ చేతుల మీదుగా ప్రారంభించను న్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు పరిశీలించారు.

మేడారం సందర్శనకు మోదీ, అమిత్ షా రావాలి

దక్షిణ కుంభమేళాలాంటి మేడారం మహాజాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం జాతీయ పండగగా గుర్తించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము ఎన్నిసార్లు కోరినా అలా కుదరదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే వివక్ష చూపడం సరికాదని హితవు పలికారు. దక్షిణ భారతమనే కాదు ప్రపంచంలోనే సమ్మక్క–సారలమ్మ జాతరకు ఒక గుర్తింపు ఉందని, వారి వీరోచిత పోరాటానికి చరిత్ర పుటల్లో స్థానం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దని, ప్రధానమంత్రి వచ్చి దర్శించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సగం సీట్లపై స్పష్టత వస్తుందా?

- నేడు ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ
- రాష్ట్రంలో సగం లోక్‌సభ సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో శనివారం జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కీలక భేటీ తర్వాత రాష్ట్రంలో సగం లోక్‌సభ సీట్లకు పార్టీ అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆలస్యంగా అభ్యర్థులను ప్రకటించడంతో నష్టం జరిగిందన్న వాదనల నేపథ్యంలో ఇప్పుడు 17 ఎంపీ స్థానాల్లో సగం సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. బీజేపీ గెలిచిన 4 ఎంపీ సీట్లలో మూడింటిలో సిట్టింగ్ ఎంపీలను బరిలోకి దింపడంతో పాటు (ఆదిలాబాద్ మినహా), చేవెళ్ల, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, భువనగిరి, మెదక్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఎవరెవరు ఎక్కడెక్కడంటే...

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో వీరికి టికెట్లు ఖరారు కావొచ్చునని, కొన్ని స్థానాల్లో ఆయా నేతలు టికెట్ కోసం పోటీకి ఆసక్తి చూపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

- సికింద్రాబాద్: కిషన్‌రెడ్డి
- కరీంనగర్: బండి సంజయ్
- నిజామాబాద్: అర్వింద్ ధర్మపురి
- ఆదిలాబాద్: సోయంబాపూరావు లేదా బాపూరావు రాథోడ్, గుడెం నగేష్
- మల్కాజిగిరి: ఈటల రాజేందర్, మురళీధర్ రావు, చాడ సురేష్‌రెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, పొన్నాల హరీష్‌రెడ్డి
- జహీరాబాద్: ఎం.జైపాల్‌రెడ్డి, ఆలె భాస్కర్, అశోక్ ముస్తాపురే / ఓ ప్రముఖ సినీ నిర్మాత
- చేవెళ్ల: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గవర్నర్ బండారు దత్తాత్రేయ వియ్యంకుడు బి. జనార్దనరెడ్డి
- మహబూబ్‌నగర్: డీకే అరుణ, ఏపీ జితేందర్ రెడ్డి, శాంతకుమార్
- భువనగిరి: బి.నర్సయ్యగౌడ్, జి. మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి
- మెదక్: ఎం.రఘునందన్‌రావు, జి. అంజిరెడ్డి
- వరంగల్: మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, చింతా సాంబమూర్తి
- నాగర్‌కర్నూల్: బంగారుశ్రుతి, కేఎస్ రత్నం
- హైదరాబాద్: టి.రాజాసింగ్, మాధవీలత, భగవంతరావు,
- పెద్దపల్లి: టి.కుమార్ లేదా ఎవరైనా కొత్త నేతకు అవకాశం
- నల్లగొండ: మన్నె రంజిత్‌యాదవ్ లేదా పార్టీలో చేరే మరో నాయకుడికి
- మహబుబాబాద్: హుస్సేన్‌నాయక్ / మరొకరికి
- ఖమ్మం: దేవకీ వాసుదేవరావు, వినోద్‌రావు, రంగా కిరణ్

'మేడిగడ్డ' ఖర్చు ప్రభుత్వమే భరించాలి

మళ్లీ అగ్రిమెంట్ చేసుకుంటేనే పునరుద్ధరణ పనులు చేస్తాం

- అన్నారం గేట్లు ఎత్తి చేసిన పనులను దెబ్బతీశారు
- సాగునీటి పారుదలశాఖకు ఎల్అండ్‌టీ మరో లేఖ



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ, కాఫర్ డ్యాం నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్మాణసంస్థ ఎల్అండ్‌టీ మళ్లీ తేల్చిచెప్పింది. ప్రభుత్వం ఇచ్చిన డిజైన్‌తోనే బ్యారేజీని నిర్మించామని, అలాంటప్పుడు అందులో తలెత్తిన లోపాలకు తాము బాధ్యులం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈనెల 17న రామగుండం సీఈకి ఎల్అండ్‌టీ అధికారులు లేఖ రాశారు. అన్నారం బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఆ నీళ్లన్నీ మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌ను చుట్టుముట్టాయని, దీంతో తాము చేసిన పనులు దెబ్బతిన్నాయని ఆ లేఖలో పేర్కొంది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యంతో తాము చేసిన పనులు వృథా అయ్యాయని చెప్పింది. ఇందుకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంటే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పియర్లు (పిల్లర్లు), రాఫ్ట్ ఫౌండేషన్, కటాఫ్ వాల్స్, సకెంట్ పైల్స్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాల్సి ఉందని, పునరుద్ధరణ పనులు చేసే ఏడో బ్లాక్‌తోపాటు దానికి ఇరువైపులా ఉన్న బ్లాకులకు అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లో కాఫర్ డ్యాం నిర్మించాల్సి ఉందని ఈ లేఖలో స్పష్టం చేసింది. ఈ పనులు వ్యయ ప్రయాసలతో కూడుకున్నవని, అందుకే ప్రభుత్వం వాటికి మళ్లీ అగ్రిమెంట్ చేసుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. ప్రభుత్వం ఇందుకు సమ్మతిస్తేనే పునరుద్ధరణ పనులు చేస్తామని పేర్కొంది. గోదావరినదిలో కాపర్‌డ్యాం నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని, వర్క్‌అగ్రిమెంట్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరింది.

మళ్లీ మొదటికొచ్చిన మేడిగడ్డ పనులు

అన్నారం బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడానికి ముందు మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో ఇన్వెస్టిగేషన్స్ కొనసాగుతున్నాయనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదని, దీంతో ఆ పనులన్నీ మళ్లీ మొదటికొచ్చాయని ఎల్అండ్‌టీ ఆందోళన వ్యక్తం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబర్21న సాయంత్రం కుంగిపోయింది. బ్యారేజీ ఏడో బ్లాక్‌లోని 20వ నంబర్ పిల్లర్‌భూమిలోకి ఐదు అడుగులకుపైగా కుంగింది. దీంతో ఏడో బ్లాక్‌లోని నాలుగు పిల్లర్లు భారీగా, ఇంకో ఆరు పిల్లర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాలని నేషనల్‌డ్యాం సేఫ్టీ అథారిటీ ప్రిలిమినరీ రిపోర్టులోనే స్పష్టం చేసింది. బ్యారేజీలోని మిగతా బ్లాకులు దెబ్బతినకుండా ఉండేందుకు పగుళ్లు తేలిన పిల్లర్లు, వాటి రాఫ్ట్ ఫౌండేషన్‌తో సహా తొలగించేందుకు డైమండ్ కట్టింగ్ విధానం అనుసరించాలని నిర్ణయించారు. బ్యారేజీ కుంగిపోయినప్పుడు దానిని పరిశీలించిన ఎల్అండ్‌టీ అధికారులు తామే పునరుద్ధరిస్తామని ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ఒక్క రోజు ముందు (డిసెంబర్ 2న) బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత తమది కాదని ఎల్అండ్‌టీ బాంబు పేల్చింది. ఈమేరకు రామగుండం ఈఎన్సీకి ఎల్అండ్‌టీ అధికారులు లేఖ రాశారు. కాఫర్ డ్యాం నిర్మాణానికే రూ.55.75 కోట్లు ఖర్చవుతుందని, ఆ మొత్తం కూడా ప్రభుత్వమే భరించాలని కోరారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లు, ఎల్అండ్‌టీ అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతున్నాయి. బ్యారేజీని పునరుద్ధరించకుంటే ఎల్అండ్‌టీని బ్లాక్‌లిస్టులో పెట్టడంతో పాటు ఆ సంస్థ పొందిన బిల్లులను రెవెన్యూ రికవరీ యాక్ట్‌ప్రయోగించి వసూలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సీఎం ఘాటుగా హెచ్చరించిన తర్వాత కూడా ఎల్అండ్‌టీ అధికారులు అన్నారం బ్యారేజీ నుంచి నీటి విడుదలను సాకుగా చూపుతూ మేడిగడ్డ పునరుద్ధరణ తమ బాధ్యత కాదని మరో లేఖ రాశారు.

మళ్లీ ఒప్పందం చేసుకోండి

మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాఫర్ డ్యాంతోపాటు బ్యారేజీలో దెబ్బతిన్న పోర్షన్ పునరుద్ధరణకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ తిరిగి అగ్రిమెంట్ చేసుకోవాల్సిందేనని ఆ లేఖలో స్పష్టం చేసింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2022 జూన్29నపూర్తయ్యిందని, దీంతో దెబ్బతిన్న బ్యారేజీని పునరుద్ధరించడం తమ బాధ్యత కానేకాదని అందులో పేర్కొన్నారు. 2020లో బ్యారేజీ వద్ద కొట్టుకుపోయిన సీసీ బ్లాకులు సహా ఇతర పనులు చేయాలని కోరారని, ఆ సమయంలో వర్క్‌అగ్రిమెంట్‌లో లేని పనులను తాము చేపట్టలేమని స్పష్టత ఇచ్చామని గుర్తు చేశారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన డిజైన్లు ఇవ్వాలని అప్పుడే కోరినా బ్యారేజీ దెబ్బతినేంత వరకు ఇరిగేషన్‌డిపార్ట్‌మెంట్‌నుంచి తమకు ఎలాంటి డిజైన్లు కూడా అందలేదని లేఖలో ప్రస్తావించారు. బ్యారేజీ డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌పూర్తయిన తర్వాత జరిగిన లోపాలను తాము సరి చేయాలని కోరడం సరికాదని స్పష్టం చేశారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కాఫర్‌డ్యాంతో పాటు బ్యారేజీ పునరుద్ధరణకు కొత్తగా అగ్రిమెంట్‌చేసుకుంటే తప్ప తాము అక్కడ ఎలాంటి పనులు చేపట్టలేమని స్పష్టం చేశారు.

సిలిండర్‌కు ముందుగా పూర్తి డబ్బులు చెల్లించాల్సిందే!

ఆ తర్వాత నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ

- తెల్లరేషన్ కార్డు ఉండి దరఖాస్తు చేస్తేనే అర్హులు
- మార్గదర్శకాలు రూపొందించిన పౌరసరఫరాల శాఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చినప్పుడు ఆ మొత్తాన్ని వినియోగదారుల ఖాతాల్లో జమ చేసిన విధంగానే గృహలక్ష్మి పథకం(రూ.500కే గ్యాస్ సిలిండర్) కింద ఎంపికైన లబ్ధిదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పద్ధతిలో రీయింబర్స్ చేయనుంది. లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీని లెక్క కట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)లకు అందజేస్తే, సిలిండర్ రీఫిల్ సమయంలో లబ్ధిదారులు డబ్బులు మొత్తం చెల్లించిన తర్వాత.. ఆయిల్ కంపెనీలు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా డేటాబేస్ ప్రకారం రూ.500 పోను మిగిలిన మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాయి. అలాగే తెల్ల రేషన్‌కార్డు ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. దీనికి నిబంధనలతో కూడిన మార్గదర్శకాలను ఖరారు చేసింది. దీని ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. అర్హత గల కుటుంబం గత మూడేళ్లలో వినియోగించిన సిలిండర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటారు. దాని ఆధారంగానే లెక్క కట్టి ఆ మేరకు సబ్సిడీ ఇస్తారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, తెల్లరేషన్‌కార్డుల ఆధారంగా ప్రభుత్వం 40 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించింది. వీరు మూడేళ్లలో వినియోగించిన సిలిండర్ల సగటు ఆధారంగా ఏటా మూడు నుంచి ఐదు సిలిండర్లకు ఈ పథకం వర్తించనుంది. కాగా రాష్ట్రంలో కోటి 20 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. రాష్ట్రంలో ఉజ్వల పథకం కింద ఇప్పటికే సుమారు 10 లక్షల కుటుంబాలకి కేంద్ర ప్రభుత్వం నెలకు సుమారు రూ.300లకు పైగా సబ్సిడీ అందిస్తోంది. ఇప్పుడు వీరిని కూడా మహాలక్ష్మి పథకం కిందికి తీసుకురానున్నట్టు సమాచారం.

ప్రత్యేక ప్రతినిధి పదవికి రాజీనామా

- నాగర్‌కర్నూల్ ఎంపీ సీటుకు బరిలో ఉంటా: మల్లు రవి
- లోక్‌సభ టికెట్‌కు పదవి అడ్డురాకూడదనే రాజీనామా



జడ్చర్ల టౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూలు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి సిద్ధంగా ఉన్నానని, నాయకులు, కార్యకర్తలు ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా తన గెలుపు కోసం రెండు నెలలు శ్రమించాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లురవి స్పష్టం చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం పార్టీలో ఒక వ్యక్తికి ఒకే పదవి అనే నిబంధన మేరకు తనకు లోక్‌సభ టికెట్ కేటాయింపులో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి అడ్డుగా ఉంటుందని ఆ పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. వారం రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డికి తన రాజీనామాను సమర్పించానని, సమయం, సందర్భం రానందున బహిర్గత పరచలేదని తెలిపారు. శుక్రవారం జడ్చర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనకు ప్రత్యేక ప్రతినిధిగా పదవి ఇచ్చినపుడే సీఎం రేవంత్‌తో చర్చించానని, ఎంపీ టికెట్‌కు అడ్డు రాకుండా ఉంటేనే బాధ్యతలు స్వీకరిస్తానని చెప్పానన్నారు. పదేళ్లుగా అనేక ఫైళ్లు ఢిల్లీలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పటంతో ఈ బాధ్యతలు స్వీకరించి అనేక శాఖల్లో ఫైళ్లలో కదలిక తీసుకువచ్చానన్నారు. తన రాజీనామాను ఆమోదించే వరకు ఢిల్లీలో బాధ్యతలు నిర్వహిస్తానని చెప్పారు. అయితే తనకు టికెట్ రావడంలేదని ప్రచారం జరుగుతున్నందున కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలందరూ తనకు మద్దతుగా ఉన్నారని తెలిపారు. పార్టీ టికెట్ ఆశిస్తున్న మంద జగన్నాథం, సంపత్‌కుమార్‌లకు తాను వ్యతిరేకం కాదని, వారికి టికెట్ అడిగే హక్కు ఉందని అన్నారు. పార్టీ సర్వేలన్నీ తనకు అనుకూలంగా ఉన్నాయని, టికెట్ ఇవ్వకూడదని ఏ ఒక్క కారణం చెప్పినా.. సర్వేలు అనుకూలంగా లేవని తేలినా తాను స్వీకరిస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు!


- దేశంలో ఆ పార్టీ పనైపోయింది
- ఎన్నికల తర్వాత రాహుల్ విదేశాలకు వెళ్లిపోతారు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



బెల్లంపల్లి: దేశంలో కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ విజయసంకల్ప యాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బజార్‌ఏరియా కాంటా చౌరస్తాలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో నెలకొన్న సమస్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమన్నారు. 75ఏళ్లపాటు పాలించి రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని స్వయంగా ఆ పార్టీ నాయకులే వద్దనుకుంటున్నారనీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత రాహుల్ విదేశాలకు వెళ్లిపోవడం తథ్యమని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 40 సీట్లకే పరిమితం అవుతుందని, బీజేపీకి 370కి పైగా సీట్లు వస్తాయని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్నాయని చెప్పారు.

పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు..

తెలంగాణ ప్రజల పరిస్థితి పెనంలో నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పాలన సాగించిన కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుని, అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలన చూసిన తర్వాత ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందంగా మారిందన్నారు. సభలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు అమురాజుల శ్రీదేవి, బోడిగ శోభ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో ఒక్కటి చాలు

మిగతా సీట్లలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీకి మద్దతిస్తాం: రాఘవులు

సాక్షి, హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో తమ బలం మేరకు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనే పోటీ చేసి మిగతా స్థానాల్లో బీజేపీని ఓడించే ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీకి మద్దతిస్తామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ప్రకటించారు. నగరంలో రెండు రోజులపాటు జరిగిన సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రాఘవులు మీడియాతో మాట్లాడుతూ.. ఇండియా కూటమిలోని పార్టీలను కలుపుకొని పోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. బీజేపీవైపు ఉంటారా? దూరంగా ఉంటారా? బీఆర్ఎస్ పార్టీనే తేల్చుకోవాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు బీఆర్ఎస్ ముందుకొస్తే సహకరిస్తామని చెప్పారు. కేంద్రం పదేళ్లలో తెలంగాణకు చేసిన అన్యాయంపై శ్వేతపత్రం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు. మూసీ శుద్ధికి కేంద్రం నిధులివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కోరాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను బట్టి ప్రతి చర్య ఉంటుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి స్పష్టం చేశారు.

ప్రతి పంటనూ కొనుగోలు చేయాలి

- మార్క్‌ఫెడ్ అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల ఆదేశం
- రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: మద్దతు ధర ఉన్న ప్రతి పంటనూ కొనుగోలు చేయాలని, ఈ మేరకు కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సాగవుతున్న ప్రతి పంటకూ కొనుగోలు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణలో ఏ ఒక్క రైతు కూడా మద్దతు ధర రాక నష్టపోకూడదన్నారు. రైతులకు మార్కెట్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన కోరారు. ఏ పంటకైనా మద్దతు ధర కంటే తక్కువ వస్తే వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మిర్చి పంట పెద్దఎత్తున మార్కెట్ కు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవసరమైతే సెలవు దినాలలో కూడా క్రయవిక్రయాలు జరిగేటట్లు చూడాలని మంత్రి ఆదేశించారు.

మిగిలిన వారికి త్వరలో రైతుబంధు సాయం..

యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు బంధు సాయం ఇప్పటికే 54,29,645 మంది రైతులకు అందజేశామని మంత్రి తుమ్మల తెలిపారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. ఇప్పటికే 110 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించామనీ, మిగతావాటిలో కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. వ్యవసాయ, మార్కెట్ కమిటీలలో నిరుపయోగంగా ఉన్న అన్ని భూసార పరీక్ష కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి కావాల్సిన అన్నిరకాల విత్తనాలను ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. మార్కెట్లకు కల్తీ విత్తనం రాకుండా చర్యలు తీసుకోవాలని, ఏ కంపెనీ అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ బి.గోపి, మార్కెటింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.





బీఆర్ఎస్ నేతలతో కలసి నందిత పార్థివదేహం వద్ద కేసీఆర్ నివాళి. నందితకు నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సీఎం రేవంత్



రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

▶ మొదటి పేజీ తరువాయి

మృతిచెందారు. వాహనం నడిపిన ఆమె పీఏ ఆకాష్ కాళ్లు విరిగాయి. కారు గంటకు సుమారు 100 కి.మీ. వేగంతో వెళ్తుండటంతో ప్రమాద తీవ్రతకు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ప్రమాద వార్త తెలియగానే హైవే పెట్రోల్, స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఎమ్మెల్యే లాస్య నందిత, డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించగా నందిత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు వెళుతున్న క్రమంలో..

ఎమ్మెల్యే లాస్య నందిత తన అక్క కూతురు స్కూల్‌లో చేరుతుండటంతో రెండు వాహనాల్లో కుటుంబ సభ్యులతో కలసి గురువారం రాత్రి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూరు సమీపంలోని సూఫీ మిస్కిన్ దర్గాను దర్శించుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు అక్కడే ఉన్నారు. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో హైదరాబాద్ చేరుకున్నారు. ఇతర కుటుంబ సభ్యులను వారి నివాసాల్లో దింపిన అనంతరం ఆకలి వేస్తుండటంతో బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు శామీర్‌పేట వైపు నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న క్రమంలో ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నట్లు సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు ప్రకటించారు. డ్రైవర్ ఆకాష్ అకస్మాత్తుగా నిద్ర మత్తులోకి జారుకోవడంతో ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టి ఆపై రైలింగ్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోందని... ఆ సమయంలో ఎమ్మెల్యే లాస్య సీటు బెల్టు పెట్టుకున్నట్లే ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా, లాస్య నందిత కారు ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనాన్ని జహీరాబాద్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

అక్క పిలుస్తోంది.. వెళ్లొస్తానని చెప్పి..

ఆకాశ్‌కు ఎమ్మెల్యే నుంచి ఫోన్ రావడంతో అక్క దగ్గరికి వెళ్తున్నానంటూ ఇంట్లో వాళ్లకు చెప్పి బయలుదేరినట్లు తెలిసింది. ఆకాశ్ తండ్రి శ్రీనివాస్ కంటోన్మెంట్‌లో దఫేదార్‌గా పని చేసి రెండేళ్ల క్రితం బ్రెయిన్‌డెడ్‌కు గురై మరణించారు. మడ్‌ఫోర్ట్‌లో నివసించే ఆకాశ్ ఇటీవలే కానిస్టేబుల్ రాత పరీక్షల్లో ఉత్తీర్ణుడైనట్లు అతని సన్నిహితులు పేర్కొంటున్నారు. లాస్య నందిత చిన్నమ్మ కొడుకు పీయూష్ రాఘవ, ఆకాశ్ స్నేహితులు. ఈ క్రమంలోనే పీయూష్ ద్వారా లాస్య కు ఆకాశ్ పరిచయం అయ్యాడు. ఇంటి మనిషిగా వ్యక్తిగత పనులపై వెళ్లినప్పుడు తరచూ ఆకాశ్‌తోనే ఆమె బయటకు వెళ్లేవారని తెలుస్తోంది. 10 రోజుల క్రితం నల్లగొండలో లాస్య కారు ప్రమాదానికి గురైన సమయంలో పీయూష్ ఆ వాహనాన్ని నడపగా శుక్రవారం నాటి ప్రమాదంలో ఆకాశ్ వాహనాన్ని నడపడం గమనార్హం.



నందిత అంతిమ యాత్రలో పాడె మోస్తున్న పల్లా, ప్రశాంత్‌రెడ్డి, హరీశ్, కౌశిక్‌రెడ్డి తదితరులు



ఆస్పత్రిలో ఆకాశ్

కుటుంబానికి అండగా ఉంటాం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో కష్టకాలంలో ఉన్న ఆమె కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఇటీవల నల్లగొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందితను పరామర్శించి వారం కాకముందే ఆమె లేరనే వార్తను వినాల్సి వస్తుందని అనుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

కేసు నమోదు: ఈ ఘటనలో ఎమ్మెల్యే లాస్య నందిత పీఏ ఆకాష్‌పై పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 304 కింద కేసు పెట్టారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపారని లాస్య సోదరి నివేదిత ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు పటాన్‌చెరు పోలీసులు తెలిపారు.



చర్లపల్లి వద్ద ప్రమాదం..



లిఫ్ట్ కూలినప్పుడు...

సీఎం రేవంత్, కేసీఆర్ సహా నేతల నివాళి...

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్యే లాస్య నందిత పార్థివదేహానికి సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్, స్పీకర్ ప్రసాద్‌రావు సహా పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కార్ఖానాలోని స్వగృహానికి ఆమె పార్థివ దేహాన్ని తరలించగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్, హరీశ్‌రావు మరికొందరు నేతలు ఆమె నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా పలువురు ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. సాయంత్రం ఈస్ట్ మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో లాస్య నందిత అంత్యక్రియలు జరిగాయి.

లాస్యను వెంటాడిన వరుస ప్రమాదాలు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను రెండు నెలలుగా వరుస ప్రమాదాలు వెంటాడాయి. గతేడాది డిసెంబర్ 3న ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య అదే నెల 24న బోయిన్‌పల్లిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నూతన విభాగం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వెళ్లారు. మూడో అంతస్తుకు వెళ్లే క్రమంలో ఒకటో అంతస్తుకు రాగానే లిఫ్ట్ కూలిపోయింది. లిఫ్ట్‌ను బద్దలు కొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చారు. ఈ ఏడాది జనవరి మూడో వారంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ నెల 13న నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొని తిరిగి వస్తుండగా చర్లపల్లి వద్ద ఆమె కారు ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో ట్రాఫిక్ హోంగార్డు మృతి చెందాడు. ఈ రెండు ఘటనల నుంచి తేరుకోకముందే లాస్య నందిత ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గమనార్హం.

ఏడాది వ్యవధిలోనే తండ్రి, కూతురు మృతి

కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న గతేడాది ఫిబ్రవరి 19న మరణించారు. ఇటీవలే సాయన్న ప్రథమ వర్ధంతిని నిర్వహించగా అది జరిగిన 4 రోజులకే నందిత మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కంటోన్మెంట్ వాసులు సాయన్నను తమ కుటుంబ సభ్యుడిగానే భావించేవారు. సాయన్న మరణానంతరం ఆయన కుమార్తె లాస్యను 17వేల ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించారు. రెండున్నర నెలల్లోనే లాస్య మృతి చెందడంపట్ల స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.



పదేళ్లలో ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల మృతి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ఏర్పాటు తర్వాత గడిచిన పదేళ్లలో ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ ఐదేళ్ల పదవీకాలం పూర్తికాక ముందే మృత్యువాత పడ్డారు.

- తొలి శాసనసభ (2014–18) కాలంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల కృష్ణారెడ్డి 2015 ఆగస్టు 25న, పాలేరు ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకట్‌రెడ్డి 2016 మార్చి 4న అనారోగ్యంతో మరణించారు. ఇద్దరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే.
- రెండోటర్మ్ (2018–23)లో దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి 2020 ఆగస్టు 6న, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య 2020 డిసెంబర్ 1న, కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న 2023 ఫిబ్రవరి 19న అనారోగ్యంతో మృతి చెందారు. ముగ్గురూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే.
- కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మూడు నెలల్లోపే లాస్య నందిత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.



పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

రెడ్కో అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: మారుతున్న కాలమాన పరిస్థితులు, కేంద్రంతో పాటు ఇతర సంస్థల నుంచి అందుతున్న ఆర్థిక సాయం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క టీఎస్ రెడ్కో అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తికి అవకాశాలు, ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులపై ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రజాభవన్‌లో శుక్రవారం రెడ్కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత పద్ధతుల్లో విద్యుదుత్పత్తి చేసే వనరులపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. బహిరంగ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సాగునీటి జలాశయాలను గుర్తించి వాటిపై సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. అయిదేళ్లుగా పునరుత్పాదక విద్యుదుత్పత్తి విధానం కూడా లేకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా ఉపయోగించుకోలేకపోయామని అభిప్రాయపడ్డారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి అవసరమైన అన్ని శాఖల భాగస్వామ్యంతో మరోమారు సమీక్ష జరుపుతామని పేర్కొన్నారు.

'బీజేపీ నేత ప్రభాకర్‌పై న్యాయ పరమైన చర్యలు'

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీకి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు బెంజ్ కారు కొనిచ్చారని ఆరోపణలు చేసిన ప్రభాకర్‌కు త్వరలోనే లీగల్ నోటీసులు పంపనుంది. తన ప్రతిష్టకు భంగం కలిగేలా ఆరోపణలు చేసిన బీజేపీ నాయకుడు ప్రభాకర్‌పై కోర్టుకెళ్లాలని మున్షీ నిర్ణయించుకున్నారని, ఈ మేరకు న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతున్నారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది. శుక్రవారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చిన మున్షీ.. ఇదే అంశంపై చాలాసేపు పార్టీ నేతలతో చర్చలు జరిపారు. మరోవైపు టీపీసీసీ వర్గాలు కూడా న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నాయి.

ఆధారాలతో నిరూపిస్తా..: మహేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్ (హైదరాబాద్): చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అవినీతి చిట్టా తమ దగ్గర ఉందని ఎక్కడికి రావాలో చెబితే అక్కడకు వచ్చి ఆధారాలతో సహా నిరూపిస్తానని బీజేపీ శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి అసైన్డ్ భూములను బడా పారిశ్రామికవేత్తలు తమ స్నేహితులకు తక్కువ ధరకు కట్టబెట్టి కోట్లు గడించారని ఆయన ఆరోపించారు. కాటేదాన్‌లోని టీఎల్ఎం గార్డెన్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... రంజిత్‌రెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా దేవాలయ భూములు 4.18 ఎకరాలు కబ్జా చేసి కేటీఆర్ భాగస్వామ్యంతో అపార్ట్‌మెంట్ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సీతారాంపూర్‌లో 1,100 ఎకరాలు, షాబాద్ మండలంలోని చందనవెల్లిలో 1,600 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు వారి స్నేహితులకు, బంధువులకు ఇప్పించి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొట్టారని ఆరోపించారు. రోహిణి మినరల్స్ పౌల్ట్రీ ఫుడ్, మొక్కజొన్నల కుంభకోణం వంటి అనేక అక్రమాల్లో రంజిత్‌రెడ్డి పాత్ర ఉందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీటుబెల్ట్ ధరించినా తీవ్రత ఎలా!



ఎమ్మెల్యే మృతి ఘటనపై పోలీసుల లోతైన విచారణ

- సీట్ బెల్ట్ సరిగ్గా పెట్టుకోకపోయి ఉండొచ్చంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను బలితీసుకున్న రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఎమ్మెల్యే నందిత ప్రయాణించిన కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడాన్ని పరిగణనలోకి తీసుకున్న సంగారెడ్డి జిల్లా పోలీసులు ఆమె సీట్ బెల్ట్ ధరించే ఉండచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రమాద తీవ్రత ఫలితంగా అది ఊడిపోయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదం అనంతరం కారు స్థితిగతులు, లాస్య మృతదేహం పడున్న పరిస్థితి, ఆమెకు అయిన గాయాలను పరిగణనలోకి తీసుకున్న రవాణా రంగ నిపుణులు మాత్రం సీట్ బెల్ట్ సరిగ్గా పెట్టుకోకపోయి ఉండొచ్చని అంటున్నారు. ప్రమాద సమయంలో లాస్య కారులో డ్రైవర్ పక్కన ఉన్న ఫ్రంట్ సీటులో కూర్చుని ప్రయాణిస్తున్నారు. నేరుగా కూర్చున్న స్థితిలో కాకుండా వెనక్కు వాలి పడుకున్నారు. సీట్ ఈ స్థితిలో ఉన్నప్పుడు ప్రమాదం జరిగినా... సీటులో ఉన్న వారు ముందుకు రావడంతో ఏర్పడే ఫోర్స్ సీట్ బెల్ట్ బకెల్ ఊడిపోయే స్థాయిలో ఉండదని చెప్తున్నారు. లాస్య సీట్‌బెల్ట్ సరిగ్గా ధరించి ఉంటే... అన్ని గాయాలకు ఆస్కారం లేదని చెప్తున్నారు. దీన్ని బట్టి అలారం బజర్ రాకుండా ఆమె సీటు బెల్ట్‌ను ముందే పెట్టేసి దాన్ని ఆనుకుని కూర్చుని ఉండొచ్చని, ఫలితంగా సీట్ వెనక్కు వాలినప్పుడు ఆ బెల్ట్ ఆమె ఛాతీ భాగంలో కాకుండా వీపు భాగంలో ఉండి ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు.

సీట్ బెల్టులు సరిగ్గా పెట్టుకోకుంటే..

ఇటీవల కాలంలో మార్కెట్‌లోకి వస్తున్న దాదాపు అన్ని కార్లలో ఎయిర్‌బ్యాగ్ తప్పనిసరి అయింది. కొన్ని వాహనాల్లో దీనికి సీట్ బెల్ట్‌కు మధ్య లింకు ఉంటోంది. వాహనం ప్రమాదానికి గురైనప్పుడు అవి తెరుచుకోవాలంటే దానికి సంబంధించిన సెన్సర్లు యాక్టివేట్ కావాలి. ఇవి ఏసీయూకు (ఎయిర్‌బ్యాగ్ కంట్రోల్ యూనిట్) అనుసంధానించి ఉంటాయి. యాక్సిల్‌లో మీటర్ సెన్సర్ (యాక్సిల్‌లో మీటర్ స్పందన ఆధారంగా యాక్టివేట్ అయ్యేవి), ఇంపాక్ట్ సెన్సర్ (ఢీకొన్నప్పుడు యాక్టివేట్ అయ్యేవి), సైడ్ రోడ్ ప్రెజర్ సెన్సర్స్ (పక్క తలుపులపై పడే ఒత్తిడి ఆధారంగా యాక్టివేట్ అయ్యేవి), వీల్ స్పీడ్ సెన్సర్స్ (చక్రం స్పీడ్ ఆధారంగా పని చేసేవి), బ్రేక్ ప్రెజర్ సెన్సర్స్ (బ్రేక్ కొట్టిన తీరు ఆధారంగా యాక్టివేట్ అయ్యేవి) కార్లకు ఉంటాయి. కొన్ని మోడల్స్‌లో ఇవన్నీ ఉండగా, మరికొన్నింటిలో కొన్ని మాత్రమే ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు ఒత్తిడి కారణంగా ఇవన్నీ యాక్టివేట్ అయి ఓ యాంగిల్ ఏర్పరుచుకుని ఏసీయూకు సందేశం ఇవ్వడంతో అది బెలూన్‌ను యాక్టివేట్ చేసి తెరుచుకునేలా చేస్తుంది. ఈ ప్రక్రియ సెకనులోపు సమయంలోనే జరుగుతుంది. సీటు బెల్టులు పెట్టుకోకపోతే కొన్ని వాహనాల్లో ఎయిర్ బ్యాగ్స్ యాక్టివేట్ కావు.

మితిమీరిన వేగంలో ఎయిర్‌బ్యాగ్స్ పనిచేయలేవు

హైఎండ్ కార్లు అయినప్పటికీ... అనేక సెక్యూరిటీ ఫీచర్స్ ఉన్నప్పటికీ కొన్ని ప్రమాదాల నుంచి ఎయిర్‌బ్యాగ్స్ సైతం కాపాడలేవు. మితిమీరిన వేగమే దానికి కారణం. కొన్ని ప్రమాదాల్లో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అయినప్పటికీ అవి డ్రైవింగ్ చేస్తున్న, పక్కన కూర్చున్న వారి ప్రాణాలను కాపాడలేవు. యాక్సిడెంట్ జరిగినప్పుడు సెన్సర్లు యాక్టివేట్ అయి, ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడానికి కొంత సమయం పడుతుంది. సాధారణంగా ఇది 0.05 సెకన్‌గా ఉంటుంది. వాహనం మితిమీరిన వేగంతో ఉన్నప్పుడు ఈ సమయంలోపే డ్రైవర్, ప్రయాణికులు స్టీరింగ్, డాష్‌బోర్డ్, ముందు సీటు, పక్కడోర్లకు బలంగా ఢీ కొట్టుకుంటారు. రోడ్డు ప్రమాదంతో వాహనం ఛిద్రమైపోయిన సందర్భాల్లోనూ ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకున్నా ఉపయోగం ఉండదని నిపుణులు చెప్తున్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ జన్నత్‌హుస్సేన్ కన్నుమూత

వైఎస్ హయాంలో సీఎంఓ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్‌హుస్సేన్ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 1977 బ్యాచ్‌కు చెందిన ఆయన డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఆయన సీఎంఓ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. వైఎస్ ఆదేశాల మేరకు ఉచిత విద్యుత్ అమలు చేసే తొలి ఫైలు రూపొందించి, విధివిధానాలు తయారు చేయడంలో జన్నత్‌హుస్సేన్ కీలకపాత్ర పోషించారు. ఆ ఫైలుపై వైఎస్ సంతకం చేస్తున్న దృశ్యం అందరికీ ఇప్పటికీ గుర్తుంటుంది. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జన్నత్‌హుస్సేన్ 33 ఏళ్ల సర్వీసు అనంతరం 2010లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేశారు. జన్నత్‌హుస్సేన్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని కుమారుని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆరేళ్లుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన సర్వీసులో ఉన్న సమయంలో మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీలు, వెనుకబడినవర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. ముఖ్యమంత్రి రోశయ్య 2010లో జన్నత్‌హుస్సేన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమించగా, 2015 వరకు పనిచేశారు. జన్నత్ హుస్సేన్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.





ఏ విధంగానైతే సూర్యుడు ఒక్కడై ఉండీ ఈ సమస్త విశ్వాన్నీ ప్రకాశింపజేస్తాడో, అదేవిధంగా సర్వభూతాల్లోనూ అంతర్యామిగా ఉండే పరమాత్మ ఒక్కడే.
– కఠోపనిషత్తు

సాక్షి
శనివారం, 24 ఫిబ్రవరి 2024

ఉక్రెయిన్ పోరు దారెటు?!

'ఇక్కడ బతుకు దుర్భరంగా వుంది. స్వీయానుభవంలోకి రాకుండా దీన్నర్థం చేసుకోవటం పూర్తిగా అసాధ్యం' అని తన సన్నిహితుడికి రాసిన లేఖలో రష్యాలోని అతి శీతలమైన ఆర్కిటిక్ ప్రాంత కారాగారంలో ఇటీవల కన్నుమూసిన అసమ్మతివాది అలెక్సీ నవాల్నీ అన్నారట. రెండేళ్లు పూర్తయి మూడో యేట ప్రవేశించిన ఉక్రెయిన్ యుద్ధం కూడా అటువంటి పరిస్థితుల్నే సృష్టించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రారంభించిన ఈ దురాక్రమణ యుద్ధం పర్యవసానంగా అటు రష్యా సైనికులూ... ఇటు ఉక్రెయిన్ సైనికులూ, పౌరులూ కూడా చెప్పనలవికాని యాతనలు పడుతున్నారు. ఈ యుద్ధం నిరుడు రెండో ఏడాదిలో ప్రవేశించే సమయానికి ఉక్రెయిన్ పౌరుల్లో కాస్తయినా విశ్వాసం వుండేది. వచ్చే వేసవిలో రష్యా సైనికులను తరిమేయగలమని నమ్మేవారు. ఇప్పుడు అదంతా ఆవిరైంది. 2025 నాటికి మెరుగైన ఫలితాలొస్తాయని తాజాగా పాశ్చాత్య మీడియా నమ్మబలుకుతోంది. అమెరికా అండదండలతో పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు దండిగా ఆయుధాలు, ట్యాంకులు, యుద్ధ విమానాలు, క్షిపణులు అందించటంతోపాటు రష్యాపై ఆంక్షలు కూడా విధించాయి. 1945 తర్వాత యూరోప్ దేశాలన్నీ చిక్కుకున్న ఈ భారీ యుద్ధం ఎటు పోతుందో, చివరికేమవుతుందో ఎవరి అవగాహనకూ అందటం లేదు. ఈమధ్యే అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటో కూటమి దేశాలను హెచ్చరించారు. తమ తమ జీడీపీల్లో రక్షణకు 2 శాతంకన్నా తక్కువ వ్యయం చేసే యూరోప్ దేశాలకు తాను గద్దెనెక్కిన తర్వాత సహకరించబోనని ప్రకటించారు. పైగా యూరోప్‌ను 'మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండ'ని రష్యాకు చెబుతానన్నారు. ఆయన మళ్లీ అధ్యక్షుడు కావటం ఖాయమని దాదాపు సర్వేలన్నీ చెబుతున్నాయి.

ఈనాటికీ 18 శాతం ఉక్రెయిన్ భూభాగం రష్యా అధీనంలో వుంది. అక్కడా, ఇతరచోట్లా ఉక్రెయిన్ పౌరులు భయంతో బతుకులీడుస్తున్నారు. అంతేకాదు... రష్యా క్షిపణి దాడులు జరిగిన ప్రతిసారీ సమీప బంధువులనూ, స్నేహితులనూ కూడా అనుమాన దృక్కులతో చూసే ధోరణి మొదలైంది. కొందరు రష్యాకు అమ్ముడుపోయి క్షిపణి దాడులకు కారణమవుతున్నారన్న అభిప్రాయం అందరిలోనూ వుంది. ఇరాన్, ఉత్తర కొరియాలు రష్యాకు అవసరమైన డ్రోన్లు, క్షిపణులు అందిస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే సైనికులకు అవసరమైన సామగ్రిని తుర్కియే సరఫరా చేస్తోంది. చైనానుంచి పేలుడు పదార్థాల్లో వినియోగించే రసాయనాలు వస్తున్నాయి. 2022 ఫిబ్రవరి మొదలుకొని ఇంతవరకూ రష్యా ఆదాయాన్ని 433 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ. 35,500 కోట్లు) గండికొట్టగలిగామని పాశ్చాత్య దేశాలు సంబరపడుతున్నా రష్యా దూకుడు తగ్గలేదు. యుద్ధరంగంలో రష్యా వినియోగిస్తున్న ఆయుధాల్లోని 95 శాతం విడిభాగాలు అమెరికా, పాశ్చాత్య దేశాల్లో తయారైనవేనన్నది కియూవ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యయన సారాంశం. సీఐఏ డైరెక్టర్ బిల్ బర్న్స్ చెప్తున్న ప్రకారం ఇంతవరకూ 3,15,000 మంది రష్యా సైనికులు ఈ యుద్ధంలో మరణించటమో, గాయపడటమో జరిగింది. మూడింట రెండువంతుల శతఘ్నులు ధ్వంసమయ్యాయి. రక్షణ కేటాయింపులు పెంచే విధానానికి స్వస్తిచెప్పి ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని యుద్ధకాల ఆర్థిక వ్యవస్థగా (వార్ ఎకానమీ) రష్యా మార్చిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థతగల నాయకుడనీ, యుద్ధ హీరో అని పాశ్చాత్య మీడియా కీర్తించటంవల్ల ఒరిగేదేమిటో అర్థంకాదు. గతంతో పోలిస్తే ఆయన రేటింగ్స్ పడిపోయాయన్నది వాస్తవం. ముఖ్యంగా కమాండర్ ఇన్ చీఫ్ జలూజినీని తొలగించటం, కియూవ్ నగర మేయర్‌తో విభేదాలు జెలెన్‌స్కీ ప్రతిష్టను దెబ్బతీశాయి. ఉక్రెయిన్‌కు మరో ఆరువేల కోట్ల డాలర్ల ఆర్థిక సాయానికి అమెరికా సెనేట్ గతవారం అంగీకారం తెలిపినా రిపబ్లికన్లకు ఆధిక్యతవున్న ప్రతినిధుల సభలో ఏమవుతుందో తెలియదు. కొత్త ఆయుధాల సరఫరాకు ఇప్పటికే రిపబ్లికన్లు బ్రేక్ వేశారు. ఉక్రెయిన్‌కు అందించదలచుకున్న సాయం విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను వెదకాలన్న సూచనలు రావటం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమస్యాత్మకమే.

ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించి, యుద్ధ నేరాలకు మూల్యం చెల్లించేలా రష్యాపై అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిళ్లు పెంచటమే ఇప్పుడున్న ఏకైక మార్గం. ఈ బాధ్యతను అమెరికా, పాశ్చాత్య దేశాలు విస్మరిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ పోతే అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాల ఆయుధ పరిశ్రమలకు ఆర్డర్లు పెరుగుతాయితప్ప ఒరిగేదేమీ వుండదు. ఉక్రెయిన్ గెలుపు గురించీ, రష్యాపై తీసుకునే చర్యల గురించీ ఆర్భాటంగా మాట్లాడుతున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు యుద్ధం మొదలై రెండేళ్లవుతున్నా తమ దేశాల్లోని రష్యా ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవటంలో వెనకడుగేస్తున్నాయి. వివిధ ఫైనాన్షియల్ కంపెనీల్లో వున్న 30,000 కోట్ల డాలర్ల విలువైన రష్యా ఆస్తుల్ని యుద్ధం మొదలైన రోజుల్లోనే స్తంభింపజేశారు. కానీ వాటి స్వాధీన ప్రక్రియను ప్రారంభిస్తే డాలర్ల రూపంలో నిధులు డిపాజిట్ చేసే విధానానికి చాలా దేశాలు స్వస్తి చెబుతాయన్న భయం అమెరికాకు ఉంది. ఇలా తమ ఆర్థిక వ్యవస్థల గురించీ, భవిష్యత్తు గురించీ ఆచి తూచి అడుగు లేస్తున్న సంపన్న దేశాలు ఈ యుద్ధాన్ని ఆపటంపై మాత్రం దృష్టి సారించటం లేదు. ఉక్రెయిన్ పోరునూ, గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న దారుణ మారణకాండనూ ఇకనైనా నిలువరించకపోతే అన్ని దేశాలూ పెను సంక్షోభంలో కూరుకుపోతాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా చూడటం అందరి కర్తవ్యం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** పౌర్ణమి సా.5.10 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** మఖ రా.9.44 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.8.32 నుండి 10.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.25 నుండి 7.56 వరకు, **అమృతఘడియలు:** రా.7.05 నుండి 8.53 వరకు, మాఘ పౌర్ణమి.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సహనం, సహజీవనం బాటలో...

విశ్లేషణ


వివేక్ కాట్జూ

యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ ఇచ్చిన 27 ఎకరాల స్థలంలో స్వామినారాయణ సంస్థ అక్కడ భారీ హిందూ దేవాలయాన్ని నిర్మించింది. ముస్లిమేతర విశ్వాసాలను బహిరంగంగా పాటించడానికి కూడా ఒకప్పుడు అనుమతి లేని ఆ దేశంలో ఇది చాలా పెద్ద మార్పు. స్పష్టంగా, బిన్ జాయెద్ ఇస్లాం శాంతి మతం మాత్రమే కాదు, అది ఇతర ఆధ్యాత్మిక అన్వేషణలను అంగీకరిస్తుందని చూపించాలనుకుంటున్నారు. దీనిపై సంప్రదాయ ఉలేమా నుండి వచ్చివుండిన వ్యతిరేకతను కూడా ఆయన అధిగమించగలిగారు. యూఏఈ పూర్తి స్థాయి సహనం, సహజీవన మంత్రిత్వ శాఖను కలిగివుంది. ముల్లా ఒమర్ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన మూడు దేశాలలో యూఏఈ ఒకటనే వెలుగులో చూస్తే వారి ఈ ప్రయాణం అద్భుతమైనది.

ఫిబ్రవరి 13–14 తేదీలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటన సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అబూ ధాబీలో, బోచాసన్ వాసీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ(బాప్స్) సంస్థ నిర్మించిన హిందూ దేవాలయాన్ని ప్రారంభించారు. యూఏఈ అధ్యక్షుడు, అబూ ధాబీ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నాహయాన్ (ఎంబీజెడ్) ఇచ్చిన 27 ఎకరాల స్థలంలో ఈ ఆలయాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, స్వామి నారాయణ్ సంస్థ దివంగత అధినేత ప్రముఖ్ స్వామి మహరాజ్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమ సంబంధం 'తండ్రీ కొడుకుల మాదిరిగానే ఉండేది' అని చెప్పారు. 'ప్రముఖ్ స్వామి మహరాజ్ కలను సాకారం చేయడంలో నేను సహాయపడినందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు. ప్రముఖ్ స్వామి మహరాజ్ 1997లో యూఏఈని సందర్శించినప్పుడు అబూ ధాబీలో ఒక ఆలయాన్ని నిర్మించాలని కోరుకున్నారు.

షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ సహనం, విభిన్న విశ్వాసాల మధ్య అవగాహన, సహజీవనం వంటి ధర్మాలకు కట్టుబడి ఉన్నారు. దుబాయ్‌లోని జెబెల్ అలీ ప్రాంతంలో పెద్ద హిందూ దేవాలయం, గురుద్వారా నిర్మాణానికి అనుమతించిన దేశ ఉపాధ్యక్షుడు, దుబాయ్ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కూడా బిన్ జాయెద్ అభిప్రాయాలను గణనీయమైన స్థాయిలో పంచుకుంటున్నారు. యూఏఈ ప్రభుత్వం పూర్తి స్థాయి సహనం, సహజీవన మంత్రిత్వ శాఖను కలిగి ఉంది. దీనికి జ్ఞానవంతుడైన షేక్ నాహయాన్ బిన్ ముబారక్ అల్ నాహయాన్ నేతృత్వం వహిస్తున్నారు.

తమ సాంప్రదాయిక సమాజంలో అబ్రహామిక్ విశ్వాసాల ప్రార్థనా స్థలాలను మాత్రమే కాకుండా ఇప్పుడు హిందూ, సిక్కు, బౌద్ధమతాల ప్రార్థనాలయాలను స్థాపించడానికి అనుమతించడంలోనూ ఈ నాయకులు మార్గదర్శకులుగా నిలిచారు. నేను 1979–82 ప్రాంతంలో అబూ ధాబీలోని భారత రాయబార కార్యాలయంలో పనిచేశాను. ఆ సమయంలో, దుబాయ్‌లో హిందువులు, సిక్కుల ఆరాధనకు సంబంధించి ఒక చిన్న స్థలం ఉండేది. అయితే, బయటి నుండి దానిని గుర్తించలేరు. హిందువులు, సిక్కులు బహిరంగంగా గుర్తించే విధంగా తమ ప్రార్థనలను, కీర్తనలను చేయకూడదనే అవగాహనతో అప్పటి దుబాయ్ పాలకుడు షేక్ రషీద్ బిన్ సయీద్ అల్ మక్తూమ్ దీనిని అనుమతించారు. ఆ రోజుల్లో, ప్రార్థనా స్థలాల నిర్మాణానికి కాదు కదా, ముస్లిమేతర విశ్వాసాలను బహిరంగంగా పాటించుకోవడానికి కూడా యూఏఈ అనుమతించడం అనేది ఊహకందని విషయం. నిజానికి, ఇప్పుడు కూడా, యూఏఈ ఉదాహరణను ఇతర అరబ్ దేశాలు పూర్తిగా అనుసరించలేదు. సౌదీ అరేబియా యువ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్ మహిళల బహిరంగ


యూఏఈలో నిర్మితమైన హిందూ దేవాలయం

కార్యకలాపాలపై ఇచ్చిన సామాజిక సడలింపులు పూర్తి భిన్నమైన కోవలోకి వస్తాయి.


యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్

యూఏఈ 1971 డిసెంబరులో ఏడు ఎమి రేట్లతో కలిసి ఒక దేశంగా ఆవిర్భవించింది. అవి: అబూ ధాబీ, దుబాయ్, షార్జా, రస్ అల్ ఖైమా, ఉమ్ అల్ క్వైన్, అజ్మాన్, ఫుజైరా. అప్పటివరకు బ్రిటిష్ రక్షిత ప్రాంతాలుగా ఉంటూవచ్చిన అవి ఒక సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నాయి. 1962లో అబూ ధాబీలో భారీ పరిమాణంలో చమురును కను గొన్నారు. కానీ దుబాయ్‌లో తక్కువ నిల్వలు ఉండేవి. షార్జాలో ఇంకా తక్కువ. మిగతా ఎమి రేట్స్‌లో అవీ లేవు. 1970వ దశకంలో చమురు ధరల పెరుగుదల యూఏఈ రూపు రేఖలను మార్చింది. అబూ ధాబీ తాను అభివృద్ధి చెందడమే కాకుండా, ఇతరులతో తన ఔదార్యాన్ని పంచుకోవడానికి సిద్ధపడింది. దీంతో భారీ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభ మయ్యాయి. ఇది భారతదేశంతో సహా అనేక దేశాల నుండి ప్రజలను తీసుకువచ్చింది. వారు వివిధ విశ్వాసాలకు చెందినవారు.

అప్పటి దుబాయ్ పాలకుడైన షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ తన ఎమిరేట్‌ను వ్యాపారం, షిప్పింగ్, ఫైనాన్స్ కోసం ఒక గొప్ప వాణిజ్య కేంద్రంగా నిర్మించడం ప్రారంభించారు. దీని కోసం, ఆయన పెద్ద సంఖ్యలో విదేశీయుల రాకను ప్రోత్సహించవలసి వచ్చింది. బిన్ రషీద్ దార్శనికతను దుబాయ్ ప్రస్తుత పాలకుడు ముందుకు తీసుకెళ్లారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రారంభించారు. పర్యాటకానికి మహిళలు, ఆహారం, పానీయాలకు సంబంధించిన పాత, కఠినమైన సామాజిక ఆచారాల సడలింపులు అవసరమయ్యాయి. అయితే, అధికారులు దుబాయ్‌లో నివసించడానికీ, పని చేయడానికీ వచ్చిన వారి రాజకీయ కార్యకలాపాలను మాత్రం అనుమతించలేదు. అబూ ధాబీ మినహా కొన్ని ఇతర ఎమిరేట్‌లు దీనిని అనుసరించాయి. ముస్లిమేతర మత కార్యకలాపాలను బహిరంగంగా వ్యక్తీకరించడాన్ని, పర్యవేక్షించడం మరొక అంశం. ఏమైనా విశ్వాసాల విషయంలో వహాబీ, సలాఫీ ఇస్లాం సిద్ధాంతాలు కచ్చితంగా అమలయ్యాయి.

ఇక్కడే యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ సహనం, సహజీవనాలను ప్రచారం చేయడంలో చాలా ముందుకు వెళ్లిపోయారు. ఇవి ఇస్లామిక్ విశ్వాసంపై అత్యంత కఠినమైన వ్యాఖ్యానం, అభ్యాసం కోసం పట్టుబట్టే ఇబ్న్ వహాబ్ సాంప్రదాయ బోధనలకు భిన్నమైన పరాయి ఆలోచనలు. సౌదీ రాజకుటుంబం వహాబిజంతో ఒప్పందాన్ని కలిగి ఉంది. అరేబియా ద్వీపకల్పంలోని ఇతర గిరిజన పెద్దలు కూడా దానిని అనుసరించారు. ఇస్లాంకు ఇతర వ్యాఖ్యానాల చెల్లుబాటు తిరస్కరించబడింది. వాస్తవానికి, ఇతర మతాలను, ముఖ్యంగా అబ్రహామిక్ కానివాటిని అంగీకరించే ప్రశ్నే లేదు. ఇక విగ్రహారాధనకు అయితే పెద్ద వ్యతిరేకత ఉంటుంది.

స్పష్టంగా, మొహమ్మద్ బిన్ జాయెద్ ఇస్లాం శాంతికి సంబంధించిన మతం మాత్రమే కాదు, అది గౌరవప్రదమైనదనీ, ఇతర ఆధ్యాత్మిక అన్వేషణలను అంగీకరిస్తుందనీ చూపించాలనుకుంటున్నారు. అది ఉదారవాద, జ్ఞానోదయమైన విధానం. తీవ్రవాదం, హింసలను ఇస్లాం ప్రబోధిస్తుందనే అభిప్రాయాన్ని కూడా ఇది తిరస్కరించడానికి ప్రయత్నిస్తుంది. అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్, లష్కర్ ఎ తొయ్యబా, అఫ్గాన్ తాలిబాన్ వంటి గ్రూపులు ఆచరిస్తున్న భావజాలాలు, హింస కారణంగా చాలా ముస్లిమేతర ప్రాంతాలలో ఈ అభిప్రాయం ఏర్పడింది. 1990లలో ముల్లా ఒమర్ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన మూడు దేశాలలో యూఏఈ ఒకటి. మిగిలిన రెండూ సౌదీ అరేబియా. పాకిస్తాన్. ఈ వెలుగులో చూస్తే మొహమ్మద్ బిన్ జాయెద్ పాలనలో సహనం, సహజీవనాలకు చెందిన విధానం, దాని అభ్యాసం అద్భుతమైనవి.

అబూ ధాబీలో బోచాసన్‌వాసీ అక్షర్ పురుషోత్తమ్ స్వామి నారాయణ దేవాలయం వంటి ఇస్లామేతర ప్రార్థనా స్థలాలను అనుమతించడంపై సంప్రదాయ వహాబీ ఉలేమా నుండి కచ్చితంగా వచ్చివుండిన వ్యతిరేకతను బిన్ జాయెద్ అధిగమించగలిగారు. 'వహాబీ మజబ్'లోనే మార్పు వస్తున్నదని ఇది సూచిస్తున్నదో లేదో అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. బిన్ జాయెద్ నిస్సందేహంగా ఇతర దేశాల సంప్రదాయ ఉలేమాల ఆగ్రహాన్ని కూడా ఎదుర్కొంటారు. అయితే సహనం, సహజీవనం పట్ల తన నిబద్ధతను స్పష్టంగా వ్యక్తీకరించడానికి అటువంటి ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యాన్ని ఆయన కలిగివున్నారు. కానీ అది ఎడారి గిరిజనుల స్పృహలోకి ఎంత లోతుగా ప్రవేశించిందో కాలమే చెబుతుంది.

వ్యాసకర్త, విదేశాంగ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గొప్ప పరిశ్రమ



మలయాళం సినిమా పరిశ్రమ అసలు ఆగడం లేదుగా! వాళ్లు వారానికి రెండు క్లాసిక్స్‌ను వదులుతున్నారు బ్రో. అన్నింటినీ చూడటానికి టైమే చాలట్లేదు. ఓ పదేళ్లు పడుతుంది. అయినా తొందరేముంది? సమీక్షలను చూస్తుంటే 2024 ఎంత సంచలనాత్మకంగా మొదలైందో!

– రాహుల్ రవీంద్రన్, నటుడు

నాయకుడికి నివాళి



మా పార్టీ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషీజీ వెళ్లిపోయారని తెలియడం బాధాకరం. ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక నివాళి. ఓం శాంతి.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

ఆంగ్లం వద్దా?



కర్ణాటకలో ఇంగ్లీష్ సైన్ బోర్డులను కాంగ్రెస్ కార్యకర్తలు పడగొడుతున్నారు. అదే బోర్డులో కన్నడ అక్షరాలున్నా వారు వదలడం లేదు. కానీ అదే కాంగ్రెస్ కార్యకర్తలు ఒక ఇటాలియన్ మహిళను మాత్రం తల్లిగా భావిస్తారు.

– రిషి బాగ్రీ, వ్యాఖ్యాత

నిజంగా చేస్తుందా?



కోవిడ్‌కు వ్యతిరేకంగా ఆయుర్వేదం పనిచేసిందని భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పడం అర్థరహితం. దీనికి ఏ విధమైన శాస్త్రీయ రుజువులు లేవు. దీన్ని ఉదారవాదులకు తగిలిన దెబ్బగా కొందరు ఐటీ సెల్ వాళ్లు అభివర్ణించడం ఇంకా చీదరగా ఉంది.

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

నాకు కదా ఇవ్వాలి!



ఒకవేళ మతాన్ని రాజ్యం గుర్తిస్తున్నట్టయితే, అది నాస్తికత్వాన్ని కూడా గుర్తించాలి. ఎవరో ఆకాశంలోని ఒక ముసలాయనను నమ్మే వాళ్లకు ప్రత్యేకమైన మర్యాద ఎందుకు ఇవ్వడం? అదీ హేతుబద్ధంగా, సహానుభూతితో, శాస్త్రీయ దృక్పథంతో వ్యవహరించే నాకేమో ఏమీ దక్కదా?

– హెన్రీ ఫాన్‌తోమ్, ఆర్కిటెక్ట్

వాళ్లెందుకు బాధపడాలి?



నేను యూదు వ్యతిరేకత మీద చాలాకాలం పోరాడాను. అది ఒక సామాజిక సమస్య. కానీ నాకు దీనికి జవాబు తెలియాలి: యూదులకు వ్యతిరేకంగా యూరప్, అమెరికాల్లో శతాబ్దాలుగా జరిగిన నేరాలకు పాలస్తీనియన్లు ఎందుకు మూల్యం చెల్లించాలి? నాజీల నేరాలకు వాళ్లెందుకు మూల్యం చెల్లిస్తున్నారు?

– అర్నేసా బుల్జూస్మిక్ కుస్తూరా జినోసైడ్ రీసెర్చర్

ఇక్కడికీ వచ్చారు!



ఇజ్రాయెల్ మీద అక్టోబర్ 7 నాటి హమాస్ దాడిని సెలబ్రేట్ చేసుకునేవాళ్లు స్వీడన్‌లో ఉన్నారన్న వాస్తవం తెలుస్తుండటం నాకు చాలా కష్టంగా ఉంది. నేను ఇన్నాళ్లూ ఆటవిక తీవ్రవాదుల నుంచి తప్పించుకున్నానన్న భ్రమలో ఉన్నాను. కానీ వాళ్లు నాతో స్వీడన్‌కు కూడా వచ్చారు. నేను అరబ్‌ను అయినప్పటికీ ఇజ్రాయిలీలు, యూదులకు బేషరతుగా మద్దతునిస్తాను.

– లుయీ అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

కొత్త చూపును ఇవ్వాల్సిన సందర్భం

తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కార్యకలాపాలనూ, కొనసాగింపునూ విశ్లేషించాలంటే... ఈ సంస్థ తెలంగాణ ఉద్యమ కాలంలో నిర్వహించిన పాత్ర, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన పిదప పనిచేసిన తీరు తెన్నులనూ పరిగణనలోకి తీసుకోవాలి. 2001 చివరలో తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ సృజనకారులకు ఒక వేదికగా తెరవే ప్రారంభమైంది. తెలంగాణ సాధనలో తనదైన స్పష్టమైన గొంతుతో చురుకైన పాత్ర పోషించింది.

'సోయి' సాహిత్య పత్రికను తన చేతనైన మేరకు తీసుకువచ్చింది. జిల్లా సభలు, రాష్ట్ర మహాసభలు నిర్వహించినది. ఆ క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ భాష, సంస్కృతులూ, సాహిత్యాన్ని చూసిన చిన్న చూపునూ, అన్యాయాలనూ అత్యంత ప్రతిభావంతంగా తెలంగాణ సమాజం దృష్టికి తీసుకుపోగలిగింది. అందులో భాగంగానే పోతన 'ఒంటి మిట్ట' వాడంటే కాదు కాదు తెలంగాణలోని బమ్మెర గ్రామానికి చెందిన వాడని, ట్యాంక్ బండ్ మీద పోతన విగ్రహం దగ్గరకు సినారెను ఆహ్వానించి నిరసన తెలిపింది. తెలుగు సాహిత్యంలోని అన్ని బాధిత వర్గాలవారికీ మద్దతుగా నిలబడింది. తెలంగాణ సాహిత్య స్పృహను వీలైనంత మేరకు పాక్షికంగానైనా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ తీసుకుపోగలిగింది.

అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత తెరవే రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒకటి పాలక పక్షం వైపు నిలబడి మాట్లాడితే, అసలు సిసలైన తెరవేలో మిగతా వారు ప్రజల పక్షం వహించి తమ సృజనను కొనసాగించారు. గత ప్రభుత్వం తెలంగాణ సబ్బండ వర్ణాల ఆకాంక్షలను నెరవేర్చకపోగా కనీస ప్రజాస్వామ్య విధానాలనూ, విలువలనూ పాటించ లేదు. ఈ పరిస్థితుల్లో తెరవేతో కొనసాగిన సాహిత్యకారులు తమ తమ సృజనాత్మక ప్రక్రియల ద్వారా ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు. ఇక మిగతావారు ప్రభుత్వంలో కొలువైన పెద్దల పట్ల అక్షరాలతో తమ స్వామి భక్తిని చాటుకున్నారు.

ప్రస్తుత పరిస్థితులలో తెలుగు సాహిత్యానికి ప్రజలే కేంద్రంగా ఒక చూపునూ, విలక్షణ రూపునూ ఇవ్వాల్సిన బరువు బాధ్యతలు తెరవేపై ఉన్నాయి. తెలంగాణ సాహిత్యంలో ఏర్పడిన ఒక ఖాళీని పూరించాల్సిన బాధ్యత కూడా ఉన్నది. వినియోగదారీ సంస్కృతి విరాజిల్లుతున్న ఈ రోజుల్లో వ్యక్తిత్వాన్ని కాపాడుకొంటూ, ఒత్తిళ్లను తట్టుకొంటూ నిలబడడం కత్తుల వంతెన మీద నడవడం లాంటిదే మరి. ఈ నేపథ్యంలో జరుగుతున్న తెరవే మహాసభలు ఎంతో ప్రాముఖ్యం సంతరించుకున్నాయి.

– శబరి (ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో తెరవే రాష్ట్ర మహాసభలు)

వైఎస్ తొలి సంతకానికి తొలి సాక్షి


ఎ. చంద్రశేఖర రెడ్డి

నిలువెత్తు నిజాయితీ, నిబద్ధత, నిపుణతకు మారు పేరుగా 32 ఏళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సేవ చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మరణం అత్యంత విషాదకరం. ఆయన మృతి ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకూ తీరని లోటు. పరిపాలనాధికారిగా ప్రజల సమస్యలు ఆయనకు కరతలామలకం. జన చైతన్యానికీ, నాగరికతకూ, అభివృద్ధికీ ప్రజా జీవన ప్రమాణాల శీఘ్ర పురోగతికీ కేంద్రాలయిన నెల్లూరు, గుంటూరు జిల్లాలకు ఒకప్పుడు కలెక్టర్‌గా పనిచేసిన ఆయన ఆ యా జిల్లాల పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా, వ్యవసాయ శాఖ కమిషనర్‌గా, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా ఆయన తన అసమాన ప్రతిభను కనపర్చారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా పనిచేసే రోజుల్లో జిల్లాల వారిగా మద్యం వ్యాపారాన్ని రాజకీయ మాఫియా ఏ విధంగా ప్రభావితం చేస్తున్నదో సవివరమైన నివేదికను రూపొందించి, అప్పట్లో సంచలనం సృష్టించారు. ఆయన రూపొందించిన నివేదిక అక్షర సత్యం అనేది నేటికీ రుజువవుతున్నది. వ్యవసాయ శాఖ కమిషనర్‌గా ఉమ్మడి రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా ఆయన రూపొందించిన వ్యూహం సత్ఫలితాలు ఇచ్చింది. 2002 – 03లో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొని ఉన్న తీవ్ర దుర్భిక్షం, కరువులను కేంద్ర పరిశీలక బృందానికి అత్యంత ప్రతిభావంతంగా వివరించి కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టగలిగారు.

ఎవరికైనా జన్నత్ హుస్సేన్ పేరు స్ఫురణకు రాగానే ఆయనలోని సౌమ్యత,


ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేస్తున్న వైఎస్‌తో జన్నత్ హుస్సేన్

ముఖంలో ఉట్టిపడే సాహోర్దత కళ్లల్లో మెదలుతాయి. వినయ విధేయతలకు మారు పేరు అయిన హుస్సేన్ దివంగత ముఖ్యమంత్రులు కోట్ల విజయ భాస్కర రెడ్డి, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డి మన్నన పొందారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే అధికారగణం నుంచి తొలి ఎంపికగా జన్నత్ హుస్సేన్‌ను తన కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిగా నియమించుకున్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే యావత్ రాష్ట్ర రైతులందరికీ ఉచిత విద్యుత్ వరాన్ని ప్రసాదిస్తూ జన్నత్ హుస్సేన్ రూపొందించిన ఫైల్‌పై తన తొలి సంతకాన్ని చేశారు. హుస్సేన్ ఉచిత విద్యుత్‌ను గట్టిగా సమర్థించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో రైతులకు నేటికీ ఉచిత విద్యుత్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆనాడు ఉచిత విద్యుత్ ఫైల్‌పై వైఎస్సార్ తొలి సంతకం చేసే చారిత్రక సన్నివేశానికి తొలి ప్రత్యక్ష సాక్షిగా జన్నత్ హుస్సేన్ ఎప్పటికీ చరిత్ర పుటలలో మిగిలిపోతారు.


ఆయన సీనియర్ ఐఏఎస్ అధికారిగా... చిత్తశుద్ధిగా పనిచేసే యువ ఐఏఎస్ అధికార్లను ప్రోత్సహించారు. అపోహలతో వారిని బదిలీ చేసినప్పుడు వారికి అండగా నిలిచి వారి బదిలీలను నిలిపివేశారు. ఇంధన కార్యదర్శిగా ఆ రంగం అభివృద్ధికి పాటు పడ్డారు. పదవీ విరమణ అనంతరం ప్రధాన సమాచార కమిషనర్‌గా ప్రజలకు ఉపయోగపడే ఎన్నో తీర్పులు ఇచ్చారు. ఇలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం కల జన్నత్ హుస్సేన్‌తో నాకు దశాబ్దాల అనుబంధం ఉన్నందుకు గర్విస్తున్నాను. ఈ గొప్ప పాలనా దక్షుడికి అశ్రు నివాళి అర్పిస్తున్నాను.

వ్యాసకర్త 'బీఈఈ' మీడియా ఎడ్వైజర్, నాటి సీఎం వైఎస్ ప్రెస్ సెక్రటరీ

సామాజిక సమరసతా మూర్తి

భారతదేశ తాత్విక ఉద్యమాలలో భక్తి కవులదొక అధ్యాయం. అందులో సంత్ రవిదాస్ పాత్ర కీలకమైనది. అనేక రూపాల్లో దురాచారాలు, మూఢాచారాలు ఉన్న 14 శతాబ్దంలో జన్మించిన రవిదాస్ తన భక్తిగీతాల ద్వారా భక్తి ఉద్యమానికి తెరతీశారు. మనిషి స్వతంత్రుడై గౌరవమైన ఆలోచనలతో జీవించాలన్నారు. తలవంచి జీవించడాన్ని నిరాకరించారు.

క్రీ.శ. 1377లో కాశీ సమీపంలోని సీర్ గోవర్ధన పురం అనే గ్రామంలో, మాఘ పౌర్ణమి రోజున చర్మకార కుటుంబంలో దాస్ జన్మించారు. ఆయన ఆధ్యాత్మిక సన్యాసిగానే అంటరానివారి కోసం ఉద్యమాన్ని నడిపారు. వారి సాంఘిక విముక్తి కోసం కృషి చేశారు. లక్షలాది శూద్ర, అంటరాని కులాలకు చెందిన ప్రజలు ఆయనను అనుసరించారు. 'ఎక్కడైతే అందరికీ భోజనం లభిస్తుందో, ఎవరూ ఆకలితో నిద్రపోరో... ఎక్కడ ఎక్కువ తక్కువల అసమానతలు లేకుండా ప్రజలు జీవిస్తూ ఉంటారో... అలాంటి సమాజాన్నీ, అలాంటి పాలనా వ్యవస్థనూ' రవిదాస్ కోరుకున్నారు.


సంత్ రవిదాస్

'కులం గురించి ఎవరూ, ఎవర్నీ అడగ కూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం' అని ఆయన బోధించారు. ఆయన భక్తి ఉద్యమంలో కుల వ్యతిరేక పోరాట దృక్పథం ఉంది. రవిదాస్ తనను తాను చమర్‌గా ప్రబోధించుకుంటూ... కులాలను దేవుడు సృష్టించ లేదనీ, వాటిని మనిషే సృష్టించాడనీ స్పష్టంగా చెప్పారు. 'మనిషి పీల్చుతున్న శ్వాస బ్రాహ్మణుడిదైనా, చండాలునిదైనా ఒక్కటే అయినప్పుడు మనుషులలో ఎక్కువ తక్కువలు ఎందుక'ని ప్రశ్నించారు. 'మనిషి కులాన్ని బట్టి ఉన్నతుడు కాలేడు. గుణంతో, పనులతో గొప్పవాడు అవుతాడు' అని చాటారు.

ఆయన తన సాహిత్యం ద్వారా ఎవరినైనా ప్రశ్నించ వచ్చనే ధైర్యాన్ని ప్రజలలో నింపారు. జాతి వైతాళికులైన అంబేడ్కర్, పూలే లాంటి వారిపై రవిదాస్ తదితర భక్తి కవుల ప్రభావం ఉంది. ఆయన ఒక వ్యక్తి కాదు, ఉద్యమం. సామాజిక సమరసత కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ ఒక ఉత్తేజం.

– సాకి (నేడు మాఘ పౌర్ణమి: సంత్ రవిదాస్ జయంతి)

టీవీ 5 సాంబశివరావు చెప్పేవన్నీ అబద్ధాలే!

అన్నీ సరిగ్గా ఉంటే బంక్ ఎందుకు మూస్తారు

- హెచ్‌పీసీఎల్, సంధ్య కన్‌స్ట్రక్షన్‌కు మధ్య పెట్రోల్ బంక్ ఒప్పందం
- డీలర్‌షిప్ మాత్రం టీవీ5 సాంబశివరావు కోడలు కొల్లి సౌమ్య పేరు మీద
- ఆయిల్ కంపెనీతో ఒప్పందం 600 చదరపు మీటర్ల స్థలంలోనే
- కానీ 1,200 చ.మీ.లలో పెట్రోల్ బంక్ ఏర్పాటు
- యజమాని సంతకాలను ఫోర్జరీ చేసి అదనంగా 600 చ.మీ. స్థలం అగ్రిమెంట్
- ఈ విషయం తెలిసే పాక్షికంగా బంక్‌ను సీజ్ చేసిన హెచ్‌పీసీఎల్
- వాస్తవాలను దాచిపెట్టి మీడియా ముందు సాంబశివరావు నంగనాచి కబుర్లు
- 'సాక్షి'తో సంధ్య కన్‌స్ట్రక్షన్ యజమాని సరనాల శ్రీధర్ రావు

సాక్షి, హైదరాబాద్: హిందుస్తాన్ పెట్రోలియం లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)కు, సంధ్య కన్‌స్ట్రక్షన్‌కు మధ్య జరిగిన పెట్రోల్ బంక్ ఒప్పందం వివాదంలో టీవీ-5 వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు అసలు వాస్తవాలను దాచి అన్నీ అబద్ధాలే చెబుతున్నారని సంధ్య కన్‌స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సరనాల శ్రీధర్ రావు ఆరోపించారు. స్థలం సాంబశివరావుది కాదు.. పెట్టుబడీ ఆయనది కాదు.. కానీ, పెట్రోల్ బంక్ డీలర్‌షిప్ మాత్రం ఆయన వాళ్ల పేరు మీద పెట్టుకుని బాగోతం నడిపారని విమర్శించారు. టీవీ-5తో తనకున్న పరిచయాలను వాడి తన కోడలు కొల్లి సౌమ్య పేరు మీద డీలర్‌షిప్ తీసుకొని అసలు వాస్తవాలను దాస్తూ మీడియా ముందు మాత్రం సాంబశివరావు నంగనాచి కబుర్లు చెబుతున్నాడని శ్రీధర్‌రావు ధ్వజమెత్తారు. మాదాపూర్‌లోని పెట్రోల్ బంక్‌కు సంబంధించి డాక్యుమెంట్లు అన్నీ పక్కాగా ఉంటే హెచ్‌పీసీఎల్ ఎందుకు బంక్‌ను మూసి వేసిందని ప్రశ్నించారు? ఆయనకున్న పోలీసు, రాజకీయ పలుకుబడితో తనకు టుంబ సభ్యులు, వ్యాపారాల గురించి ప్రతికూల వార్తలను ప్రచారం చేస్తూ పరువు నష్టాన్ని కలిగిస్తున్నారని ఆరోపించారు. 'సాక్షి'తో శ్రీధర్‌రావు చెప్పిన వివరాల ప్రకారం..

స్థలం అసలు కథ ఇదీ..

సరనాల శ్రీధర్ భార్య సంధ్యకు శేరిలింగంపల్లిలోని మాదాపూర్ గ్రామంలో సర్వే నంబరు-64లోని హుడా టెక్నో ఎన్‌క్లేవ్‌లో సెక్టార్- 3లోని ప్లాట్ నంబరు-26లో నార్త్‌ఈస్ట్ దిక్కున 1,200 చదరపు మీటర్ల స్థలం ఉంది. ఇందులో 600 చ.మీ. స్థలాన్ని సంధ్య తన వ్యాపార అవసరాల కోసం ఇతరులకు విక్రయించింది. ఇంకా తన వద్ద 600 చ.మీ. స్థలం ఉంది. 2018లో కొందరు రియల్ ఎస్టేట్ మార్కెట్ మిత్రులతో కలిసి సాంబశివ రావు శ్రీధర్ రావును కలిశాడు. 'మీది తెనాలే మాది తెనాలే'అంటూ మాట కలిపాడు. 600 చ.మీ. స్థలంలో పెట్రోల్ బంక్ పెడదామని సలహా ఇచ్చాడు. తనకు ఆయిల్ కంపెనీలతో సత్సంబంధాలు ఉన్నాయని, పోలీసు, మున్సిపల్ అనుమతులన్నీ తానే చూసుకుంటానని నమ్మించాడు. 25:75 శాతం వాటాతో సాంబశివరావు, సంధ్య కన్‌స్ట్రక్షన్‌తో ఒప్పందం చేసుకున్నాడు. నెలకు రూ.3.15 లక్షలు అద్దె చెల్లించేలా 600 చదరపు మీటర్ల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తూ హెచ్‌పీసీఎల్‌కు, సంధ్య కన్‌స్ట్రక్షన్‌కు రిజిస్టర్డ్ లీజు డీడ్ జరిగింది. పెట్రోల్ బంక్ ఏర్పాటయింది. అంతా బాగానే నడుస్తున్న క్రమంలో.. పక్కనే ఉన్న మరో 600 చదరపు మీటర్ల స్థలంలో కూడా బంక్‌ను విస్తరిద్దామని సాంబశివరావు సూచించాడు.

ఇక్కడే ఫోర్జరీ చేసింది..

దీంతో అప్పటికే అమ్మేసిన ఈ స్థలాన్ని 2020 జనవరిలో రూ.కోట్లు వెచ్చించి తిరిగి సంధ్య కన్‌స్ట్రక్షన్ కొనుగోలు చేసింది. అయితే విస్తరించే ఈ బంక్‌కు నెలకు చెల్లించే అద్దె కేవలం రూ.1.15 లక్షలు మాత్రమేనని తెలిసింది. దీంతో పునరాలోచనలో పడ్డారు. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలంలో పెట్రోల్ బంక్‌కు వచ్చే అద్దె రూ.1.15 లక్షలు అనే సరికి వెనక్కి తగ్గారు. కానీ, టీవీ-5 సాంబశివరావు హెచ్‌పీసీఎల్‌లో డీజీఎం స్థాయిలో తనకున్న పరిచయాలతో స్థలం యజమానికి తెలియకుండా ఈ రెండో భాగం 600 చదరపు మీటర్ల స్థలాన్ని ఫోర్జరీ సంతకాలతో హెచ్‌పీసీఎల్‌కు లీజుకు ఇచ్చేశాడు. కానీ, మీడియా ముందు మాత్రం తొలుత హెచ్‌పీసీఎల్‌కు, సంధ్య కన్‌స్ట్రక్షన్‌కు మధ్య 600 చ.మీ. స్థలంలో జరిగిన పెట్రోల్ బంక్ డాక్యుమెంట్లను మాత్రమే చూపిస్తూ జనాలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు.

అందర్నీ మేనేజ్ చేసి..: జర్నలిస్ట్ కావడంతో తనకున్న రాజకీయ, పోలీసు పరిచయాలను టీవీ-5 సాంబశివ రావు పూర్తిస్థాయిలో వినియోగించుకున్నాడు. వాస్తవానికి ఈ పెట్రోల్‌బంక్ వి స్తరణ చేసిన 600 చదరపు మీటర్ల స్థలానికి యజమానికి, హెచ్‌పీసీఎల్‌కు మధ్య ఎలాంటి రిజిస్టర్డ్ లీజు డీడ్ జరగలే దు. హెచ్‌పీసీఎల్‌లో తనకున్న పరిచయాలతో స్థల యజమాని సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ అగ్రిమెంట్‌ను సృష్టించాడు. ఈ ఫోర్జరీ డాక్యుమెంట్లను సమర్పించే స్థానికంగా పోలీసు, మున్సిపల్ అనుమతులను తీసుకున్నాడు.

దిక్కులేక ఠాణా మెట్లెక్కి..

స్థల యజమానికి విషయం తెలియడంతో.. తన వాటా 75 శాతంపై సాంబశివరావును నిలదీశారు. రూ.30 లక్షలు ఇస్తే 75 శాతం వాటా డాక్యుమెంటేషన్ ప్రక్రియ మొదలుపెడతానని మెలిక పెట్టడంతో చేసేదేం లేక చెక్ రూపంలో రూ.30 లక్షలు సాంబశివరావుకు చెల్లించారు. ఏళ్ల గడిచినా బంక్ డీలర్‌షిప్ తమ పేరు మీద బదలాయించక పోయే సరికి దిక్కు తోచని స్థితిలో ఈ ఏడాది జనవరి 31న స్థల యజమాని శ్రీధర్‌రావు మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



బంక్‌లో సీజ్ చేసిన కొంత భాగానికి ఏర్పాటు చేసిన కంచె

హెచ్‌పీసీఎల్ ఏం అంటోంది?

ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ చేపట్టిన హెచ్‌పీసీఎల్.. పెట్రోల్ బంక్ విస్తరణ సమయంలో సమర్పించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించకుండా నిర్ణయం తీసుకున్నట్లు స్వయంగా ఇంధన సంస్థే వెల్లడించింది. అందుకే విస్తరించిన 600 చదరపు మీటర్ల స్థలాన్ని పాక్షికంగా సీజ్ చేశామని, న్యాయబద్ధంగా ఒప్పందం చేస్తే నెలకు రూ.1.57 లక్షలు అద్దె చొప్పున 2020 నుంచి పరిహారాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

కారు కొట్టేసిన సాంబశివరావు

సంధ్య కన్‌స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్స్ ప్రై.లి. (గతంలో సంధ్య హోటల్స్ ప్రై.లి.) 2019 సెప్టెంబర్ 13న మాదాపూర్‌లోని యాక్సిస్ బ్యాంక్ కరెంట్ ఖాతా నంబరు: 910020004191308 నుంచి 039927 డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ను తీసుకుంది. వరుణ్ మోటార్స్ ప్రై.లి. పేరు మీద మారుతీ స్విఫ్ట్ కారు కొనుగోలు చేసేందుకు ఈ డీడీను తీసుకుంది. అయితే యాజమాన్యం కోరిన మోడల్ కారు డెలివరీలో జాప్యం జరిగింది. ఈక్రమంలో టీవీ-5 సాంబశివరావు ఎంటరయ్యాడు. తనకున్న పరిచయాలతో త్వరగా కారు డెలివరీ అయ్యేలా చేస్తానని నమ్మించి డీడీని తీసుకున్నాడు. ఎన్ని రోజులైనా ఎలాంటి స్పందన లేదు. గట్టిగా ప్రశ్నిస్తే కొత్త అప్‌గ్రేడ్ మోడల్ వస్తోందని, పాత కారు ధరకే అప్‌గ్రేడ్ మోడల్ ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో అతని మాయమాటలు నమ్మి కొంతకాలం వేచిచూశారు. అయినా నెలలు గడుస్తున్నా కారు డెలివరీ మాత్రం కాలేదు. డీడీ కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో డీడీ ఇవ్వమని మరోసారి అడిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయనీ, తనకు రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు బాగా తెలుసని బెదిరించడం మొదలుపెట్టాడు. తీరా అసలు విషయం ఏంటంటే.. ఆ డీడీని ఉపయోగించుకొని సాంబశివరావు తన వ్యక్తిగత అవసరాల కోసం కారును కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈమేరకు మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో బాధితుడు శ్రీధర్ రావు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. డీడీ, బ్యాంక్ స్టేట్‌మెంట్ కాపీలను పోలీసులకు అందజేశారు.

వైభవంగా రథోత్సవం



హోమ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లు దివ్య విమాన రథంపై తిరువీధుల్లో ఊరేగారు. భక్తుల శ్రీలక్ష్మీనరసింహుడి నామస్మరణంతో, అర్చకుల పాంచరాత్ర ఆగమ శాస్త్ర పూజల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. భక్తుల నృత్యాలు, మహిళల కోలాటాలు, చిన్నారుల కూచిపూడి నాట్యాలు, బాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య రథోత్సవం తిరువీధుల్లో సాగింది. ఉదయం నిత్యారాధనలు, పారాయణాల అనంతరం గరుడ వాహన సేవలో శ్రీస్వామి అమ్మవార్లను ఊరేగించారు.

అపజయాలను విశ్లేషిస్తే అద్భుతాలు



- రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి

శంషాబాద్: అపజయాలను నిజాయతీతో విశ్లేషిస్తేనే అద్భుత విజయాలు సాధ్యమవుతాయని రక్షణ శాఖ వైజ్ఞానిక సలహాదారు, ఏరోనాటికల్ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి అన్నారు. సొసైటీ ఫర్ ఫెయిల్యూర్ అనాలసిస్ (ఎస్ఎఫ్ఏ) సంస్థ నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ఫెయిల్యూర్ ఫర్ మెటలర్జికల్ ఇండస్ట్రీ అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నా, కొన్ని రకాల ముడిసరుకులను విదేశాల నుంచి ఇంకా దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని కూడా ఆయా సంస్థలు విశ్లేషించుకుని, వాటిని సొంతంగా తయారు చేసుకునే స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నం జరగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ అధ్యక్షుడు, మిధాని సంస్థ ఎండీ డాక్టర్ ఎస్.కె.ఝా, ఎస్ఎఫ్ఏ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సత్యనారాయణ, సైంటిస్టులు పాల్గొన్నారు.

గొర్రెల కేసులో కీలక నిందితులు పరార్

- విదేశాలకు జారుకున్న ఎ1, ఎ2
- బాధితులకు ఫోన్ చేసి బెదిరింపులు



సయ్యద్ మొహీదొద్దీన్

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పథకం బిల్లు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక సూత్రధారులు పరారీలో ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కుంభకోణంలో ఏ1గా ఉన్న మొహీదొద్దీన్, ఏ2 సయ్యద్ ఇక్రముద్దీన్ అహ్మద్ విదేశాలకు పరారయ్యారు. ఈ కుంభకోణంలో వారు రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయకుండా దారి మళ్లించారు. దీంతో తాము మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు గత డిసెంబర్‌లో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే కేసు ఏసీబీ వద్దకు చేరుకునే లోపే ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న తండ్రి కొడుకులు మొహీదొద్దీన్, ఇక్రముద్దీన్ విదేశాలకు పరారయ్యారు. విదేశాల్లో ఉంటూ ఫోన్ నంబర్లు మార్చి.. మార్చి బాధిత రైతులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నట్టు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చింది . ఈ కేసులో గురువారం నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల్ని అరెస్ట్ చేసిన ఏసీబీ, మరికొందరి అరెస్ట్‌కు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

ఎన్‌ఐసీ చేతికి ధరణి?

- నేడు సీఎంతో ధరణి కమిటీ భేటీ
- సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)కి అప్పగించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఆ పోర్టల్‌ను నిర్వహిస్తోన్న ప్రైవేటు ఏజెన్సీ కాలపరిమితి కూడా ముగియడంతో ఈ బాధ్యతలను ఎన్‌ఐసీకి అప్పగించనున్నట్టు తెలుస్తోంది. ఈ పోర్టల్ నిర్వహణ బాధ్యతలతో పాటు ధరణి ద్వారా వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారంలోనూ వేగంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధరణి కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, వక్ఫ్, దేవాదాయ, అటవీశాఖల అధికారులతో సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్‌పీటర్, నవీన్‌మిత్తల్, మధుసూదన్ నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే 22 అంశాలతో నివేదికను ప్రభుత్వానికి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ అంశాలపై శనివారం జరగనున్న సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకునే అవకాశముందని సమాచారం.

చేర్చాలే... ప్రాతిపదిక

ఈ సమావేశంలో భాగంగా ధరణి పోర్టల్ ద్వారా వచ్చి పెండింగ్‌లో ఉన్న 2.46లక్షల దరఖాస్తులను ఎలా పరిష్కరించాలి? భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా పార్ట్-బిలో చేర్చిన 13.5లక్షల ఎకరాలకు సంబంధించిన భూముల సమస్యలను ఎలా నివృత్తి చేయాలి? అన్న దానిపై నిర్ణయాలు తీసుకోనున్నారు. దీంతో పాటు ధరణి సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్‌లో ఉన్న అస్తవ్యస్త రికార్డులను కాకుండా మాన్యువల్ పహాణీలను ప్రాతిపదికగా తీసుకునే అంశంపై కూడా చర్చించనున్నారు. రెవెన్యూ-అటవీ, రెవెన్యూ-దేవాదాయ, రెవెన్యూ-వక్ఫ్ శాఖల మధ్య అంతరాలు ఉన్న భూములపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నట్టు తెలిసింది. వీటితో పాటు ధరణి దరఖాస్తులు జిల్లా కలెక్టర్ స్థాయిలో కాకుండా ఆర్డీవో, తహశీల్దార్ స్థాయిలోనే పరిష్కారమయ్యేలా అధికార వికేంద్రీకరణపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్‌వోఆర్ చట్టంలో ఎలాగూ ఈ అధికారాలు కలెక్టర్లకు బదలాయించకపోవడంతో చట్ట సవరణ కూడా అవసరం లేదని, అధికారిక ఉత్తర్వులతో ఈ వికేంద్రీకరణ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. మొత్తంగా నేడు జరగనున్న కీలక సమీక్షలో ధరణి పోర్టల్‌కు సంబంధించి పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముందనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది.

ఇష్టపడితే దూరం పెట్టాడని...

ఓ టీవీ యాంకర్‌ను కిడ్నాప్ చేయించిన యువతి



నిందితురాలు బోగిరెడ్డి త్రిష్ణ

ఉప్పల్ (హైదరాబాద్): ఓ యువతి టీవీ యాంకర్‌ను ఇష్టపడింది. అయితే అతను నో చెప్పడంతో కిడ్నాప్‌నకు పథకరచన వేసింది. అది కాస్త ఫెయిల్ కావడంతో కటకటాలపాలైంది. ఉప్పల్ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలు మల్కాజిగిరి ఏసీపీ పురుషోత్తంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. మాదాపూర్ అరుణోదయకాలనీకి చెందిన బోగిరెడ్డి త్రిష్ణ ఓ డిజిటల్ మార్కెటింగ్ సంస్థకు సీఈఓ. భారత్ మ్యాట్రిమోని పేరుతో ఇన్‌స్టాగ్రాంలో చైతన్యరెడ్డి త్రిష్ణకు పరిచయమయ్యాడు. అయితే చైతన్యరెడ్డి ఉప్పల్‌కు చెందిన టీవీయాంకర్ ప్రణవ్‌సిస్టా ఫొటోను తన ఇన్‌స్టాగాం ప్రొఫైల్‌కు వాడుకున్నాడు. ప్రణవ్ ఫొటో చూసి త్రిష్ణ ఇష్టం పెంచుకుంది. వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు పంపుతూ దగ్గరైంది. దీనిని అదనుగా భావించిన చైతన్యరెడ్డి తన వ్యాపారంలో పెట్టుబడి పెట్టమని త్రిష్ణను కోరాడు. దీంతో ఆమె పెద్ద మొత్తంలో ఫోన్‌పే ద్వారా పంపింది. తిరిగి డబ్బు చెల్లించమని అడగ్గా కాలయాపన చేస్తున్నాడు. దీంతో అప్రమత్తమైన త్రిష్ణ కూపీ లాగగా, చైతన్యరెడ్డి ఫేక్ ఐడీ ద్వారా ప్రణవ్ సిస్టా ఫొటో వాడుకొని మోసం చేసినట్టు నిర్ధారణకు వచ్చింది. వెంటనే ప్రణవ్‌ను మెసేజ్‌ల ద్వారా అలర్ట్ చేసింది. దీంతో ఆయన సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. తర్వాత మెసేజ్‌ల ద్వారా పరిచయం పెంచుకొని ప్రణవ్‌ను మరింతగా ఇష్టపడింది. ఎలాగైనా అతడిని వశం చేసుకోవాలని ప్రయత్నించింది. ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తన కార్యాలయంలో పనిచేసే నలుగురి ద్వారా ప్రణవ్ వివరాలు తెలుసుకుంది. ఉప్పల్‌లో పార్కు చేసిన ప్రణవ్ కారుకు వారు జీపీఎస్(యాపిల్ ఎయిర్ ట్యాగ్) బిగించారు. దీని ద్వారా ప్రణవ్ కదలికలను గుర్తిస్తూ అతన్ని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించింది. అయినా ప్రణవ్ దారికి రాలేదు. దీంతో కిడ్నాప్‌నకు ప్లాన్ వేసింది. రూ.50,000 సుపారీ ఇచ్చింది. దీంతో కిడ్నాపర్లు రంగంలోకి దిగి ఈ నెల 11న అర్ధరాత్రి ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కళాశాల వెనుక రోడ్డులో ప్రణవ్‌ను అడ్డగించారు. తమ కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి చితకబాదుతూ త్రిష్ణ కార్యాలయానికి తీసుకొచ్చారు. వారి నుంచి ఎలాగో అలా తప్పించుకొని వచ్చిన ప్రణవ్ ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన ఉప్పల్ పోలీసులు కేసులో ప్రధాన నిందితురాలైన త్రిష్ణను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మిగిలిన కిడ్నాపర్ల కోసం వేట ప్రారంభించినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు గతంలో పలు నేరాలకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. నిందితురాలి సెల్‌ఫోన్, కారుకు వాడిన జీపీఎస్ ట్యాగ్ స్వాధీనం చేసుకున్నారు.


బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ నియామకం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ 27 మందితో ఏర్పాటైంది. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమళ్ల ఆనంద్‌గౌడ్ కమిటీని నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సంజయ్ ఘనాతే, గుంజాల మహేశ్, రమేశ్‌గౌడ్, చింతల్ సురేందర్, భాస్కర్, భైరి శంకర్, ప్రధానకార్యదర్శులుగా నందనం దివాకర్, ఎగ్గా నర్సింహులు, ఈశ్వర్ అప్పా, కార్యదర్శులుగా ఎం.వెంకటేశ్, ఇ.శ్రీనివాస్, బి.విజయభాస్కర్, జె.రాజు, భాగ్యలక్ష్మి, సత్తయ్య నియమితులయ్యారు. కోశాధికారులుగా తాతా రవి, ఆకారం రమేశ్, ఇద్దరు ఆఫీసు కార్యదర్శులు, ముగ్గురు అధికార ప్రతినిధులు, ఐటీ, డేటా, సోషల్ మీడియా, మీడియా సెల్స్ ఇన్‌చార్జీలను ఆనంద్‌గౌడ్ నియమించారు.

రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్రలతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రాబోతున్నాయని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ గెలుపును ఆపాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలు తమ పార్టీ రథయాత్రల కింద నలిగిపోతాయని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకుంటున్నాయని కాంగ్రెస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదేవిధంగా ప్రజల దృష్టి మళ్లించి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా విజయ సంకల్ప యాత్రలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కానీ ఎన్నికల్లో వారి ఆటలు సాగవన్నారు.



చంద్రుడి ఒడిలో ఒడిస్సియస్

తొలి ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర ● 50 ఏళ్ల తర్వాత అమెరికా ముద్ర

జాబిలిపైకి ల్యాండర్ల పరంపర కొనసాగుతోంది. జపాన్ 'మూన్ స్నైపర్' ల్యాండర్ తర్వాత తాజాగా అమెరికా వంతు వచ్చింది. అర్ధ శతాబ్దం తర్వాత చంద్రుడిపై మరోమారు అగ్రరాజ్యం జెండా రెపరెపలాడింది. అమెరికాలో హ్యూస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రైవేటు సంస్థ ఇంట్యూటివ్ మెషీన్స్ రూపొందించిన ఒడిస్సియస్ (నోవా-సీ శ్రేణి) ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దక్షిణ ధ్రువం చేరువలోని 'మాలాపెర్ట్ ఎ' అనే చిన్న బిలంలో దిగ్విజయంగా దిగింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి అతి సమీపంలో దిగిన వ్యోమనౌకగా చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ పేరిట ఉన్న రికార్డును ఒడిస్సియస్ బద్దలు కొట్టింది. తొలుత ల్యాండర్ నేవిగేషన్ వ్యవస్థలోని లేజర్ రేంజిఫైండర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో కాస్త ఆలస్యంగా భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4:53కు చంద్రుడిపై దిగి భూమికి సంకేతం పంపింది. ఈ మానవరహిత చంద్రయాత్రకు మిషన్ 'ఐఎం-1'గా నామకరణం చేశారు. ల్యాండర్‌కు 'ఒడీ' అని ముద్దు పేరు పెట్టుకున్నారు. అయితే ఒడిస్సియస్ ల్యాండర్ భూమికి పంపిన సంకేతం బలహీనంగా ఉండటంతో దాని భవితపై అనిశ్చితి నెలకొంది.

జీవితకాలం ఏడు రోజులే!

పూర్తిగా ఓ ప్రైవేటు కంపెనీ తయారీ, నిర్వహణలోని ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సజావుగా దిగడం ఇదే తొలిసారి. టెలిఫోన్ బూత్ కంటే కాస్త పెద్దగా ఉన్న ఈ ల్యాండర్లో 100 కిలోల బరువైన ఐదు నాసా పేలోడ్లు, ఇతర వాణిజ్య సంస్థలకు చెందిన ఆరు పేలోడ్లున్నాయి. జాబిలిపై ఒడిస్సియస్ జీవితకాలం కేవలం ఏడు రోజులే. అది దిగిన ప్రదేశంలో మరో వారం రోజుల్లో సూర్యాస్తమయం అవుతుంది. దాంతో ల్యాండర్ పని చేయడానికి సౌరశక్తి లభించదు. అంతరిక్ష వాతావరణం చంద్రుడి ఉపరితలంతో చర్యనొందే విధానం, రేడియో ఆస్ట్రానమీ, చంద్రావరణానికి సంబంధించిన డేటాను 'నాసా' పేలోడ్స్ సేకరించనున్నాయి. అమెరికా చివరిసారి 1972లో చేపట్టిన అపోలో-17 మానవసహిత యాత్రలో వ్యోమగాములు జీన్ సెర్నాన్, హారిసన్ ష్మిట్ చంద్రుడిపై దిగారు. ఆ తర్వాత అమెరికా వ్యోమనౌక నియంత్రిత విధానంలో చంద్రుడిపై దిగడం ఇదే తొలిసారి.

చంద్రుడి సూక్ష్మ శిల్పానికి గాంధీ పేరు!

ఆరు కాళ్లపై నిలబడే ఒడిస్సియస్ ల్యాండర్ ఎత్తు 4 మీటర్లు, వెడల్పు 2 మీటర్లు. బరువు ప్రయోగ సమయంలో 1,908 కిలోలు. ఈ నెల 15న ఫ్లోరిడాలోని కేప్ కెనెవరాల్ నుంచి కెన్నెడీ అంతరిక్ష కేంద్రం వేదికగా ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో దీన్ని ప్రయోగించారు. భూమి నుంచి చూస్తే చంద్రుడిలో కనిపించే 62 దశలు, అంతరిక్షంలోని ఇతర ప్రాంతాల నుంచి చూస్తే అగుపించే మరో 62 దశలు, ఒక చంద్రగ్రహణం... మొత్తం చంద్రుడి 125 దశలను ప్రతిబింబించే సూక్ష్మ శిల్పాలను ఓ పెట్టెలో పెట్టి ల్యాండర్లో అమర్చడం విశేషం. వీటిని అమెరికన్ కళాకారుడు జెఫ్ కూన్స్ రూపొందించారు. ఈ బుల్లి శిల్పాలకు అరిస్టాటిల్, లియోనార్డో డావిన్సీ, గాంధీ, డేవిడ్ బౌయీ, బిల్లీ హాలిడే వంటి ప్రముఖుల పేర్లు పెట్టారు.

- జమ్ముల శ్రీకాంత్

యుద్ధం @ రెండేళ్లు

ఉక్రెయిన్‌ను మరుభూమిగా మార్చిన రష్యా

అంతులేని వలసలు, మానవీయ సంక్షోభం ● ఇరువైపులా అపార ప్రాణ, ఆయుధ నష్టం

సైనికంగా సూపర్ పవరైన రష్యా చోటా దేశమైన ఉక్రెయిన్‌పై ఉన్నట్టుండి విరుచుకుపడి నేటికి రెండేళ్లు. ఉక్రెయిన్ 'సంపూర్ణంగా నిస్సైనికీకరణే' లక్ష్యంగా 2022 ఫిబ్రవరి 24న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేపట్టిన ఈ దుందుడుకు చర్య ప్రపంచ దేశాలన్నింటినీ నిత్యం ఏదోలా ప్రభావితం చేస్తూనే వస్తోంది. రోజుల్లో ముగుస్తుందనుకున్న యుద్ధం రెండేళ్లు దాటినా కొనసాగుతూనే ఉందంటే ఉక్రెయిన్ కనబరచిన తిరుగులేని తెగువే ప్రధాన కారణం. కానీ కొన్నాళ్లుగా ఉక్రెయిన్ క్రమంగా చతికిలపడుతుండగా రష్యా దూకుడు పెంచుతోంది. అయినా లొంగేందుకు ఉక్రెయిన్ ససేమిరా అంటోంది. పైగా ఆక్రమిత భూభాగాల నుంచి వైదొలగి, తమకు కలగజేసిన అపార నష్టానికి రష్యా భారీగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో యుద్ధం ఇప్పుడప్పట్లో ముగిసే సూచనలు కన్పించడం లేదు...

యుద్ధం తొలినాళ్లలో రష్యా దూకుడు ప్రదర్శించింది. రష్యా సేనలు ఉక్రెయిన్ రాజధాని కీవ్ సమీపం దాకా దూసుకెళ్లాయి. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్కేంద్రాన్ని ఆక్రమించడంతో యావత్ యూరప్ ఖండం భద్రతాపరమైన ఆందోళనలతో ఉలిక్కిపడింది. కానీ ఆ జోరుకు నెల రోజుల్లోనే బ్రేకులు పడ్డాయి. ఉక్రెయిన్ దళాలు ముప్పేట దాడులతో రష్యా సైన్యాన్ని దిగ్బంధించాయి. అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాల దన్నుతో పైచేయి సాధిస్తూ వచ్చాయి. వాటి తీవ్ర ఆంక్షలతో రష్యా అతలాకుతలమైంది. కానీ సెప్టెంబర్ నాటికి జపోరిజియాతో పాటు కీలకమైన డొనెట్స్క్, లుహాన్స్క్, ఖెర్సన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించింది. రష్యాకు చెందిన భారీ యుద్ధ నౌకలతో పాటు క్రిమియాతో రష్యాను కలిపే కీలక బ్రిడ్జిని పేల్చేయడం వంటి చర్యలతో ఉక్రెయిన్ అప్పుడప్పుడూ పైచేయి సాధిస్తూ వచ్చింది. 2023 మేలో ఏకంగా మాస్కోలో పుతిన్ అధికార నివాసమైన క్రెమ్లిన్‌పై రెండు ఉక్రెయిన్ డ్రోన్లు దూసుకెళ్లి కలవరం రేపాయి. తర్వాత నుంచీ ఉక్రెయిన్ దూకుడు నెమ్మదించసాగింది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి దెబ్బకు తొలుత అపార నష్టం చవిచూసిన రష్యా సైన్యం తానూ అదే బాట పట్టింది. కొంతకాలంగా ఇరు బలగాలూ డ్రోన్లపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి! విదేశాల నుంచి భారీగా అందుతున్న వాటికి అదనంగా 2023లోనే ఉక్రెయిన్ ఏకంగా 3 లక్షల డ్రోన్లను తయారు చేసుకుంది! వాటిని 2024లో 10 లక్షలకు పెంచజూస్తోంది. వీటికి చిన్న తరహా మిసైళ్లు తోడవుతున్నాయి.

ఇప్పుడేంటి...!

రష్యా తాజాగా ఉక్రెయిన్‌లోని అద్వివ్‌కా నగరాన్ని ఆక్రమించింది. ఆ క్రమంలో అతి భారీగా ఆయుధ సామగ్రిని కోల్పోయింది. కాకపోతే కొన్నాళ్లుగా విపరీతంగా వచ్చిపడుతున్న చమురు అమ్మకాల లాభాలతో రెట్టించిన ఉత్సాహంతో యుద్ధాన్ని తీవ్రతరం చేస్తోంది. పైగా లక్షలాదిగా అదనపు సైనికులను సిద్ధం చేసుకుంటోంది. ఇవన్నీ ఉక్రెయిన్‌కు భారీ హెచ్చరిక సంకేతాలే. స్వీయ సాయుధ సామగ్రి నిండుకుంటుండటమే గాక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న అమెరికా, పాశ్చాత్య దేశాల నుంచి సాయమూ బాగా తగ్గింది. ఏదేమైనా రష్యా గెలిచేదాకానో, పుతిన్ అధికారంలో ఉన్నంత వరకో యుద్ధం కొనసాగుతుందని భావిస్తున్నారు. ఈ పోరులో ఉక్రెయిన్ మాత్రం ఇప్పటికే బహుశా ఇంకెప్పటికీ కోలుకోలేనంతగా దెబ్బ తిన్నది.

- సాక్షి, నేషనల్ డెస్క్



అపార నష్టం...

- యుద్ధంలో మరణించిన, క్షతగాత్రులైన రష్యా, ఉక్రెయిన్ సైనికుల సంఖ్య ఏకంగా 5 లక్షలు దాటినట్టు అంచనా.
- 12,000 మందికి పైగా అమాయక ఉక్రేనియన్లు యుద్ధానికి బలయ్యారు. 20,000 పై చిలుకు మంది క్షతగాత్రులయ్యారు.
- కోటి మంది దాకా ఉక్రేనియన్లు నిర్వాసితులయ్యారు. వీరిలో 60 లక్షలకు పైగా విదేశాలకు వలసబాట పట్టారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇదే అతి పెద్ద వలసగా నిలిచింది.
- అమెరికా, పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు ఇప్పటికే బిలియన్ల కొద్దీ ఆర్థిక సాయం, అంతకు మించి అత్యాధునిక ఆయుధ సాయం చేస్తూ వస్తున్నాయి.
- ఐఎంఎఫ్ కూడా 15.6 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందజేసింది. యుద్ధంలో ఉన్న ఓ దేశానికి ఆర్థిక సాయం ఐఎంఎఫ్ చరిత్రలోనే తొలిసారి.
- రెండేళ్ల యుద్ధంలో 20 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని మాత్రమే రష్యా ఆక్రమించగలిగింది. అందులోనూ సగం తిరిగి తమ వశమైనట్టు ఉక్రెయిన్ చెబుతోంది.

మార్చి 13 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

న్యూఢిల్లీ: దేశంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి ఇప్పటికే మొదలైంది. తమ భవితవ్యాన్ని నిర్దేశించే ఈ ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. మార్చి 13వ తేదీ తర్వాత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, దీనిపై ముమ్మరంగా కసరత్తు జరుగుతోందని ఎన్నికల సంఘం వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ బృందం వివిధ రాష్ట్రాల్లో పర్యటించింది. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) పరిశీలన దాదాపు పూర్తి చేసింది. మిగిలిన రాష్ట్రాల్లో ఈసీ బృందం పర్యటన మార్చి 13లోగా పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది.

అతి త్వరలోనే కేజ్రీవాల్ అరెస్ట్

తమకు సమాచారం ఉందన్న ఆప్ నేతలు


న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్ట్ చేసేందుకు సీబీఐ ప్రయత్నాలు చేస్తోందని శుక్రవారం ఆప్ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ చేస్తున్న ప్రయత్నాలతో బీజేపీలో భయం మొదలైందని పేర్కొంది. రెండు పార్టీల మధ్య పొత్తు కుదరకుండా చేసేందుకే తమ నేత కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని చూస్తోందని ఆరోపించింది. ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై ఆప్, కాంగ్రెస్‌ల మధ్య చర్చలు కొలిక్కి వచ్చిన విషయం తెలియగానే ఈడీ గురువారం కేజ్రీవాల్‌కు ఏడో విడత నోటీసులిచ్చిందని ఆయన చెప్పారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు సీబీఐ ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. శుక్రవారం సాయంత్రానికల్లా కేజ్రీవాల్‌కు నోటీసులు అందజేస్తుందని, రెండు మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తుందని ఆయన అన్నారు.

ఎక్స్ మెయిల్ వచ్చేస్తోంది !

సూచనప్రాయంగా వెల్లడించిన కుబేరుడు ఎలాన్‌మస్క్

వాషింగ్టన్: ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ పేరును 'ఎక్స్'గా మార్చిన దాని నూతన యజమాని, కుబేరుడు ఎలాన్ మస్క్ అదే పేరుతో ఒక ఈమెయిల్‌ను తీసుకురానున్నారు. 'ఎక్స్ మెయిల్' త్వరలో రాబోతోందని ఆయన స్వయంగా ప్రకటించారు. ఈమెయిల్ సేవల ముఖచిత్రం మారబోతోందని వ్యాఖ్యానించారు. అయితే సొంత ఎక్స్‌మెయిల్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారు, అందులోని ప్రత్యేకతలు ఏంటి అనే వివరాలను ఇంకా వెల్లడించలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు నెటిజన్లు అందరూ వాడే గూగుల్ వారి జీమెయిల్ త్వరలో తన సేవలను నిలిపివేయనుందన్న పుకార్ల నడుమ ఎక్స్ మెయిల్ అరంగేట్రం చేయనుండటం గమనార్హం. జీమెయిల్ 2024 ఆగస్ట్ ఒకటో తేదీన కనుమరుగుకానుందంటూ 'ఎక్స్'లో ఒక వార్త ప్రత్యక్షమై విస్తృత చర్చకు తెరలేపింది. గూగుల్ పంపిన ఒక ఈమెయిల్‌లో 'త్వరలో జీమెయిల్ అస్తమించబోతోంది' అంటూ ఒక సందేశం ఉందని ఆ వార్తలోని సారాంశం. దీనిపై జీమెయిల్ మాతృసంస్థ గూగుల్ స్పందించింది. 'అవన్నీ శుద్ధ అబద్ధాలు. ఇన్నాళ్లూ బేసిక్ హెచ్‌టీఎంఎల్ వ్యూ ఫార్మాట్‌లో జీమెయిల్ సేవలు అందించాం. ఆ సేవలను ఈ ఏడాది నిలిపివేసి త్వరలోనే 'స్టాండర్డ్' వ్యూలో జీమెయిల్ సేవలను అధునాతనంగా అందిస్తాం' అని గూగుల్ స్పష్టతనిచ్చింది. దీంతో జీమెయిల్ యూజర్లంతా ఊపిరి పీల్చుకున్నారు. కొత్తగా రాబోయే ఎక్స్‌మెయిల్ ఏమేరకు జీమెయిల్‌కు పోటీ ఇవ్వగలదో చూడాలి మరి. త్వరలోనే అది అందుబాటులోకి వస్తుందని 'ఎక్స్' ఇంజనీరింగ్, సెక్యూరిటీ టీమ్ సీనియర్ సభ్యుడు న్యాట్ మెక్‌గ్రేడీ వెల్లడించారు.

మనోహర్ జోషి అస్తమయం



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యనేతగా పేరొందిన ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి శుక్రవారం తుదిశ్వాస విడిచారు. గుండె లయ (కార్డియాక్ అరెస్ట్) ఆగడంతో ముంబైలోని పీడీ హిందూజా ఆస్పత్రిలో 21వ తేదీన తేదీన ఆయనను చేర్పించి ఐసీయూలో చికిత్సనందిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మెదడులో రక్తస్రావం కారణంగా గత ఏడాది మే నెలలోనూ ఆయన ఆస్పత్రిలో చేరారు. ఈయన భార్య అనఘ 2020లో మరణించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జోషి సర్‌గా అందరూ పిలుచుకునే 86 ఏళ్ల మనోహర్ శివసేన నుంచి ముఖ్యమంత్రి అయిన తొలినేతగా పేరొందారు. 1995-96 కాలంలో సీఎంగా ఉన్నారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలో 2002-2004 మధ్య లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు.

సందేశ్‌ఖాలీలో పెల్లుబికిన నిరసనలు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ షేక్, సోదరుడు సిరాజ్, వారి అనుచరులు తమపై లైంగిక దాడులకు పాల్పడి భూములను లాక్కున్నారంటూ పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో కొద్దిరోజులుగా మహిళలు చేస్తున్న నిరసనలు మరింత ఎక్కువయ్యాయి. సందేశ్‌ఖాలీలోని ఝుప్‌ఖాలీ ప్రాంతంలోకి పోలీసులు రాకుండా ఆందోళనకారులు రోడ్లపై దుంగలతో నిప్పుపెట్టారు. తృణమూల్ కాంగ్రెస్ నేతల ఆస్తులను తగలబెట్టారు. ఇన్నిరోజులైనా షాజహాన్, అతని అనుచరులను అరెస్ట్‌చేయకపోవడంపై పోలీసుల నిర్లిప్త వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. బెల్మాజూర్ దగ్గరి ఫిషింగ్‌యార్డ్ నిర్మాణాలను తగలబెట్టారు. పోగొట్టుకున్న భూములు, గౌరవాన్ని తిరిగి పొందేందుకు, పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ ఆందోళనలు చేపట్టామని స్థానికులు చెప్పారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఆందోళనలను అడ్డుకున్న పోలీసులు కొందరిని అరెస్ట్‌చేసి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా మహిళలు పోలీసు వాహనాలకు అడ్డంగా పడుకున్నారు. 'షాజహాన్‌ను అరెస్ట్‌చేసే దమ్ములేని మీరు మా వాళ్లను ఎలా తీసుకెళ్తారు? మా మనుషుల అండలేకుండా మాకు రక్షణ ఎలా ఉంటుంది?' అని ఒక మహిళ పోలీసులను నిలదీసింది. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

అపార్టుమెంట్లలో అగ్నికీలలు

పదిమంది మృతి, మరో 14 మంది గల్లంతు

వలెన్సియా(స్పెయిన్): స్పెయిన్‌లోని తూర్పు ప్రాంత వలెన్సియా నగరంలోని నివాస సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం ఓ అపార్టుమెంట్‌లో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న మరో అపార్టుమెంట్‌కు వ్యాపించాయి. మంటల్లో పదిమంది సజీవదహనం కాగా మరో 14 మంది జాడ తెలియకుండా పోయింది. గాయాలతో మరో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంటల తీవ్రతకు 14 అంతస్తుల భవనం కూలడానికి సిద్ధంగా ఉందని మేయర్ మర జోస్ తెలిపారు. వేడి తీవ్రత కారణంగా లోపల చిక్కుబడిపోయిన వారిని గుర్తించేందుకు అత్యవసర సిబ్బంది వెళ్లలేకపోతున్నారని అన్నారు. ఈ సముదాయంలో 140 అపార్టుమెంట్లున్నాయన్నారు. భవన నిర్మాణంలో వాడిన పాలియురేథేన్ షీట్లే మంటలు వేగంగా వ్యాపించడానికి కారణమని భావిస్తున్నామని నిపుణులు అంటున్నారు. 2017లో లండన్‌లోని గ్రెన్‌ఫెల్ టవర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదానికి ఇలాంటి షీట్లే కారణమన్నారు. అప్పటి ఘటనలో 70 మందికి పైగా చనిపోయారని గుర్తు చేశారు.



స్పెయిన్‌లోని వలెన్సియాలో అగ్నికి ఆహుతవుతున్న అపార్టుమెంట్లు

ఐదేళ్లలో అభివృద్ధికి నమూనాగా భారత్

వారణాసి పర్యటనలో మోదీ
- రూ.13,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

వారణాసి: భారత్ వచ్చే ఐదేళ్లలో అభివృద్ధికి నమూనా(మోడల్)గా మారడం ఖాయమని, ఇది 'మోదీ గ్యారంటీ' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆయన గురువారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం వారణాసికి చేరుకున్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీలో 'సంసద్ సంస్కృత్ ప్రతియోగితా' అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా వారసత్వం, అభివృద్ధికి కాశీ నగరం ఒక మోడల్‌గా కనిపిస్తోందని, సంస్కృతి, సంప్రదాయం చుట్టూ ఆధునిక అభివృద్ధిని ప్రపంచం వీక్షిస్తోందని అన్నారు. వచ్చే ఐదేళ్లలో మన దేశం అభివృద్ధికి మోడల్‌గా మారుతుందని చెప్పారు. భారతీయ సుసంపన్న ప్రాచీన వారసత్వం గురించి ప్రపంచమంతటా చర్చించుకుంటున్నారని తెలిపారు. కాశీ సంసద్ జ్ఞాన్ ప్రతియోగితా, కాశీ సంసద్ ఫొటోగ్రఫీ ప్రతియోగితా, కాశీ సంసద్ సంస్కృత్ ప్రతియోగితా అవార్డులను నరేంద్ర మోదీ విజేతలకు అందజేశారు. అనంతరం రూ.13,000 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తాను గత పదేళ్లుగా ఇక్కడి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నానని, వారణాసి తనను బనారసిగా మార్చిందని అన్నారు. వారణాసి యువతను కొందరు కాంగ్రెస్ నేతలు నషేరీ(మత్తులో మునిగిపోయినవారు) అని దూషిస్తున్నారని పరోక్షంగా రాహుల్ గాంధీపై మోదీ మండిపడ్డారు. నిజంగా స్పృహలో ఉన్నవారు అలా మాట్లాడరని చెప్పారు. గత 20 ఏళ్ల పాటు తనను తిట్టారని, ఇప్పుడు యువతపై ఆక్రోశం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. అయోధ్య, కాశీని అభివృద్ధి చేయడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్నారు. అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ట జరిగినప్పుడు వారు ఏం మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అర్ధరాత్రి వారణాసి రోడ్లపై నడుస్తూ తనిఖీ చేశారు.

ప్రజలను విపక్షాలు కులాల పేరిట రెచ్చగొడుతున్నాయ్

విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. విపక్షాలు కులాల పేరిట ప్రజలను రెచ్చగొడుతున్నాయని, గొడవలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. దళితులు, గిరిజనులు ఉన్నత పదవులు చేపడితే విపక్ష నాయకులు సహించలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును తాము పోటీకి దింపితే ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వలేదని, ఆమెను ఓడించేందుకు ప్రయత్నించాయని గుర్తుచేశారు. దళితులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను విపక్షాలు వ్యతిరేకించాయని చెప్పారు. వారణాసిలో శుక్రవారం సంత్ రవిదాస్ 647వ జయంతి వేడుకల్లో మోదీ మాట్లాడారు. ప్రతి శకంలో యోగులు ప్రజలకు దారి చూపారని, తప్పుడు మార్గంలో నడవకుండా అప్రమత్తం చేశారని చెప్పారు. కులం పేరిట ఎవరైనా వివక్ష చూపితే అది మానవత్వంపై చేసిన దాడి అవుతుందని పేర్కొన్నారు.



శుక్రవారం వారణాసిలో బహిరంగ సభ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ



నవాల్నీ కూతురు దషా, భార్య యూలియాతో భేటీ అయిన బైడెన్

రష్యాపై భారీ ఆంక్షలు

అమెరికా, ఈయూ వెల్లడి

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి తెగబడ్డ రష్యా మీద అమెరికా, యూరోపియన్ యూనియన్ శుక్రవారం మరిన్ని ఆంక్షలకు తెర తీశాయి. ఈసారి కూడా ప్రధానంగా ఆ దేశ ఆర్థిక, రక్షణ, పారిశ్రామిక నెట్‌వర్కులను లక్ష్యం చేసుకున్నాయి. రష్యా, దాని సన్నిహితులపై ఏకంగా 500పై చిలుకు ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు! మతిలేని హత్యాకాండకు, వినాశనానికి పుతిన్ మూల్యం చెల్లించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. మరోవైపు భారీ ఆయుధాల తయారీ తదితరాలకు ఉపయోగపడే నిషేధిత వస్తువులను రష్యాకు ఎగుమతి చేసిన ఆరోపణలపై పలు విదేశీ కంపెనీలపై కఠిన ఆంక్షలు విధిస్తున్నట్టు ఈయూ సమాఖ్య ప్రకటించింది.

నవాల్నీ కుటుంబంతో బైడెన్ భేటీ: అంతకు ముందు రష్యా విపక్ష నేత దివంగత అలెక్సీ నవాల్నీ భార్య యూలియా నవాల్నయా, కూతురు దషాతో బైడెన్ భేటీ అయ్యారు. నవాల్నీ మృతి పట్ల దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ''నవాల్నీ సాటిలేని ధైర్యశాలి. ఆయన పోరాటాన్ని యూలియా, దషా ముందుకు తీసుకెళ్తారని పూర్తి విశ్వాసముంది'' అన్నారు. నవాల్నీ మృతదేహానికి గోప్యంగా తక్షణ అంత్యక్రియలు జరిపేందుకు అంగీకరించేలా జైలు అధికారులు తనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని తల్లి లుడ్మిలా ఆరోపించారు. ఆలస్యమైతే శవం కుళ్లిపోతుందంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. గురువారం కుమారుని మృతదేహాన్ని చూసిన అనంతరం ఆమె ఈ మేరకు వీడియో విడుదల చేశారు.

నేనేం మలాలాను కాను... మా దేశంలో సంతోషంగా ఉన్నా

కశ్మీర్‌లో అణచివేత లేదన్న కశ్మీరీ యువతి

లండన్: ఉగ్రవాదానికి భయపడి మలాలా యూసఫ్‌జాయ్ మాదిరిగా బ్రిటన్‌కు మకాం మార్చాల్సిన అగత్యం తమకు లేదని కశ్మీర్‌కు చెందిన హక్కుల కార్యకర్త, పాత్రికేయురాలు యానా మిర్ కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు బ్రిటన్ పార్లమెంట్ భవనం వేదికగా ఆమె చేసిన ప్రసంగంపై ప్రశంసలు కురుస్తున్నాయి. బ్రిటన్ పార్లమెంట్ భవనంలో జమ్మూకశ్మీర్ స్టడీ సెంటర్ నిర్వహించిన 'సంకల్ప్ దివస్'లో ఆమె మాట్లాడారు. కశ్మీర్‌లో స్థానికులను కేంద్రం అణచివేస్తోందన్న వార్తలు పచ్చి అబద్ధమంటూ కుండబద్దలు కొట్టారు. ''భారత్‌లో అంతర్భాగమైన నా సొంత గడ్డ కశ్మీర్లో నేను స్వేచ్ఛగా, సురక్షితంగా, సంతోషంగా ఉన్నా. మలాలా మాదిరిగా స్వదేశంలో ఉగ్రవాదానికి భయపడి బ్రిటన్‌కు వెళ్లలేదు. పారిపోయి శరణార్థిగా బతకాల్సిన అగత్యమూ నాకు లేదు. మలాలాకు ఒక్కటే చెప్పదలచా. ప్రగతిశీల భారత్‌లో, అందులోనూ కశ్మీర్లో అణచివేత ఉందంటే ఒప్పుకోను. కశ్మీర్‌ను ఒక్కసారి కూడా ప్రత్యక్షంగా చూడని వాళ్లు విదేశాల్లో ఉంటూ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వండుతున్నారు. బ్రిటన్, పాక్‌లో ఉంటూ అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి దుష్ప్రచారాలను ఆపండి. ప్రశాంతంగా మమ్మల్ని బతకనివ్వండి. జై హింద్ అని అన్నారు.

కేసు నమోదయ్యాకే అంత్యక్రియలు

- పది రోజులైనా వేచి ఉంటాం
- తేల్చి చెప్పిన రైతు సంఘాలు

చండీగఢ్: పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద బుధవారం 'ఢిల్లీ చలో' ఆందోళనల్లో పాల్గొన్న రైతులు హరియాణా పోలీసుల మధ్య జరిగిన ఘర్షణలో శుభ్‌కరణ్‌సింగ్(21) అనే యువ రైతు గాయాలతో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. శుక్రవారం ఖనౌరీ వద్ద కొనసాగుతున్న ఆందోళనలో పలువురు రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు. శుభ్‌కరణ్ మృతికి బాధ్యులైన వారిపై పంజాబ్ ప్రభుత్వం కేసు నమోదు చేసే వరకు అంత్యక్రియలు జరిపేది లేదని నేతలు తేల్చి చెప్పారు. శుభ్‌కరణ్‌ను అమరుడిగా ప్రకటించాలని కూడా డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ మేరకు శుభ్‌కరణ్ కుటుంబానికి రూ.కోటి పరిహారంతోపాటు అతడి సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ పంజాబ్ సీఎం మాన్ ప్రకటించారు. రైతు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలుంటాయని కూడా సీఎం స్పష్టం చేశారు. అనంతరం రైతు నేత సర్వాన్ సింగ్ పంధేర్ మీడియాతో మాట్లాడారు. 'మాక్కావాల్సింది డబ్బు కాదు. మృతికి బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే మాకు ముఖ్యం. ఆ తర్వాతే అంత్యక్రియలు జరుపుతాం. ఇందుకు అవసరమైతే 10 రోజులైనా సరే వేచి ఉంటామని శుభ్‌కరణ్ కుటుంబసభ్యులు మాకు చెప్పారు' అని వివరించారు.

రైతులపైకి టియర్ గ్యాస్..

హిసార్: హరియాణా పోలీసులతో శుక్రవారం మరోసారి రైతులు తలపడ్డారు. ఖనౌరీ వద్ద నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఖేరి చోప్తా గ్రామ రైతులను పోలీసులు అడ్డగించారు. కొందరు రైతులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలో కొందరు రైతులతోపాటు పోలీసులు గాయపడ్డారు. పోలీసులు వారిపైకి టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొందరు రైతులను అదుపులోకి తీసుకున్నారు.

గుండెపోటుతో మరో రైతు మృతి

పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఆందోళనల్లో పాల్గొంటున్న దర్శన్ సింగ్(62) అనే రైతు గుండెపోటుతో చనిపోయినట్లు రైతు సంఘం నేతలు చెప్పారు. మరోవైపు ఆందోళనలకు సారథ్యం వహిస్తున్న రైతు సంఘాల నేతలు శుక్రవారం పలు అంశాలపై చర్చించారు. తదుపరి కార్యాచరణను 29న ప్రకటిస్తామని మీడియాకు తెలిపారు. శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేపడతామన్నారు.

పంజాబ్‌వ్యాప్తంగా బ్లాక్ డే

అమృత్‌సర్: రైతులపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ పంజాబ్ అంతటా రైతులు బ్లాక్ డే పాటించారు. శుభ్‌కరణ్ మృతిని నిరసిస్తూ అమృత్‌సర్, లూధియానా, హోషియార్‌పూర్ సహా 17 జిల్లాల్లో నిరసనలు చేపట్టినట్లు రైతు సంఘాలు వెల్లడించాయి.

సాక్షి హైదరాబాద్
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024

మార్చ్ 3న ఎల్లో రిబ్బన్ రన్

ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కోసం రన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నటి రాశిసింగ్, డాక్టర్ విమీ బింద్రా తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: సామాజికంగా తీవ్ర ప్రభావం చూపే ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన పెంచేందుకు ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహించనున్నారు. నగరంలోని జలవిహార్, నెక్లెస్ రోడ్డు వేదికగా మార్చ్ 3వ తేదీన కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించి శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణలో వర్ధమాన సినీ తారలు శివ కందుకూరి, రాశిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమీ బింద్రా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 4.2 కోట్లకు పైగా ఎండోమెట్రియాసిస్ బాధితులు ఉన్నారన్నారు. ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ వ్యాధిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. బాధితుల్లో దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ వ్యాధి గుర్తించగలుగుతున్నామని, దీనిపై మరింత అవగాహన పెరగాలని తెలిపారు. ఈ వ్యాధిని ఇన్సూరెన్స్ స్కీముల్లో, కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారతి లాంటి పథకాల్లో చేర్చేలా కృషి చేస్తామని బీజేపీ నేషనల్ ఉమెన్ పాలసీస్ ఇన్‌ఛార్జ్ కరుణాగోపాల్ పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల పైబడిన వారు ఈ రన్‌లో పాల్గొనవచ్చని, https://www.ifinish.in/event-details లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు అర్చన, స్వేత పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేయలేరు!

ఈటల రాజేందర్



లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు అమలు చేయడం అసాధ్యమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్టానం ఆదేశిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ మేనియా నడుస్తోందని, కరోనా సమయంలోనూ పలు దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేది బీజేపీనేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కళ్లెం నవ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి ఆప్షన్ పద్ధతే కరెక్ట్

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: గురుకుల పాఠశాల, ఇతర ఉద్యోగ పోస్టుల భర్తీలో రిలీంక్యాష్ పద్ధతి ప్రవేశపెట్టడంతో పాటు ఆప్షన్స్ ద్వారా నియామకాలు పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో 12 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల ఫలితాలు కూడా ప్రకటించిందన్నారు. ఇందులో లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీ టీచర్స్, గ్రాడ్యుయేట్ టీచర్స్ పోస్టులు ఉన్నాయన్నారు. అయితే, సెలక్ట్ అయిన అభ్యర్థుల్లో సుమారు నాలుగు వేల మందికి ఈ నాలుగు పోస్టులే వచ్చాయని.. వారంతా లెక్చరర్స్ పోస్టులు ఎంపిక చేసుకోగా మిగిలినవి బ్యాక్‌లాగ్‌లుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో ఏళ్లుగా ఆందోళనలు చేసి టీచర్స్ నోటిఫికేషన్ సాధించుకుంటే.. పోస్టులు పెద్ద ఎత్తున మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే రిలీం క్యాష్ ప్రవేశపెట్టి ఆప్షన్ పద్ధతి ద్వారా మిగతా పోస్టులను నింపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేశ్, గుజ్జ కృష్ణ, సుధాకర్, నందగోపాల్, సి.రాజేందర్, అనంతయ్య, రామలింగం, రేగుల మధుసూదన్, అస్మా బేగం, ఉపేంద్ర, బాలరాజు, రాజేందర్, సుజాతలావణ్య, అలేఖ్య, లక్ష్మి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

మురుగు ముంచెత్తుతున్నా పట్టించుకోరా?

గాంధీ ఆస్పత్రిలో అపరిశుభ్రతపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

గాంధీ ఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల లీకేజీ, భవన నిర్వహణపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పైప్‌లైన్లు లీకై మురుగు ముంచెత్తుతున్నా ఇంజినీర్లు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య మృతదేహానికి నివాళి అర్పించిన తర్వాత ఆస్పత్రి సూపరింటెండెంట్ పేషీకి మంత్రి చేరుకున్నారు. మార్చురీ నుంచి ప్రధాన భవనం వరకు నడుచుకుంటూ వెళ్తూ డ్రైనేజీ పైప్‌లైన్లు లీకేజీలను గమనించారు. సమస్యపై ప్రక్కనే ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావును అడిగి ఆరా తీశారు. ఏడాది క్రితం రూ.14.56 కోట్లు మంజూరు చేసి, ఆరుసార్లు టెండర్లు పిలిచినా ఏవరూ ముందుకు రాలేదని రాజారావు తెలిపారు.

ఆ రెండే బాగున్నాయి..

గాంధీ ఆస్పత్రిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సూపరింటెండెంట్ పేషీ, కాన్ఫరెన్స్ హాల్ మాత్రమే బాగున్నాయని, మిగతా ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గాంధీ ఆస్పత్రి గొప్పగా ఉంటుందనుకుంటే వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయన్నారు. గాంధీ డ్రైనేజీ లీకేజీల పరిశీలనకు టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ బృందం ద్వారా సమగ్ర నివేదిక తెప్పించుకుంటామని తెలిపారు. ఆపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయమై వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఇంజినీర్ల బృందం ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్ రాజారావుతో భేటీ అయ్యారు.





మృతదేహాన్ని చూసేందుకు తరలివచ్చిన అభిమానులు

లాస్య నందిత మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి నివేదిత

అయ్యో లాస్య..

భోరుమన్న కంటోన్మెంట్ | శోకసంద్రంలో అభిమానులు

ఎమ్మెల్యే మృతితో విషాదఛాయలు

- సాయన్న వారసురాలిగా రాజకీయ అరంగేట్రం
- తండ్రి బాటలో నడిచిన తనయ
- కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యే వరకు
- ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలలకే ఇంతటి విషాదం
- అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున ప్రణాళికలు
- లాస్యకు నివాళులు అర్పించిన నేతలు, నాయకులు
- అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు



కంటోన్మెంట్/రసూల్‌పురా: 30 ఏళ్లుగా కంటోన్మెంట్‌తో విడదీయలేని బంధం ఏర్పరుచుకున్న దివంగత ఎమ్మెల్యే సాయన్న వారసురాలిగా లాస్య నందిత అనతికాలంలోనే రాజకీయాల్లో ప్రత్యేకత చాటుకున్నారు. 2016లో కార్పొరేటర్‌గా గెలిచిన ఆమె ఐదేళ్ల పాటు సేవలందించారు. నాటి నుంచి కంటోన్మెంట్ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా కొనసాగుతూ వచ్చారు. సోదరి నివేదితతో కలిసి తండ్రికి అండగా ఉంటూ వచ్చారు. ఈ క్రమంలోనే సాయన్న తన తర్వాత లాస్యను ఎమ్మెల్యే చేయాలని తపించేవారు. అయితే, దురదృష్టవశాత్తూ గతేడాది సాయన్న తన పదవీకాలం ముగియక ముందే మరణించారు. సాధారణ ఎన్నికలు ఏడాదిలోపే గడువు ఉండటంతో ఉప ఎన్నికలు జరగలేదు. అయినప్పటికీ సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ లాస్యకు టికెట్ ఇవ్వడడంతో పోటీ చేసి గెలిచారు.

సాయన్న టీమ్‌తో కలసిమెలసి..

దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా అభిమానులను సంపాదించుకున్నారు. లాస్య ఆయా వర్గాలను కలుస్తూ వారి మద్దతును కూడదీస్తూ గత ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించారు. ప్రజాసంఘాలు, కాలనీలు, బస్తీ సంక్షేమ సంఘాలతో ప్రత్యక్ష సంబంధాలు నెరుపుతూ వచ్చారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలపై దృష్టి సారిస్తూ దశల వారీగా పరిష్కారానికి చర్యలు చేపడుతూ వచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండునెలల్లోనే ప్రజాక్షేత్రంలోకి చొచ్చుకుపోతుండటంతో సాయన్న వర్గీయులు ఆనందం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఇంతలోనే లాస్య నందిత మృత్యువాత పడటంతో కార్యకర్తలను కలిచి వేసింది. లాస్య మృతి వార్త వెలువడగానే నియోజకవర్గ వ్యాప్తంగా సాయన్న, లాస్య అభిమానులు కార్ఖానాకు పోటెత్తారు.

ఒకే ఒక్క బోర్డు సమావేశానికి హాజరు

కంటోన్మెంట్ బోర్డులో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారు. లాస్య ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నర నెలల్లో రెండు బోర్డు సమావేశాలు జరిగాయి. గత నెలలో జరిగిన సమావేశానికి మాత్రమే ఆమె హాజరయ్యారు. అమ్ముగూడ రోడ్డుకు తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో రూ.1 కోటి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. గత బుధవారం బోర్డు కార్యాలయానికి వచ్చిన ఆమె, బోర్‌వెల్స్ మీటర్లు పెట్టాలన్న బోర్డు ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంతలోనే లాస్య మృతి చెందడంపై స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

2015లో రాజకీయ అరంగేట్రం..

దివంగత ఎమ్మెల్యే సాయన్న 1994 నుంచి వరుసగా మూడుసార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2009లో తొలిసారి ఓటమిపాలయ్యారు. తిరిగి 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఎనిమిది నెలల వ్యవధిలోనే 2015 జనవరిలో జరిగిన కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో నాలుగో వార్డు నుంచి లాస్య నందితను రాజకీయ ఆరంగేట్రం చేయించారు. అయితే, ఈ ఎన్నికల్లో నళిని కిరణ్ చేతిలో లాస్య ఓటమి పాలయ్యారు. మరుసటి ఏడాది సాయన్న టీఆర్ఎస్‌లో చేరగా 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ నుంచి బీఆర్ఎస్ టికెట్ ఇప్పించుకున్నారు. కాగా, 1986లో సాయన్న తొలిసారిగా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలైన అదే ప్రాంతం(కవాడిగూడ) నుంచి 2015లో లాస్య గెలుపొందడం విశేషం. అయితే, 2021 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మరోసారి కవాడిగూడ నుంచి పోటీ చేసి లాస్య ఓటమి పాలయ్యారు. తాజాగా 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

అభివృద్ధి పనులపై దృష్టి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాయన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని వార్డుల్లో పవర్ బోర్‌వెల్స్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయన మరణంతో ఆయా పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈక్రమంలో ఇటీవల ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య.. రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, గన్ బజార్, మడ్ ఫోర్ట్, శ్రీరాంనగర్ డబుల్ బెడ్‌రూం గృహ సముదాయం, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో పవర్‌బోర్లు వేయించారు. అదేవిధంగా బొల్లారంలో శిథిలావస్థలో ఉన్న జూనియర్ కళాశాల భవనం స్థానంలో నూతన నిర్మాణానికి ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు పయనీర్ బజార్, ఆదర్శనగర్ బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ, పవర్ బోర్‌వెల్స్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదే విధంగా మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో తాగునీటి పైపులైను పనులు పూర్తిలా చర్యలు తీసుకున్నారు. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల్లో మన ఊరు మన బడి నిధులతో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నారాయణ జోపిడి సంఘం డబుల్‌బెడ్ రూం ఇళ్లు త్వరగా పూర్తి అయ్యేలా రెవెన్యూ, గృహనిర్మాణ అధికారులను ఆదేశించారు.

మార్చురీ వద్ద విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మార్చురీ వద్దకు చేరుకుని మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే లాస్య నందిత.. ఆమె తండ్రి, దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్నతో తమకున్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

ఎమ్మెల్యే ఒంటిపై 12 తాయిత్తులు..

రెండుసార్లు ప్రాణాలతో బయటపడిన ఎమ్మెల్యే లాస్య నందితను మృత్యువు మూడోసారి రోడ్డు ప్రమాద రూపంలో బలి తీసుకుంది. కంటోన్మెంట్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభోత్సవ సందర్భంగా లిఫ్ట్‌లో ఇరుక్కోవడం, ఇటీవల నల్లగొండ వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు కిందపడి ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లాస్య పలు ఆలయాలు, బాబాల వద్ద ప్రత్యేక పూజలు చేయించుకొని తాయిత్తులు కట్టించుకున్నట్టు తెలుస్తోంది. గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న సమయంలో మృతదేహంపై సుమారు 12 తాయిత్తులు ఉన్నట్టు వైద్యులు గుర్తించి పోలీసులకు అప్పగించినట్టు తెలిసింది.

తలకు గాయం కావడంతో..

ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతోనే ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందినట్టు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో తెలిసింది. ప్రమాదంలో ఎడమకాలు విరిగిపోవడంతో పాటు దంతాలు ఊడిపోయాయి. గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్ఓడీ కృపాల్‌సింగ్, ప్రొఫెసర్ లావణ్య కౌశిల్ నేతృత్వంలో ఆరుగురు వైద్యబృందం పోస్టుమార్టం నిర్వహించారు.

ఎమ్మెల్యేల నివాళి

గాంధీ మార్చురీలో ఉన్న ఎమ్మెల్యే లాస్య మృతదేహానికి పలువురు ఎమ్మెల్యేలు నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.గాంధీ ఆస్పత్రికి చేరుకున్న వారిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి శ్రీపతి, కోవా లక్ష్మి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్.. లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులున్నారు. లాస్య అకాల మృతిపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.



లాస్య అంతిమయాత్ర

మంచి భవిష్యత్తు ఉన్న నాయకురాలు: మంత్రి కోమటిరెడ్డి

బంగారు భవిష్యత్తు ఉన్న ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తాను దిగ్భ్రాంతికి గురయ్యానని, ఇది అత్యంత బాధకరమైన విషయమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గాంధీ మార్చురీ వద్ద లాస్య నందిత మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఆమె ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్నతో తనకు 15 ఏళ్ల అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.

స్టన్నింగ్ స్టేషన్స్!

- అమృత్ భారత్ పథకం కింద సిటీలోని రైల్వేస్టేషన్‌లకు నయా లుక్

సాక్షి, సిటీబ్యూరో: సిటీ రైల్వేస్టేషన్‌లకు కొత్త సొబగులు చేకూరనున్నాయి. అమృత్‌భారత్ పథకం కింద అధునాతన సదుపాయాలతో వీటిని అభివృద్ధి చేసేందుకు దక్షిణ మధ్యరైల్వే కార్యాచరణ చేపట్టింది. ఈక్రమంలో ప్రధాన రైల్వేస్టేషన్‌లతో పాటు ఎంఎంటీఎస్ స్టేషన్‌ల అభివృద్ధి పనులను సైతం ప్రారంభించింది. నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల తర్వాత ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే బేగంపేట్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు ఇప్పటికే శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు చెబుతున్నారు. అమృత్‌భారత్ పథకం కింద సుమారు రూ.26.55 కోట్లతో బేగంపేట్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. మరోవైపు హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ, ఉందానగర్, మలక్‌పేట్, యాకుత్‌పురా స్టేషన్‌లను కూడా దశలవారీగా అభివృద్ధి చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దాదాపు రూ.26 కోట్ల కేటాయింపు..

అమృత్‌భారత్ పథకం కింద ఒక్కో స్టేషన్ అభివృద్ధికి రూ.22 కోట్ల నుంచి రూ.26 కోట్ల వరకు కేంద్రం కేటాయించింది. బేగంపేట్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం 122 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో 70 శాతం ఎంఎంటీఎస్ రైళ్లు కాగా కోణార్క్, గరీబ్‌రథ్, భువనేశ్వర్, గౌతమి, నారాయణాద్రి, హుస్సేన్‌సాగర్, హంఫీ, సికింద్రాబాద్-పూనే శతాబ్ది ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-బీదర్ ఇంటర్‌సిటీ తదితర రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ కల్పించారు. ప్రతి రోజు సుమారు 16,648 మంది ప్రయాణిస్తుంటారు. దీంతో బేగంపేట్ స్టేషన్ నుంచి ఏటా రూ.19.5 కోట్ల ఆదాయం లభిస్తున్నట్లు అంచనా. కాగా, బేగంపేట్ స్టేషన్‌తో పాటు హఫీజ్‌పేట్ అభివృద్ధి పనులు సైతం కొనసాగుతున్నాయి.

త్వరలో నాంపల్లి పునరాభివృద్ధి..

సికింద్రాబాద్ స్టేషన్ తరహాలోనే నాంపల్లి స్టేషన్‌ను కూడా రీడెవలప్ చేసేందుకు దక్షిణమధ్య రైల్వే ప్రణాళికలు రూపొందించింది. సుమారు రూ.327 కోట్లతో స్టేషన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ప్రతి రోజు 50 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే నాంపల్లి స్టేషన్‌ను కూడా అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి చేయనున్నారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతిలో 24 నెలల వ్యవధిలో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నట్టు డిప్యూటీ సీఈ మనోహర్‌రెడ్డి తెలిపారు.

బేగంపేట్‌లో సదుపాయాలివీ..

- స్టేషన్ భవనం రూపురేఖలు మారనున్నాయి. ప్రవేశద్వారం, పోర్టికో అభివృద్ధి చేయనున్నారు.
- 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు.
- ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధితో పాటు వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లను అధునాతనంగా తీర్చిదిద్దనున్నారు.
- స్టేషన్ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించనున్నారు.
- స్టేషన్‌లో 2 లిఫ్టులు, మరో 2 ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నారు.
- మంచినీటి సదుపాయం కోసం భూగర్భ రిజర్వాయర్ నిర్మించనున్నారు.



బేగంపేట రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న పనులు

కాలనీల్లో తిరగకుంటే ఇంటికే!

జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు సీఎం హెచ్చరిక

- మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన
- వచ్చే 50 ఏళ్ల తాగునీటి అవసరాల కోసం ప్రణాళికలు
- స్టోరేజీ ట్యాంకులుగా స్థానిక చెరువుల వినియోగం
- 15 రోజుల్లో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలో విజిలెన్స్ దాడులు
- కొత్త కార్పొరేషన్లకు కమిషనర్లుగా ఐఏఎస్‌లు

వాటర్ వర్క్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీహెచ్ఎంసీపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో మెట్రో కొత్త మార్గాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం హెచ్ఎండీఏ కార్యాలయంలో వాటర్ వర్క్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీహెచ్ఎంసీపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహానగరానికి వచ్చే 50 ఏళ్ల తాగు నీటి అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచి నీటి కొరత రాకుండా స్థానిక చెరువులను స్టోరేజీ ట్యాంకులుగా ఉపయోగించుకోవాలని సూచించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగు నీటి సరఫరా అయ్యేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఔటర్ రింగు రోడ్డు బయట ఉన్న చెరువులను క్లస్టర్లుగా విభజించాలని పేర్కొన్నారు. నగరంలోని విలువైన ప్రభుత్వ ఆస్తుల జాబితాను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఏవైనా ప్రారంభోత్సవాలు ఉంటే వారం రోజుల్లో నిర్వహించుకోవాలని సీఎం సూచించారు.

అన్నీ ఆన్‌లైన్‌లో ఉండాల్సిందే..

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో బిల్డింగ్ పర్మిషన్ ఫైల్స్ క్లియర్‌గా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చాలా బిల్డింగ్స్ అనుమతులకు సంబంధించిన ఫైల్స్ కనిపించడం లేదని.. ఆన్‌లైన్ లేకుండా ఇష్టారీతిగా పర్మిషన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలో విజిలెన్స్ దాడులు నిర్వహించడంతో పాటు ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో లేకుండా ఇచ్చిన అనుమతుల జాబితా తయారు చేయాల్సిందేన్నారు. వీటితో పాటు హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచి చెరువుల ఆన్‌లైన్ డేటా ఎందుకు డిలీట్ అవుతోందని ప్రశ్నించారు. 3,500 చెరువుల డేటా ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేన్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా వాటి వద్ద తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

సమస్యలు తెలుసుకోండి..

జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఉదయం కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, లేకుంటే ఇంటికి వెళ్లిపోవచ్చని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కూర్చొనే పోస్టులు కావాలంటే ఇస్తామని వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడిన 85 మున్సిపాలిటీల్లో కమిషనర్లు లేకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి.. గ్రూప్-1 అధికారులు కమిషనర్‌లుగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కొత్త కార్పొరేషన్లకు ఐఏఎస్‌లను కమిషనర్‌లుగా నియమించాలని సూచించారు. మున్సిపల్ వర్కర్లకు ప్రమాద బీమా కల్పించడంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీలో వయస్సు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆస్తి పన్ను మదింపు కోసం డ్రోన్ కెమెరాలను ఉపయోగించేందుకు అధ్యయనం చేయాలని, నగరంలో ప్రైవేట్ సెక్టార్‌లో మల్టీ లెవల్ పార్కింగ్, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాన్నారు. హైదరాబాద్‌లో న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహాలో వీడియో ప్రకటనల బోర్డు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీధి దీపాలు మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నతాధికారులు దాన కిషోర్, ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎండీఏ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

రూ.15లక్షల విలువైన ఓపియం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్‌ అధికారులు శుక్రవారం ధూల్‌పేట్‌ పరిధిలోని గోషామహల్‌ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 3,721 కిలోల ఓపియంను పట్టుకున్నారు. దీని విలువ రూ.15 లక్షలు ఉంటుందని ఎక్సైజ్‌ అధికారి శిరీష తెలిపారు. గోషామహల్‌, ఓల్గా హోటల్‌ వద్ద హోండా యాక్టీవాపై వెళుతున్న మంగీలాల్‌ విష్ణోయ్‌ అనే వ్యక్తిని ఎక్సైజ్‌ పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద 0.560 గ్రాముల ఓపీఎం లభించింది. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గోషామహల్‌లోని అతని ఇంట్లో సోదాలు నిర్వహించి 1.182కిలోల ఓపీఎం స్వాధీనం చేసుకున్నారు. అక్కడే పార్క్‌ చేసి ఉన్న ధీరజ్‌ అనే వ్యక్తికి చెందిన ఆటోలో మరో 1.529 కిలోలు లభించినట్లు అధికారులు తెలిపారు.మొత్తం 3,721 కిలోల ఓపీఎం విలువల రూ.15 లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితుడు మంగీలాల్‌ను అరెస్ట్‌ చేసిన పోలీసులు ఆటో, హోండా యాక్టీవాను సీజ్‌ చేశారు. ధీరజ్‌ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కన్నీటి వీడ్కోలు

ఔటర్‌ రింగ్‌ రోడ్డుపై పటాన్‌చెరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే లాస్యనందిత భౌతిక కాయానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికార, అనధికార ప్రముఖులు అశ్రు నివాళి అర్పించారు. - సాక్షి, సిటీబ్యూరో


లాస్య నందిత తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత


నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


అసెంబ్లీ స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌


విజయా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి


లాస్య నందిత అంతిమయాత్ర







లాస్య నందిత భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్‌, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌ రెడ్డి, ఎమ్మెల్యేలు తలసాని, పోచారం శ్రీనివాస రెడ్డి, కడియం శ్రీహరి, మల్లారెడ్డి, దానం నాగేందర్‌

ప్రముఖులను మింగిన ప్రమాదాలు

ఓఆర్‌ఆర్‌పైనే అత్యధిక ఘటనలు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని రోడ్లతో పాటు ఔటర్‌ రింగ్‌ రోడ్‌ (ఓఆర్‌ఆర్‌) సైతం అనేక మంది ప్రముఖులను బలిగొన్నాయి. అక్కడ జరిగిన ఘోర ప్రమాదాల్లో వీఐపీలతో పాటు వారి కుటుంబీకులూ మృత్యువాతపడ్డారు. బాబూమోహన్‌ కుమారుడు పవన్‌ కుమార్‌ నుంచి ఎమ్మెల్యే లాస్య నందిత వరకు ఇలా అర్థాంతరంగా ఊపిరి ఆగిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఈ రోడ్డు ప్రమాదాల విషయంలో కొందరు ప్రయాణిస్తున్న వాహనాలు మితిమీరిన వేగంతో ఉండటం, మరికొందరు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించకపోవడం వారి పాలిట శాపాలయ్యాయి.

- **2000 ఏప్రిల్‌ 22:** మహబూబ్‌నగర్‌ జిల్లా షాద్‌నగర్‌ నుంచి తిరిగి వస్తూ శంషాబాద్‌ సమీపంలోని పాల్మాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాటి మంత్రి పి.ఇంద్రారెడ్డి అసువులు బాశారు.
- **2003 అక్టోబర్‌ 12:** అప్పటి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి బాబూమోహన్‌ పెద్ద కుమారుడు పి.పవన్‌ కుమార్‌ రసూల్‌పుర నుంచి జూబ్లీహిల్స్‌కు బైక్‌పై వస్తుండగా... జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్ట్‌ వద్ద రోడ్‌ డివైడర్‌ను ఢీ కొట్టడంతో మృత్యువాతపడ్డాడు.
- **2010 జూన్‌ 20:** ప్రముఖ సినీనటుడు, బీజేపీ నేత కోట శ్రీనివాసరావు కుమారుడు ప్రసాద్‌ హైదరాబాద్‌ శివార్లలోని ఓఆర్‌ఆర్‌పై జరిగిన ప్రమాదంలో కన్నుమూశారు. ఈయన ప్రయాణిస్తున్న హైస్పీడ్‌ ద్విచక్ర వాహనం మరో వాహనాన్ని ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.
- **2011 సెప్టెంబర్‌ 11:** హైదరాబాద్‌ శివార్లలోని ఔటర్‌ రింగ్‌రోడ్‌పైన పుప్పాలగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ క్రికెటర్‌ అజారుద్దీన్‌ కుమారుడు అయాజుద్దీన్‌ కన్నుమూశాడు.
- **2011 డిసెంబర్‌ 20:** మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుమారుడు ప్రతీక్‌రెడ్డి సహా నలుగురు ప్రయాణిస్తున్న కారు హైదరాబాద్‌ శివార్లలోని మెదక్‌ జిల్లా కొల్లూర్‌ వద్ద ఔటర్‌ రింగ్‌ రోడ్‌పై ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ప్రతీక్‌తో పాటు సుజిత్‌కుమార్‌, చంద్రారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు.
- **2012 ఆగస్టు 21:** మాజీ మంత్రి పులి వీరన్న కుమారుడు ప్రవీణ్‌ తేజ ఓఆర్‌ఆర్‌పై దుర్మరణం చెందాడు. ఈయన ప్రయాణిస్తున్న కారు టర్నింగ్‌ తీసుకుంటూ అదుపుతప్పి బోల్తా పడింది.
- **2015 నవంబర్‌ 25:** మాజీ డీజీపీ, ప్రభుత్వ సలహాదారు పేర్వారం రాములు మనుమడు వరుణ్‌ పవార్‌, బంధువు రాహుల్‌ పవార్‌ సహా ముగ్గురు మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న కారు ఓఆర్‌ఆర్‌పై ముందు వెళ్తున్న పాల వ్యాన్‌ను బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.
- **2016 మే 17:** మాజీ మంత్రి, ఏపీ ఆప్కాబ్‌ చైర్మన్‌ పిన్నమనేని వెంకటేశ్వరరావు ప్రయాణిస్తున్న కారు ఓఆర్‌ఆర్‌ రెయిలింగ్‌ను (క్రాష్‌ బ్యారియర్‌) బోల్తా కొట్టిన ఘటనలో ఆయన భార్య సాహిత్యవాణి, డ్రైవర్‌ స్వామిదాసు అక్కడిక్కడే కన్నుమూశారు.
- **2017 మే 10:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.36లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నారాయణ విద్యాసంస్థల అధినేత, అప్పటి ఆంధ్రప్రదేశ్‌ మున్సిపల్‌ శాఖ మంత్రి పి.నారాయణ కుమారుడు పి.నిశిత్‌ నారాయణ, అతడి స్నేహితుడు కామని రాజా రవిచంద్ర దుర్మరణం పాలయ్యారు.

'ఏకాంతం' పైనా షీ-టీమ్స్‌ కన్ను

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పార్కులతో పాటు బహిరంగ ప్రదేశాల్లో విచక్షణ మరిచి 'ఏకాంతంగా' గడుపుతున్న జంటలు అనేకం ఉంటున్నాయి. వీళ్ల ప్రవర్తనతో ఆ వైపు వెళ్లడానికి అనేక మంది ఇబ్బంది పడుతుంటారు. దీనిపై వరుసగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సిటీ షీ-టీమ్స్‌ ప్రత్యేక డ్రైవ్స్‌ ప్రారంభించాయి. ఆయా ప్రదేశాల్లో సంచరించిన బృందాలు అసభ్యంగా, అశ్లీలంగా, అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్న వారికి సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలు సేకరించారు. మొత్తం 14 మందికి కౌన్సెలింగ్‌ ఇచ్చిన తర్వాత న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరి చర్యల ఆధారంగా కోర్టులు రూ.50 నుంచి రూ.1250 వరకు జరిమానా విధించాయి. ఈ తరహా ఆపరేషన్లు నగరంలో కొనసాగిస్తామని మహిళా భద్రత విభాగం డీసీపీ డి.కవిత పేర్కొన్నారు.

నగరంలో భారీగా నకిలీ కాస్మోటిక్స్‌

- డిటర్జెంట్స్‌ను వదిలి పెట్టని కల్తీరాయుళ్లు
- పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు మార్కెట్లలో భారీగా నకిలీ కాస్మోటిక్స్‌ చెలామణి అవుతున్నాయి. ఇదే స్థాయిలో డిటర్జెంట్స్‌ సైతం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించిన పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. వీటిని తయారు, సరఫరా చేస్తున్న నిందితుల కోసం గాలించిన టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఓ ఘరానా ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరు ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉత్పాదనల్నీ కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి భారీ స్థాయిలో కాస్మోటిక్స్‌, డిటర్జెంట్స్‌తో పాటు కాఫీ, టీ పొడులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బ్రూక్‌ బాండ్‌, రెడ్‌ లేబుల్‌, లైజాల్‌, హార్పిక్‌, సర్ఫ్‌ ఎక్సెల్‌ కంపెనీల పేర్లతో ఉన్నవి ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి శనివారం పోలీసులు వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

చార్టెడ్‌ అకౌంటెంట్‌లే టార్గెట్‌

- రూ.2.48 కోట్లు టోకరా
- నిందితుడి అరెస్ట్‌


నిందితుడు శ్రీనాథ్‌

హిమాయత్‌నగర్‌: చార్టెడ్‌ అకౌంట్లను టార్గెట్‌ చేస్తూ భారీ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని నగర సీసీఎస్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ, నింబోలిఅడ్డాకు చెందిన శ్రీనాథ్‌ రాతి సీఏ కోచింగ్‌ తీసుకునే వారికి ఆన్‌లైన్‌ క్లాసులు బోధించేవాడు. ఈ విధంగా అతడికి పలువురు సీఏలతో పరిచయాలు ఏర్పడ్డాయి. అదే చనువుతో తనకు అత్యవసరంగా ఆన్‌లైన్‌లో డబ్బులు కావాలంటూ, మళ్లీ తిరిగి నగదు రూపంలో ఇస్తానని నమ్మించి 10మంది నుంచి రూ.2.48 కోట్లు తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఈ తర్వాత వారి ఫోన్లకు స్పందించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు శ్రీనాథ్‌ రాతిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుంటూరు వెంచర్లలో హైదరాబాద్‌ బాధితులు

- వెలుగులోకి వస్తున్న మరిన్ని 'సాహితీ' మోసాలు
- ప్రీ లాంచ్‌ పేరుతో ఇప్పటికే 3000 మందికి టోకరా
- గుంటూరులోని సాహితీ భూములను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హిమాయత్‌నగర్‌: ప్రీ లాంచ్‌ ఆఫర్ల పేరుతో వేలాది మంది కస్టమర్ల నుంచి రూ. వందల కోట్లు కాజేసిన సాహితి ఇన్ఫ్రాటెక్‌ మోసాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి. గుంటూరు జిల్లాలో వెంచర్లు వేస్తున్నట్లు నమ్మించి నగరంలోని పలువురు కస్టమర్లను టోకరా వేసిన సాహితి ఎండీ బూదాటి లక్ష్మీనారాయణ ఇప్పటికే హైదరాబాద్‌లో దాదాపు 3000 మంది కస్టమర్లను మోసం చేసిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కాజా గ్రామంలో 56 మంది రైతులకు సంబంధించిన 24 ఎకరాల్లో అపార్ట్‌మెంట్లు, ఐటీ పార్కులు, విల్లాలు కడతానని రైతులతో డెవలప్మెంట్‌ అగ్రిమెంట్లు చేసుకున్నాడు. ఆ తర్వాత ప్రీ లాంచ్‌ ఆఫర్‌ పేరుతో పలువురిని నుంచి రూ. కోట్లు వసూలు చేసి ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా వదిలేశాడు. అతడి మోసాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీసీఎస్‌ పోలీసులు సదరు భూమిని అటాచ్‌మెంట్‌ చేయించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను అక్కడి రైతులు, బాధితులకు తెలియజేసేందుకు సీసీఎస్‌ డీసీపీ శ్వేతా రెడ్డి అధికారుల బృందాన్ని అక్కడికి పంపి భూముల వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేయించారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే హైదరాబాద్‌ సీసీఎస్‌ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

తాగు నీటి సరఫరా కోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు

- నీటి కొరత, లో ప్రెజర్‌ ఫిర్యాదులకు ప్రాధాన్యం
- డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్‌ స్టేషన్లు
- వేసవి కార్యాచరణపై జలమండలి ఎండీ సుదర్శన్‌ రెడ్డి సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్ర స్థాయిలో సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించుకోవాలని జలమండలి ఎండీ సుదర్శన్‌ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌ లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే 5 నెలలకు తాగునీరు సరఫరా చేసేందుకు అవసరాన్ని బట్టి అదనపు జలాలను తరలించడానికి ఎమర్జెన్సీ పంపింగ్‌ కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా సరఫరా తక్కువగా ఉంటే సర్దుబాటు చేసేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

24 గంటల్లో నీటి సమస్యల పరిష్కారం..

క్షేత్ర స్థాయిలో లైన్‌మెన్లు గైర్హాజరైన పక్షంలో.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎండీ సూచించారు. కలుషిత నీటి సరఫరా, లీకేజీలు జరిగితే సమస్యను గుర్తించి.. 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. మోటార్లు, బూస్టర్లు, వాల్వులు రిపేరీ వస్తే.. ఏఎంస్‌ కింద మరమ్మతులు చేయాలన్నారు. అవసరానికి సరిపడా సామగ్రిని సెంట్రల్‌ స్టోర్‌ లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

సీజీఎంల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు

తాగునీటి సరఫరా, నీటి కొరత, లో ప్రెజర్‌ సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎండీ సూచించారు. వాటి పర్యవేక్షణ, పరిష్కారానికి సీజీఎంల ఆధ్వర్యంలో ప్రత్యేక బందాల్ని ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా.. పవర్‌ కట్స్‌ ఉంటే.. ఇతర సమయాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. చేతి పంపులు, బోర్‌ వెల్స్‌ నిర్వహణ దష్టి సారించాలని.. అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండేందుకు అదనపు సామగ్రి ఉంచుకోవాలని పేర్కొన్నారు.

డిమాండ్‌ ను బట్టి అదనపు ఫిల్లింగ్‌ స్టేషన్లు..

వేసవిని దృష్టిలో ఉంచుకుని డిమాండ్‌ను అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలని ఎండి సూచించారు. నగరంలో ఇప్పటికే 72 ట్యాంకర్‌ ఫిల్లింగ్‌ స్టేషన్లు ఉండగా.. డిమాండ్‌ను బట్టి అదనపు ఫిల్లింగ్‌ స్టేషన్‌ కోసం ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ప్రతి జీఎం.. సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్‌ మిషన్‌ అధికారుల సమన్వయంతో ఇన్‌ ఫ్లో ను పర్యవేక్షించాలని తెలిపారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో లో-ప్రెజర్‌ సమస్యలు వస్తున్నాయని.. వీటిని నివారించడానికి ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ కు ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఈఎన్సీ, డైరెక్టర్‌ ఆపరేషన్స్‌-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్‌ వీఎల్‌ ప్రవీణ్‌ కుమార్‌, డైరెక్టర్‌ ఆపరేషన్స్‌-2 స్వామి, చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ గ్యానేందర్‌ రెడ్డి, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం

వెంగళరావునగర్: మధురానగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తోటకూర నరసింహారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర మహా మంత్రపీఠం ఆధ్వర్యంలో ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం 'ప్రజావాణి'లో ఫిర్యాదు

రహమత్‌నగర్: కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపుపై హైకోర్టులో పిటిషన్ ఉండగా 46 మందికి ఇళ్లు ఎలా కేటాయిస్తారని కమలానగర్ బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ శుక్రవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్తీకి చెందిన 56 మంది డబుల్ బెడ్ రూం కేటాయింపుపై 2017లో హైకోర్టులో పిటిషన్ వేశామని వివరించారు. ఇటీవల డబుల్ బెడ్ రూం ఇళ్లను సందర్శించిన సికింద్రాబాద్ ఆర్‌డీఓ 46 మంది లబ్ధిదారులలకు త్వరలోనే ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో, వారితో కోర్టులో పిటిషన్ వేసిన 56 మందికి సైతం ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. డబుల్ రూం ఇళ్లు కేటాయించేవరకు న్యాయ పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు.

బంజారాహిల్స్ ఏసీపీకి శుభాకాంక్షలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ ఏసీపీగా సామల వెంకట్‌రెడ్డి బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.గంగాధర్, ఎస్‌ఐలు జీ శేఖర్, సతీష్, రాజు తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్ ఏసీపీ పరిధి కిందకు మాసాబ్‌ట్యాంక్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లు వస్తాయి. అనంతరం ఏసీపీ మాసాబ్‌ట్యాంక్ పోలీసులతో సమావేశమై లా అండ్ ఆర్డర్, నేరాలు, పోలీసుల విధులు తదితర అంశాలపై చర్చించారు.

దుర్భాషలాడొద్దన్నందుకు బెదిరింపు

వెంగళరావునగర్: మద్యం సేవించి దుర్భాషలాడుతున్న వ్యక్తిని వారించినందుకు నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఆర్.ప్రసన్నకుమార్ డిఫెన్స్ అకౌంట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తూంటాడు. ఈ నెల 18న తన ఇంటికి సమీపంలో నవీన్ అనే వ్యక్తి మద్యం సేవించి దుర్భాషలాడుతున్నాడు. కొంతసేపు ఓపిక పట్టిన ప్రసన్నకుమార్ అతని వద్దకు వెళ్లి దుర్భాషలాడవద్దని చెప్పాడు. దాంతో నవీన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనను కూడా తిడుతూ నీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. దాంతో ప్రసన్న 100కు డయల్ చేయగా నవీన్ ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. ఈ మేరకు ప్రసన్న మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న సర్కిల్–18 డీసీ ప్రశాంతి

వెంకటేశ్వరకాలనీ: ఆస్తి పన్ను వసూలు మరింత వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతి సూచించారు.
సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని 15 మంది బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం ఆమె ఖైరతాబాద్‌లోని తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లక్ష్యానికి అనుగుణంగా ఆస్తి పన్ను వసూలు చేపట్టాలన్నారు. 15 డాకెట్స్‌గా విభజించి పన్ను వసూళ్లు చేపడుతున్నామని, రూ. 213 కోట్ల లక్ష్యాన్ని విధించడం జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు రూ.150 కోట్లు వసూలు అయ్యిందని, వచ్చే నెల 31వ తేదీ లోపు పూర్తి వసూళ్లు చేపట్టాలన్నారు. గత ఏడాది పన్ను చెల్లించని వారిపై దృష్టిపెట్టి ఈసారి కచ్చితంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అసాంఘిక శక్తుల ఆగడాలను సహించం



మాట్లాడుతున్న బాబాఫసీయుద్దీన్

రహమత్‌నగర్: రౌడీయిజం, గంజాయి విక్రయం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ హెచ్చరించారు. బోరబండ షాహీద్ తుర్రేబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో మహిళలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలతో చెలగాటం మాడే మాదక ద్రవ్యాల విక్రయాలు డివిజన్ లేకుండా చేస్తానని చెప్పారు. మహిళల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మహిళలతో కలిసి ర్యాలీగా బోరబండ బస్ స్టాప్ వరకు చేరుకుని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకురాళ్లు వేముల కృష్ణవేణి, కవిత, దేవి, పద్మరాధారెడ్డి, నర్సింహ, ఇమ్రాన్, అశోక్, కాసుల మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం



శ్రీనగర్‌కాలనీ: సౌత్రన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ బ్రాంచ్ 2024–25వ సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎంపికైంది. చైర్మన్‌గా సీఏ పానుగోటి రవిశంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా ఎ. చిన్నసీతారామిరెడ్డి, సెక్రటరీగా గిరిధర్‌లాల్ తోష్నీవాల్, ట్రెజరర్, కోచైర్మన్‌గా ఉప్పటపాటి శరన్‌కుమర్, చార్టెడ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్‌గా దీపక్ లడ్డా నియమితులయ్యారు. నూతన కార్యవర్గ సమావేశానికి సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్ దయానివాస్ శర్మ, శ్రీధర్ ముప్పాల, చంగల్‌రెడ్డి, సునీల్‌మాధవ, నరేష్‌లు హాజరై నూతన కమిటీకి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

'మోత'కు బ్రేకులు!

- సైలెన్సర్‌ను మారిస్తే భారీ జరిమానాలు
- వాహనాలు సీజ్..ఆర్టీఏకు అప్పగింత
- కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



శైథిక శబ్దంతో తిరుగుతున్న బైక్‌ను సీజ్ చేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హరి

బంజారాహిల్స్: షోరూం నుంచి విడుదలైన వాహనాలకు సంబంధించి ఏ ఒక్క పార్ట్‌ను కూడా తొలగించకూడదు. ఇలా తొలగిస్తే మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారు. ఆ వాహనాల రంగు కూడా మార్చడం నిబంధనలకు విరుద్ధం. అయితే కొంతమంది యువకులు రోడ్లపై తమను అందరూ చూడాలనే ఉద్దేశ్యంతో వాహనాల సైలెన్సర్లను మారుస్తూ అధిక శబ్దంతో వచ్చే సైలెన్సర్లను ఏర్పాటుచేసుకుని రయ్ రయ్ అంటూ దూసుకెళ్తున్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం.. ఇలా బైకులు, కార్ల సైలెన్సర్లను మార్చడం నిషేధం. ఇలా ఎవరైనా మారిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం అందుబాటులో ఉంది. అయినా సరే కొంతమంది షోరూం నుంచి వాహనం బయటకు రాగానే దాంతో పాటు వచ్చిన సైలెన్సర్‌ను తొలగించి కొత్త సైలెన్సర్లను బిగించుకుని రోడ్లపై మోత మోగిస్తూ దూసుకుపోతూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్, మాసబ్‌ట్యాంక్ ప్రాంతాల్లో ఇలా ప్రతిరోజూ కార్లు, స్కూటర్లు అధిక శబ్దంతో చెవులు దద్దరిల్లే రీతిలో దూసుకెళ్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాయి. వీటికి క్లాం వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సౌండ్ పొల్యూషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో గడచిన 23 రోజులాగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు 64 కేసులు సైలెన్సర్లు మార్చి తిరుగుతున్న వాహనదారులపై నమోదు చేశారు. ఇందులో కార్లు కూడా ఉన్నాయి. ఇందులో 14 వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏకు అప్పగించారు.

- జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటివరకు సైలెన్సర్లు మార్చి సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడుతున్న 37 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.
- పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వేర్వేరు చోట్ల నిర్వహించిన వాహన తనిఖీల్లో శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 44 వాహనదారులపై కేసులు నమోదు చేశారు.
- ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో సైలెన్సర్లు మార్చి తిరుగుతున్న 18 మందిపై కేసులు నమోదు చేశారు.
- ఎంవీ యాక్ట్‌ను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలతో పాటు వచ్చిన సైలెన్సర్లను మార్చి మోత మోగించే సైలెన్సర్లను ఏర్పాటుచేసుకుని తిరుగుతున్న వాహనదారులు పట్టుబడితే వారికి అక్కడికక్కడే రూ. 1000 జరిమానా విధిస్తున్నారు.
- ఆ వాహనాన్ని సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పంపిస్తున్నారు.
- పట్టుబడ్డ వాహనదారుడు వాహనంతో పాటు వచ్చిన ఒరిజినల్ సైలెన్సర్‌ను తీసుకుని ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు వెళ్లి నిబంధనలు ఉల్లంఘించి బిగించుకున్న మాడిఫైడ్ సైలెన్సర్‌ను తొలగించి ఒరిజినల్ సైలెన్సర్‌ను బిగించుకుంటే ఆ వాహనాన్ని అప్పగిస్తున్నారు.
- మరిన్ని నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను నేరుగా ఆర్టీఏకు పంపిస్తున్నారు. ఆ వాహనాలకు ఉన్న సైలెన్సర్లను తొలగిస్తూ వీరిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. రూ. 10,000 జరిమానా ఆర్టీఏ విధిస్తుంది.
- రాత్రిపూట బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, నెక్లెస్ రోడ్డు, మాసబ్‌ట్యాంక్ ప్రాంతాల్లో సౌండ్ పొల్యూషన్ పెరిగిపోయి గుండెలు ఆగిపోయేంత శబ్దంతో స్కూటర్లు, కార్లు తిరుగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీసులు మూడు వారాల నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇస్తుందనే చెప్పాలి.
- మాడిఫైడ్ చేసిన సైలెన్సర్లను తొలగించిన తరువాత వాటిని బుల్డోజర్లు కింద తొక్కి ధ్వంసం చేస్తున్నారు. అంతేకాకుండా ఆ వాహనదారుడి తల్లిదండ్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేస్తున్నారు.
- ఇలా సైలెన్సర్లు మార్చి మైనర్లు పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా ఆ వాహన యజమానిపై సైతం కేసు నమోదు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్



బంజారాహిల్స్ రోడ్ నెం. 11లో రోడ్లపై పార్కింగ్ చేసిన కార్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 11లో వెడల్పు చేసిన రోడ్డులో కొంత మంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికంగా నివాసం ఉండేవారు మాత్రమే కాకుండా స్థానికేతరులు సైతం ఇక్కడ పార్కింగ్‌లు చేస్తుండటంతో ఈ రోడ్డులో నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆసియా జువెల్స్ ఎక్స్‌పో ప్రారంభం



ఆసియా జువెల్స్ షోను ప్రారంభిస్తున్న నటి అషురెడ్డి తదితరులు

బంజారాహిల్స్: సౌత్ ఇండియాలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఆసియా జ్యువెలరీ ఎగ్జిబిషన్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను నటి అషురెడ్డితో పాటు పలువురు నటీమణులు, మోడల్స్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డిజైనర్లు ఇక్కడ విభిన్న రకాల డిజైనరీ జ్యువెలరీని ప్రదర్శించారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు హరీష్ సచ్‌దేవ్ తెలిపారు. కార్యక్రమంలో స్రవంతి చొక్కారపు, ప్రీతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికురాలి మంగళసూత్రం చోరీ

బంజారాహిల్స్: బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు మంగళసూత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బడంగ్‌పేట కమాన్ సమీపంలో చింతలకుంట లెనిన్‌నగర్‌కు చెందిన ముత్యాల లలిత(41) బంజారాహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ గాయత్రీహిల్స్‌లో పని మనిషిగా పని చేస్తుంది. ఈ నెల 22న కోఠి వద్ద పటాన్‌చెరు వెళ్లే 222ఏ బస్సును ఎక్కింది. కిటికీ పక్కన ఖాళీ ఉండటంతో కూర్చొంది. బస్సు ఎక్కిన కొద్దిసేపటికే నిద్రపోయింది. బస్సు కేబీఆర్ పార్కు వద్దకు రాగానే నిద్ర నుంచి మేల్కొని జూబ్లీహిల్స్ చౌరస్తా వద్ద దిగేందుకు సిద్ధమైంది. అయితే దిగే ముందు తన మెడలోని బంగారు మంగళసూత్రం కనిపించలేదు. దీంతో విషయాన్ని కండక్టర్‌కు తెలియజేయగా బస్సును ఆపి ప్రయాణికులందరినీ విచారించినా ఫలితం లేదు. దీంతో ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి గురైన మంగళసూత్రం మూడున్నర తులాలు ఉంటుందని, రూ. లక్షన్నర వరకు విలువ ఉంటుందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ కృష్ణానగర్ బీ–బ్లాక్ వద్ద ఓ దుకాణంలో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నారని పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సదరు దుకాణంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అచింతల సాయిబాబా అనే వ్యక్తి నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రాకేష్ అనే వ్యక్తి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి వద్ద నుంచి రూ.56,700ల విలువైన నిషేధిత ఏ10 సిగరెట్లు,, ఈఎస్‌ఎస్‌ఈ లైట్స్ సిగరెట్లు, ఈఎస్‌ఎస్‌ఈ స్పెషల్ గోల్డ్, డీజేఏఆర్‌యూఎం నలుపు, బెన్సన్ అండ్ హెడ్జెస్, మోండ్ సూపర్ స్లిమ్స్ (స్ట్రాబెర్రీ), మోండ్ సూపర్ స్లిమ్స్ (గ్రీన్ యాపిల్) సిగరెట్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. సాయిబాబాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పుస్తకాల సేకరణ విజ్ఞానానికి నిదర్శనం



లైబ్రరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్మలకాంతి వెస్లీ, ఆకర్షణ

వెంగళరావునగర్: చిన్న వయసు నుంచే పుస్తకాలను సేకరించి లైబ్రరీగా మార్చి వాటిని పంపిణీ చేయడం చాలా గొప్ప విషయమని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ (ఐఏఎస్), మహిళాభివృద్ధి షెడ్యూల్ కాస్ట్ సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ (ఐఏఎస్)లు తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని స్టేట్‌హోం ప్రాంగణంలో ఉన్న సర్వీస్ హోంలో శుక్రవారం చిన్నారి ఆకర్షణ సేకరించిన పుస్తకాలతో లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఈ లైబ్రరీ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయా అధికారులు మాట్లాడుతూ... పుస్తకాల సేకరణ అనేది విజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఆకర్షణ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములు తనను స్వయంగా అభినందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆకర్షణ తల్లిదండ్రులు సతీష్, ప్రవిత, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి తీరని లోటు

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం రాష్ట్రానికి తీరని లోటని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తెలిపింది. రాజకీయాలలో ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువ ఎమ్మెల్యే అర్ధాంతరంగా మరణించడం విషాదకరమని, లాస్య నందిత తండ్రి సాయన్న మరణించిన ఏడాదికే ఆమె మరణించడంతో వారి కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగల్చడం అత్యంత బాధాకరమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్రలు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని, సానభూతిని వ్యక్తం చేస్తున్నామన్నారు.

4 నుంచి డెయిరీ ఇండస్ట్రీ సదస్సు

పంజగుట్ట: ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ౫50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌ె నిర్వహించనున్నట్లు ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్మన్ సతీష్ కులకర్ణి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాన్ఫరెన్స్ కరపత్రాన్ని అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ సి.హెచ్.రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్.రావు, సభ్యులు బి.వి.కె.రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడిపరిశ్రమ అభివృద్ధికి ఈ కాన్ఫరెన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ 75 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం, 1989లో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సదస్సు తర్వాత తిరిగి 34 సంవత్సరాలకు హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. ఇందులో పాడి రంగంలో ఉన్న రైతులు, విద్యార్థులు, యువత, ఇప్పటికే ఈ రంగంలో రాణించిన ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు సృష్టించిన నకిలీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి ఓ వృద్ధుడిని సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బాధిత వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు స్టాక్ మార్కెట్ టిప్స్ పేరుతో వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా వాట్సాప్ బిజినెస్ గ్రూప్‌లో 'ఏ11 ష్రోడర్స్ సర్వీస్ క్లస్టర్' అనే లింక్ వచ్చింది. స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు సంబంధించి లాభాలు వస్తాయని సందేశాలను అందులో వచ్చాయి. దీంతో వారు చెప్పిన విధంగా 'ఎస్‌సీఐఈ' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. యాప్‌లో నమోదు చేసుకున్న తర్వాత బాధితుడు తన ఖాతా నుంచి రూ. 16,99,000 వారు యాప్ ద్వారా బదిలీ చేశాడు. ఆ యాప్‌లో బాధితుడి డ్యాష్‌బోర్డులో పెట్టుబడి, లాభాలు ఉన్నట్లు చూపించారు. కానీ ఆ డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టాలని చెప్పారు. అనుమానం వచ్చిన బాధితుడు మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సమీక్ష



జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని అన్ని బస్తీల అభివృద్ధిపై ఇప్పటికే నివేదికలు రూపొందించామన్నారు. వాటికి నిధులు మంజూరు చేయాలని డీఎంసీని కోరారు. జీహెచ్‌ఎంసీ అన్ని శాఖల అధికారులతో త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. డీఎంసీ సేవా ఇస్లావత్, ఏఎంహెచ్‌ఓ రవి, ఎస్‌ఎస్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



డీసీ ప్రశాంతితో చర్చిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు అభివృద్ధి పనులపై శుక్రవారం డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్‌లతో చర్చించారు. దీన్‌దయాళ్‌నగర్ నుంచి ఏబీఎస్ వరకు వేయాల్సిన నూతన సీసీ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలన్నారు. ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను సైతం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన అధికారులు త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పారని కార్పొరేటర్ తెలిపారు.

బోరబండ పీఎస్ పరిధిలో మరో 'డబుల్' మోసం

రహమత్‌నగర్: కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల వివాదం మరిచి పోకముందే, ఇదే తరహా మోసానికి పాల్పడ్డ ఓ వ్యక్తిపై బోరబండ పోలీస్ స్టేషన్ మరో కేసు నమోదైంది. వివరాలివీ... రహమత్‌నగర్ వీడియో గల్లీకి చెందిన రవీందర్‌రెడ్డికి ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన నర్సింహరాజు అనే వ్యక్తి సతీష్ ద్వారా పరిచయమయ్యాడు. తాను బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడినని డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇప్పిస్తానంటూ రవీందర్‌రెడ్డి నమ్మించాడు. ఈ క్రమంలో రవీందర్‌రెడ్డితో పలు విడతలు రూ. 7 లక్షలు తన భార్య ఇందిర ఖాతలో జమ చేయించాడు. ఆ తరువాత రవీందర్ రెడ్డి ఫోన్‌కాల్స్‌కు నర్సిహరాజు స్పందించక పోవడంతో అనుమానం వచ్చి అతను విచారించగా నర్సింహరాజు పరారీలో ఉన్నాడని తెలిసింది. దీంతో బాధితుడు రవీందర్‌రెడ్డి గురువారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్ల వెనుక బీజేపీ కుట్ర: ఆప్



మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

లిబర్టీ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రతిపక్ష పార్టీలపై కుట్రలు పన్నుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. రాజకీయ కుట్రలో భాగంగా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని ఈడీ, సీబీఐలతో అక్రమ నోటీసులు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిబర్టీ వద్ద ఉన్న ఆప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈడీ అక్రమ నోటీసులు పని చేయడం లేదని, అందుకే సీబీఐ ద్వారా అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందుకే చట్టంలో అస్పష్టమైన, ప్రేరేపించబడిన, నిలకడలేని కేసులు పెట్టి జైలులో పెట్టడానికి ఈడీ, సీబీఐలు చట్టవిరుద్ధంగా ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ సోలోమాన్ రాజు, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నర్సింగ్, యమునాగౌడ్, హేమ, డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా'తో ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు

హిమాయత్‌నగర్: 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' నినాదంతో ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా 'దేశ పాలకుల విధానాలు–నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న వరంగల్, ఎల్‌బీ కళాశాల జయసేన ఆడిటోరియంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శివసేనారెడ్డిని శుక్రవారం కలిసి ఏఐవైఎఫ్ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం కారణంగా నిరుద్యోగ రేటు 26 శాతం పెరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేశాయన్నారు. మోదీ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న ఎన్నికల్లో దుష్ట బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న కళాకృతులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ) హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ తరాషా క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ సందర్శకులను కనువిందు చేస్తోంది. ప్రదర్శనలో కొలువుదీరిన హస్త కళాకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హస్త కళాకారులు తమ నైపుణ్యానికి పదునుపెట్టి రూపొందించిన వస్తువులు ముగ్ధమనోహరంగా ఉన్నాయి. శనివారంతో ఈ ఎగ్జిబిషన్ ముగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



మార్గదర్శి ఫైనాన్షియర్స్ అయినా.. మార్గదర్శి చిట్ ఫండ్స్ అయినా అంతిమంగా చేసేది నల్లధనం దందానే అని తేటతెల్లమైంది. అందుకోసం రశీదు డిపాజిట్లు, భవిష్యత్ చందాలు, ఘోస్ట్ చందాదారులు.. ఇలా అనేక పేర్లతో రామోజీరావు సాగిస్తున్న అక్రమ ఆర్థిక సామ్రాజ్యమే మార్గదర్శి చిట్ ఫండ్స్ అని స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో ఆధారాలతోసహా బట్టబయలైంది. అందుకే తమ దర్యాప్తులో భాగంగా ఆ అంశాలపై సమాధానం చెప్పమంటే రామోజీరావు, ఆయన కోడలు శైలజా కిరణ్ ముఖం చాటేశారు. రామోజీరావు ఏకంగా గుడ్లు తేలేసినట్టు మంచం ఎక్కి మెలో డ్రామా నడిపితే.. శైలజా కిరణ్ తనకు ఆరోగ్యం బాగోలేదు.. కళ్లు సరిగా కనిపించడం లేదంటూ టీవీ సీరియళ్లను తలపించే రీతిలో నటనా చాతుర్యం ప్రదర్శించారు. కానీ సోదాల్లో బయటపడిన ఆధారాలు అబద్ధం చెప్పవు కదా! అందుకే ఆ ఆధారాలతోనే మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయడం రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం పునాదులతో సహా కదులుతోంది.

– సాక్షి, అమరావతి

గురివింద
రామోజీ-3

బ్లాక్ కోబ్రా



నల్లధనం కుబేరులకు అండగా నిలిచిన రామోజీ

- బ్లాక్ మనీ అడ్డాగా మార్గదర్శి ఫైనాన్షియర్స్, చిట్ ఫండ్స్
- అక్రమ డిపాజిట్లు, చిట్టీల ముసుగులో మనీ లాండరింగ్
- ఘోస్ట్ చందాదారుల పేరుతో నల్లధనం తరలింపు
- ఉత్తుత్తి చెక్కులతో తిమ్మినిబమ్మి చేస్తున్న 'ఛీట్'ఫండ్స్

బ్లాక్ మనీ డెన్

మార్గదర్శి చిట్ ఫండ్స్ రశీదు డిపాజిట్ల పేరుతో సేకరిస్తున్న అక్రమ డిపాజిట్ల వెనుక నల్లధనం గూడుపుఠాణి దాగుంది. రాష్ట్రంలోని 37 మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సేకరించిన రశీదు డిపాజిట్ల వివరాలను సీఐడీ పరిశీలించడంతో ఈ బాగోతం బయట పడింది. ఆర్థిక లావాదేవీల నిర్వహణలో సంబంధిత వ్యక్తుల పాన్, ఆధార్ నంబర్లు నమోదు చేయాలని బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ సంస్థలు కచ్చితంగా పాటించాల్సిన నిబంధన. కానీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సేకరించిన అక్రమ డిపాజిట్లకు ఇస్తున్న రశీదుల్లో ఎక్కడా కూడా డిపాజిట్‌దారుల పాన్ నంబరు, ఆధార్ నంబర్లను నమోదు చేయడం లేదు. అంటే ఆ డిపాజిట్ల వివరాలేవీ ఆదాయ పన్ను శాఖ పరిశీలించే అవకాశం లేదు. ఎంత భారీ మొత్తాన్ని డిపాజిట్ చేసినా గుట్టు బయటపడదు. ఆ పేరుతో నల్ల కుబేరుల నుంచి భారీగా నల్లధనాన్ని అక్రమ డిపాజిట్లుగా సేకరిస్తోంది. అక్రమ మార్గాల్లో సంపాదించిన నల్లధనాన్ని దాచుకునేందుకు వారికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ మార్గంగా కనిపిస్తోంది. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేవలం 5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నా సరే డిపాజిట్లు చేస్తుండటం గమనార్హం. ఎందుకంటే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందన్నది చెప్పాల్సి ఉంది. పాన్ నంబర్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. అవి ఆర్‌బీఐ, ఆదాయ పన్ను, సీబీడీటీ మొదలైన అధికారుల దృష్టిలో ఉంటాయి. ఆ వివరాలేవీ వెల్లడించడానికి సుముఖంగా లేని వారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్లధనమే కాబట్టి. ఈ విధంగా వేల సంఖ్యలో అక్రమ డిపాజిట్ల రూపంలో భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చినట్టు సీఐడీ గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేసింది. మొదటి దశలో రూ.కోటికిపైగా డిపాజిట్ చేసిన దాదాపు వెయ్యి మందిని గుర్తించింది. అంటే మొదటి దశలో రూ.వెయ్యి కోట్ల అక్రమ డిపాజిట్లపై దృష్టి సారించింది. ఆ విధంగా డిపాజిట్ చేసిన రూ.కోటి నిధులు ఏ ఆదాయ మార్గంలో వచ్చాయో తెలపాలని నోటీసుల్లో పేర్కొంది. కానీ ఇప్పటి వరకు ఎవరూ సీఐడీ నోటీసులకు సమాధానం ఇవ్వనే లేదు. దీనిపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్యోగులను ప్రశ్నిస్తే విస్మయకర సమాధానమిచ్చారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే అది తమ విధానమని కూడా చెప్పడం గమనార్హం. అంటే పక్కా పన్నాగంతోనే నల్లధనం దాచుకునేందుకు మార్గదర్శి చిట్ ఫండ్స్‌ను అడ్డాగా చేశారన్నది స్పష్టమవుతోంది.

ఘోస్ట్ చందాదారులతో నల్ల దందా

బహుశా దేశంలో ఏ ఆర్థిక సంస్థ కూడా చేయని రీతిలో రామోజీరావు సరికొత్త నల్లధనం దందాకు తెరతీశారు. అందుకోసం ఆయన తెరపైకి తెచ్చిన విధానమే 'ఘోస్ట్ చందాదారులు'. తమ ఏజెంట్ల ద్వారా రాష్ట్రంలోని చిరు వ్యాపారులు, గృహిణులు, ప్రైవేటు ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు ఇలా పలు వర్గాలకు చెందిన వారి ఆధార్ కార్డులు సేకరించారు. ఓ పట్టణంలోని వారి ఆధార్ నంబర్ల ఆధారంగా దూరంగా ఉన్న పట్టణంలో మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయంలో చిట్టీ వేస్తారు. తన పేరుతో చిట్టీ ఉందనే విషయం సంబంధిత వ్యక్తులకు తెలియదు. వారినే ఘోస్ట్ చందాదారులుగా వ్యవహరిస్తారు. వారు చిట్టీలకు చందాలు చెల్లించరు. కానీ వారి పేరున చిట్టీ గ్రూపులు నిర్వహిస్తుంటారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కూడా ఆ చిట్టీ చందాలు చెల్లించదు. కేవలం పుస్తకాల్లో సర్దుబాట్ల ద్వారా చందా చెల్లించినట్టు చూపిస్తారు. కానీ ప్రతి నెల డివిడెండ్లు, ఓసారి చిట్టీ పాట మొత్తాన్ని తీసుకుంటారు. ఆ చిట్టీ పాట మొత్తాన్ని మళ్లీ మార్గదర్శి చిట్ ఫండ్స్‌లోనే డిపాజిట్లు చేస్తారు. ఇలా రాష్ట్రంలో వేల సంఖ్యలో ఘోస్ట్ చందాదారుల పేరిట చిట్టీలు తెరచి.. భారీగా నల్ల ధనాన్ని అక్రమ డిపాజిట్లుగా చలామణిలోకి తీసుకువస్తున్నారు. ఆ విధంగా వేల కోట్ల రూపాయాల నల్లధనాన్ని చెలామణిలోకి తీసుకురావడం రామోజీరావుకే చెల్లింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ సోదాలు చేయగా అటువంటి ఘోస్ట్ చందాదారుల చిట్టీలు గుట్టలు గుట్టలుగా బయటపడ్డాయి.

ఉత్తుత్తి చెక్కులతో 'బ్లాక్' మ్యాజిక్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల నుంచి అక్రమంగా తమ సొంత కంపెనీల్లోకి పెట్టుబడులుగా తరలిస్తున్న నల్లధనానికి మసి పూసి మారేడు కాయ చేసేందుకు రామోజీరావు జిత్తులమారి ఎత్తులు వేస్తున్నారు. ఏటా మార్చి 31న మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో బ్యాలన్స్ షీట్లు చూపించాలి. కానీ అప్పటికే ఆ నిధులను అక్రమంగా తమ సొంత కంపెనీలు ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్ ప్రైజెస్‌లతోపాటు మ్యూచువల్ ఫండ్స్ కంపెనీల్లోకి తరలించేస్తున్నారు. కానీ మార్చి 31న బ్యాలన్స్ షీట్‌తో సరిపోవాలి. అందుకోసం మార్చి 31న పెద్ద సంఖ్యలో చందాదారులు చెక్కుల రూపంలో చిట్టీల మొత్తం చెల్లించినట్టుగా చూపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆ చెక్కులను 90 రోజుల్లో నగదుగా మార్చాలి. కానీ మార్గదర్శి చిట్ ఫండ్స్ మాత్రం ఆ చెక్కులను నగదుగా మార్చి, బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు చూపించడం లేదు. అంటే మార్చి 31న బ్యాలన్స్ షీట్ పూర్తి కాగానే.. ఆ చెక్కులను గుట్టు చప్పుడు కాకుండా మాయం చేస్తోంది. ఎందుకంటే అవన్నీ ఉత్తుత్తి చెక్కులే. ఆ ఖాతాల్లో నగదు ఉండదు. ఆ చెక్కులు బ్యాంకులో వేసినా ఎన్‌క్యాష్ కావు. కేవలం చిట్స్ రిజిస్ట్రార్, రిజర్వ్ బ్యాంకును బురిడీ కొట్టించేందుకే ఈ ఉత్తుత్తి చెక్కులతో కనికట్టు చేస్తోంది. ఆ విధంగా ఏటా మార్చి 31న దాదాపు రూ.550 కోట్ల విలువైన చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ చూపిస్తోంది. అంటే ఏటా దాదాపు రూ.550 కోట్ల నల్లధనాన్ని గుట్టుగా దాటిస్తోందన్నది సుస్పష్టం. ఇలా దశాబ్దాల నుంచి ఏటా రూ.550 కోట్ల చొప్పున నల్లధనం దందా సాగిస్తుండటం రామోజీ బరితెగింపునకు నిదర్శనం.

'మార్గదర్శి' బాధితుల సంఘం ఏర్పాటు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలపై పోరాడేందుకు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం'ఏర్పాటైంది. విజయవాడ కేంద్రంగా ఈ సంఘాన్ని రిజిస్టర్ చేయించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఎం.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులకు న్యాయ సహాయం, ఇతర సహకారం అందించేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామన్నారు. రామోజీరావు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడటం ద్వారా బాధితులకు న్యాయం చేయడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమన్నారు. బాధితులు తమ సమస్యలను తెలిపేందుకు 9849055267 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

అంతమైన అంతరాలు!

- మన ప్రభుత్వంలో పెత్తందారులకు కాదు.. పేదలకే పదవులు, పథకాలు: సీఎం జగన్
- ఒంగోలు పరిధిలో 20,840 ఇళ్ల స్థలాల రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని ప్రారంభించిన సీఎం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పేదలకో న్యాయం.. పెద్ద వారికి మరో న్యాయం అనే విధానాన్ని సమూలంగా మారుస్తూ 58 నెలలుగా మనందరి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. పేదలకు ఉచితంగా అందించిన ఇళ్ల పట్టాల నుంచి విద్య, వైద్యం, సామాజిక రంగాలలో ఇదే ఒరవడిని అనుసరిస్తూ ధనిక – పేద అంతరాలను తొలగిపోయేలా విప్లవాత్మక చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు. నాడు – నేడుతో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం, జిటల్ చదువులను పేదింటి పిల్లలకు చేరువ చేయడంతోపాటు ఖరీదైన, నాణ్యమైన వైద్యాన్ని సర్కారీ ఆస్పత్రుల్లో పేదలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'కార్యక్రమం కింద లబ్ధిదారులకు సర్వ హక్కులతో రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం జిల్లా ఒంగోలులో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా పది రోజుల పాటు పండుగలా కొనసాగనున్నాయి.

రెండు రకాల రూల్సా..?

దేశ చరిత్రలో తొలిసారిగా 31 లక్షల మందికి ఇచ్చిన డీ పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మల చేతుల్లో పెడుతున్న కార్యక్రమం ఈరోజు ఒంగోలు నుంచి జరుగుతోంది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20,840 రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ చేస్తున్నాం. పేదలందరికీ ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, మంచి చేయడంలో గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి ఎంత తేడా ఉందో అంతా గమనించాలి. పేదల బతుకులు మారి వారి బిడ్డలు గొప్పగా ఎదిగేలా 58 నెలలుగా మన ప్రతి అడుగూ పడింది. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం ఉండటానికి వీల్లేదనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఐఏఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఇతర పెద్దలకు ఇచ్చే ప్లాట్లకు వి ధించే నిబంధనలే పేదలకూ వర్తింపచేయాలనే ఉ ద్దేశంతో కన్వేయన్స్ డీడ్‌లతో రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నాం. రాష్ట్రంలో రెండు రకాల నిబంధనలు ఉన్నట్లు తెలుసుకున్నప్పు డు నాకు ఆశ్చర్యం అనిపించింది. పేదలకు ఒక రకంగా, పెద్దలకు మరో రకంగా నిబంధనలు ఉండ టం సరికాదు. అలాంటి విధానాలపై తిరుగుబాటు చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం.

సెంటు కూడా ఇవ్వకపోగా బాబు కుట్రలు..

2020 ఉగాది నాటికే ఈ ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మలకు ఇవ్వాలనుకున్నా కొందరు రాక్షసుల మాదిరిగా అవరోధాలు సృష్టించారు. అధికారంలో ఉండగా పేదవాడికి ఒక్క సెంటు స్థలం ఇచ్చిన పాపానపోని చంద్రబాబు ఇవాళ మనం ఇస్తుంటే అడ్డుపడి ఆయన మనుషుల ద్వారా ఏకంగా 1,191 కేసులు దాఖలు చేశారు. వీటిని అధిగమించి ఇవాళ ఒక్క ఒంగోలులోనే 21 వేల మంది పేదలకు సర్వ హక్కులతో ఇళ్ల పట్టాలిస్తున్నాం. ఇవన్నీ చూస్తుంటే వంద మంది సినిమా విలన్ల కంటే, పురాణాల్లో రాక్షసులందరి కంటే ఒక్క చంద్రబాబు దుర్మార్గమే ఎక్కువ అనిపిస్తుంది.

బైబై బాబు అంటున్న బాబు సతీమణి

చంద్రబాబును నేను ఇవన్నీ ప్రశ్నిస్తే నన్ను సవాల్ చేస్తున్నావా? అంటాడే కానీ ఇంటింటికీ ఫలానా మంచి చేశాను అని మాత్రం చెప్పడు. ఒకవైపు ఎన్నికలకు మనమంతా సిద్ధం అంటుంటే.. మరో వైపు చంద్రబాబు భార్య మా అయన సిద్ధంగా లేరని అంటున్నారు. ఏకంగా కుప్పంలోనే బైబై బాబు.. అంటూ ఆయన అర్ధాంగి నోటే పంచ్ డైలాగులు వస్తున్నాయి. ఇలాంటి చంద్రబాబును రాష్ట్రంలో ప్రజలెవరూ సమర్థించడం లేదు. ఏపీకి రానివారు, సొంత ఊరు ఏదంటే తెలియని వారు, రాష్ట్రంలో ఓటే లేని వారు, ఇక్కడ దోచుకున్నది పంచుకోవడానికి అలవాటైన నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్ మాత్రమే చంద్రబాబును సమర్థిస్తారు. నాకు ఆయన మాదిరిగా నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడి మద్దతు లేవు. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా నిలబడాలని కోరుతున్నా.

నగర వార్తలు

వండర్‌లా స్పెషల్ ఆఫర్

లక్డీకాపూల్: అతిపెద్ద అమ్యూజ్మెంట్ పార్క్ చైన్ వండర్‌లా హాలిడేస్ ఈ నెల24 నుంచి 29వ తేదీ వరకు బెంగళూరు, హైదరాబాద్‌లతో పాటు కొచ్చి పార్కులలో తమ ప్రత్యేకమైన లీప్ వీక్ ఆఫర్‌ను ప్రకటించింది. కేవలం రూ. 929 ధర తో పార్క్ లోకి ప్రవేశించవచ్చు. ఈ ఆఫర్ అడ్వెంచర్ అన్వేషకులు, థ్రిల్ ప్రేమికులకు ఉల్లాసకరమైన, వినోదభరితాలను ఆస్వాదించడానికి ఇదొక అవకాశం. సందర్శకులకు లీప్ వీక్ ఆఫర్‌ను మరింతగా ఆకర్షించడానికి కేవలం రూ.1229తో పార్క్ టిక్కెట్ , ఫుడ్‌తో కూడిన కాంబో టిక్కెట్‌లను కొనుగోలు చేసే అవకాశం కూడా అందిస్తుంది. లీప్ వీక్ ఆఫర్ ఆన్‌లైన్ కొనుగోళ్లకు మాత్రమే వర్తిస్తుంది. బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వండర్‌లా హాలిడేస్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె. చిట్టిలప్పిల్లి కోరారు.

27న గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సమావేశం

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పారదర్శకంగా ఆర్టీఏ పౌరసేవలు



- సహాయకేంద్రాలు బలోపేతం
- ఉపరవాణా కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ పౌరసేవలను పాదర్శకంగా అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. వివిధ రకాల సేవల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వచ్చే వాహనదారులకు తగిన సమాచారాన్ని అందజేసేందుకు అన్నిచోట్ల సహాయకేంద్రాలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం మణికొండలోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా అధికారుల సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లాతో పాటు, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన రవాణా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.వాహన వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో పౌరసేవలను వినియోగించుకొనే విధంగా టీ–యాప్ ఫోలియో పైన అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందుకోసం అన్ని చోట్ల హెల్ప్‌డెస్కలను పటిష్టం చేయాలన్నారు.మరోవైపు రవాణాశాఖ అందజేసే పౌరసేవలపైన వాహనదారులు ఫిర్యాదులు చేయవచ్చునన్నారు.రవాణాశాఖ వెబ్ సైట్‌లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చునని చెప్పారు.ఈ సందర్భంగా వివిధ జిల్లాల వారీగా ఎంవీఐలు సాధించిన ఆదాయ లక్ష్యాలను కూడా ఆయన సమీక్షించారు. ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.

అక్రమరవాణాపై కొరడా....

అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలను చేపట్టనున్నట్లు చెప్పారు.అనుమతులు లేని వాహనాలు, అధికలోడ్ వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు.సంబంధిత వాహన యజమాని పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.రహదారి భద్రత పై రాబోయే రోజుల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.వాహనదారులు త్రైమాసిక పన్నులు చెల్లించాలని, లేని పక్షం లో తనిఖీల్లో పట్టు బడితే భారీ జరిమానా విధించడం తో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో లో ఆర్టీఏ అధికారులు వెంకట్‌రెడ్డి, రఘునందనగౌడ్, వాణి, సుభాష్ చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, సునీత, కృష్ణవేణి, వాసు, శ్రీను బాబు శ్రీరాం,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాపక్షపాతి, విప్లవ శ్రేయోభిలాషి అరికట్ల రామకృష్ణారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య భర్త అరికట్ల రామకృష్ణారెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... విప్లవోద్యమాలను బలోపేతం చేయడానికి రామకృష్ణారెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యార్థి ఉద్యమాల్లో సైతం ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నగరంలో నవ్య ప్రింటర్స్ ప్రెస్ నిర్వాహకుడిగా ఉంటూనే ప్రజాస్వామికోద్యమాలకు తనపరిధిలో విశేష కృషి చేశారన్నారు. ఐఎఫ్‌టియూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ తన కోసం తన కుటుంబం కోసం ఆలోచించకుండా నిరంతరం ప్రజల కోసమే ఆలోచించిన వ్యక్తి అని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం నిస్వార్థంగా పని చేశారని గుర్తు చేశారు. ప్రజా గాయకుడు యశ్పాల్ రచించి, ఆలపించిన పాట సభికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, న్యూడెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ నాయకులు జి.అనురాధ, గౌనీ ఐలయ్య, మామిడాళ్ల భిక్షమయ్య, భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు పేదలకు చేరాలి



అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్

- ఐఐసీటీలో ప్రారంభమైన మూడు రోజుల సదస్సు
- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్‌రాజన్

లాలాపేట: నేడు అభివృద్ధి చెందుతున్న అత్యాధునికమైన సంతానోత్పత్తి చికిత్సలు పేదలకు చేరవేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్‌రాజన్ అన్నారు. తార్నాకలోని ఐఐసిటీ ఆడిటోరియంలో 'పునరుత్పత్తి ఆరోగ్యంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు, ఐఎస్ఎస్ఆర్ఎఫ్ 2024 34వ వార్షిక సమావేశాన్ని' శుక్రవారం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పునరుత్పత్తి ఆరోగ్యం, సంతానోత్పత్తి చికిత్స అందరికి అందుబాటులో ఉండేలా ఆవిష్కరణలు చేయాలనీ, వాటి ఫలితాలు సామాన్య ప్రజలకు, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అందుబాటులోకి రావాలన్నారు. కొన్ని పునరుత్పత్తి పద్ధతులు పట్టణ, ఉన్నత విద్యావంతులకే అందుతున్నాయని పేర్కొన్నారు. వీటిని గ్రామాల్లోని ప్రజలు సైతం తప్పనిసరిగా పొందగలుగాలని అన్నారు. ఆయుష్, అల్లోపతి ఔషధాలను ఏకీకృతం చేసినందుకు ప్రధాన మంత్రి సేవలను ప్రశంసించారు. దీంతో పాటుగా యోగా అభ్యాసనాలతో ఈ రోజుల్లో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఈ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను గవర్నర్ విడుదల చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో శాస్త్రీయ పత్రాల సమర్పణ, ప్రసంగాలు, సంతానోత్పత్తి ఔషధం చికిత్సను ముందుకు తీసుకెళ్లడంపై చర్చిస్తారని ఐఎస్ఎస్ఆర్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రోయా రోజాటి తెలిపారు. కార్యక్రమంలో ప్రో. లోహియా, కైజర్ జమీల్, డా. శాంతకుమారి, డా నందిత, ఆర్ ఎస్ శర్మ, జిపి తల్వార్ తదితరులున్నారు.

ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్లు భేష్: సినీ నటుడు అలీ

బంజారాహిల్స్: టీవీ కార్మికుల కోసం తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి శస్త్ర చికిత్సా శిబిరాన్ని సినీనటుడు అలీ శుక్రవారం సందర్శించారు. ప్రముఖ యాంకర్ సుమ కనకాల సౌజన్యంతో 'మన అమెరికన్ తెలుగు అసోసియేషన్' (మాట) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో చెన్నై శంకర్ నేత్రాలయ వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తున్నారు. శిబిరాన్ని సందర్శించిన అలీ మాట్లాడుతూ... ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాట ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గనగోని కృషి అభినందనీయమన్నారు. దాదాపు 1300 మంది పరీక్షలు చేయించుకోగా, 200 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. టీవీ ఫెడరేషన్ అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి నరేందర్‌రెడ్డి, ఫెడరేషన్ ఫౌండర్ నాగబాల సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులు రమేష్ సంపత్, సలహాదారులు మురళి, నర్సింగ్‌రావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్ శిబిరాన్ని సందర్శించిన సినీనటుడు అలీ

ఆకట్టుకున్న వీణ వాయిద్య కచేరి



కార్యక్రమంలో పాల్గొన్న కార్టూనిస్ట్ శంకర్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహిస్తున్న న్యూస్ ఆర్ట్ ఫెస్ట్ 2024 చిత్రప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో భాగంగా శుక్రవారం సాక్షి కార్టూనిస్ట్ శంకర్ వేసిన చిత్రాలను సందర్శకులు చూసి చిత్రాలు వేసే విధానంలో మెలకువలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాకారులు సంజయ్ అష్టపుత్ర వీణ వాయిద్యంతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

సమతాకుంభ్ ఉత్సవాల్లో మంత్రి తుమ్మల

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతాకుంభ్–2024 ఉత్సవాల్లో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సామూహిక లక్ష్మీపూజ నిర్వహించారు. మంత్రికి చినజీయర్‌స్వామి మంగళశాసనాలు అందజేశారు.

'సంకల్ప యాత్ర'కు ఘన స్వాగతం

వనస్థలిపురం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి సాగిన బీజేపీ విజయ సంకల్పయాత్ర శుక్రవారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ తదితరులు వాహనంపై నుంచి పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మురళీధర్‌రావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు

విధినిర్వహణలో వెనుకంజ వేయొద్దు

- టీఎస్ఎస్‌పీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా



మాట్లాడుతున్న స్వాతి లక్రా



టీఎస్ఎస్‌పీ పోలీసు అధికారులు, సిబ్బంది

వెంగళరావునగర్: సమాజంలోని ప్రతి పౌరుడి సంరక్షణ కోసం పోలీసు నిరంతరం శ్రమిస్తుంటాడని టీఎస్ఎస్‌పీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన స్వాతి లక్రా మాట్లాడుతూ... పోలీసుగా బాధ్యతలు నిర్వర్తించడం ఎంతో గర్వకారణంగా ఉంటుందన్నారు. మనం వేసే ప్రతి అడుగు ప్రజా శ్రేయస్సు కోసమేనని, ఇందుకోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనుకంజ వేయకూడదన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు నియమితులైన సిబ్బందిని ఆమె అభినందించారు. టీఎస్ఎస్‌పీ డీఐజీ సిద్ధిఖి, యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ కె.పి.సత్యనారాయణ, బి.జవహర్ లాల్, ఆర్‌ఐలు ధర్మారావు, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశంలతో పాటుగా ఆర్ఎస్ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
24-2-2024

జీఎస్టీ ఎవరు కట్టాలి?



- ల్యాండ్ ఓనర్, బిల్డర్ల మధ్య సందిగ్ధం
- కొత్తవైనా, రీ–డెవలప్‌మెంట్ అయినా 5 శాతం జీఎస్టీ
- చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌లో గృహాలకు డిమాండ్‌ పెరుగుతుంది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతి కారణంగా కొత్త ప్రాంతాలలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. మరోవైపు ప్రధాన నగరంలో స్థలం కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం మినహా నిర్మాణదారులకు ప్రత్యామ్నాయం లేదు. ఖైరతాబాద్, అబిడ్స్, బేగంపేట, సనత్‌నగర్, ఈఎస్‌ఐ, బంజారాహిల్స్‌ వంటి ప్రాంతాలలో ఇలాంటి రీ–డెవలప్‌మెంట్‌ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండిపెండెంట్‌ హౌస్‌లు, నాలుగైదు అంతస్తుల అపార్ట్‌మెంట్లను కూల్చేసి ఆ స్థలంలో హైరైజ్‌ భవనాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూ యజమానులు, ఫ్లాట్‌ ఓనర్లతో బిల్డర్లు డెవలప్‌మెంట్‌ అగ్రిమెంట్‌ చేసుకుంటారు. ఖాళీ స్థలాలను అభివృద్ధికి తీసుకుంటే 50 నుంచి 40 శాతం, ప్రాంతాన్ని బట్టి 60 శాతం ఫ్లాట్లను భూ యజమానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారు. మిగిలిన వాటినే డెవలపర్‌ అమ్ముకుంటాడు.

- కూల్చి కట్టినా, ఖాళీ ప్రదేశంలో కొత్త భవనాలు కట్టినా పూర్తయిన ఇళ్లకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. భూ యజమాని వాటా కింద వచ్చిన జీఎస్టీ ఎవరు చెల్లించాలనే అంశంపై ల్యాండ్‌ ఓనర్లకు, బిల్డర్లకు మధ్య వాగ్వాదం నెలకొంటుంది. డెవలపరే చెల్లించాలని భూ యజమాని, ల్యాండ్‌ ఓనరే కట్టాలని బిల్డర్ల మధ్య సందిగ్ధం నెలకొంది. భవనం కట్టడంతో స్థలం విలువ పెరిగిందని, దీంతో 5 శాతం జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం బిల్డర్‌కు నోటీసులు పంపిస్తుంది. వాస్తవానికి కొత్తవైనా, పాతవైనా భవనానికి జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే. కాకపోతే భూ యజమాని, కస్టమర్ల నుంచి బిల్డర్‌ జీఎస్టీ వసూలు చేసి కట్టాల్సింది డెవలపరే.

భళా.. ఆఫీసు!

- కార్యాలయ అద్దెల్లో 8% వృద్ధి
- చెన్నై తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ



సాక్షి, హైదరాబాద్‌: దేశంలో ఆఫీసు స్పేస్‌ అద్దెలు పెరుగుతున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (హెచ్‌1) దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కార్యాలయాల అద్దెలు 7 శాతం మేర పెరిగాయి. నిర్మాణం, ఇన్‌పుట్‌ వ్యయం పెరగడమే ఇందుకు కారణమని అనరాక్‌ రిపోర్ట్‌ వెల్లడించింది. చెన్నై తర్వాత హైదరాబాద్‌లోనే ఆఫీసు స్పేస్‌ అద్దెలు అత్యధికంగా పెరిగాయి. ఏడాది కాలంలో చెన్నైలో 10 శాతం మేర వృద్ధి చెందితే.. నగరంలో 8 శాతం పెరిగాయని పేర్కొంది.

- 2023 ఆర్థిక సంవత్సరంలో నగరంలో నెలకు చ.అ. ఆఫీసు అద్దె రూ.61గా ఉండగా.. 2024 ఫైనాన్షియల్‌ ఇయర్‌ నాటికి రూ.66కు పెరిగాయి. అదే గ్రేడ్‌–ఏ ఆఫీసు అద్దె చ.అ.కు నెలకు 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.77.5గా ఉండగా.. ఇప్పుడది రూ.83కు పెరిగింది.

నగరాల వారీగా అద్దె (నెలకు చ.అ.కు)

నగరం	2023 హెచ్‌1	2024 హెచ్‌1	వృద్ధి (శాతంలో)
బెంగళూరు	84	90	7
ముంబై	130	136	5
ఎన్‌సీఆర్	81	85	5
చెన్నై	62	68	10
హైదరాబాద్	61	66	8
పుణె	74	79	7
కోల్‌కతా	54	58	7

గృహాల అద్దెలు పెరిగాయి!



- ఏడాదిలో నగరంలో 24.2 శాతం వృద్ధి
- మ్యాజిక్‌ బ్రిక్స్‌ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: నగరంలో గృహాల అద్దెలు పెరిగాయి. ప్రీమియం ఇళ్లకు డిమాండ్, ఆఫీసు కేంద్రాలకు చేరువలో ఉండటం వంటి కారణంగా ప్రధాన నగరాలలో ఇళ్ల అద్దెలు వృద్ధి చెందుతున్నాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది జులై–సెప్టెంబర్‌లో 4.6 శాతం, ఏడాదితో పోలిస్తే 22.4 శాతం మేర అద్దెలు పెరిగాయని మ్యాజిక్‌బ్రిక్స్‌.కామ్‌ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా థానేలో 57.3 శాతం, గుర్గావ్‌లో 41.4 శాతం, గ్రేటర్‌ నోయిడాలో 28.7%, నోయిడాలో 25.2 %, హైదరాబాద్‌లో 24.2% మేర వృద్ధి చెందాయి.

- దేశంలోని 13 నగరాలో 67 శాతంగా ఉన్న 18–34 ఏళ్ల వయసు ఉన్న మిల్లీనియల్స్‌ వల్లే గృహాల అద్దెలు పెరిగాయి. సెమీ ఫర్నిష్‌ గృహాలను రెంట్‌కు తీసుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ తరహా అద్దెలకు 52.7 శాతం డిమాండ్‌ ఉండగా.. సప్లయి 48.7 శాతం మాత్రమే ఉందని మ్యాజిక్‌బ్రిక్స్‌ సీఈఓ సుధీర్‌ పాయ్‌ తెలిపారు. నెలకు రూ.10–30 వేల మధ్య అద్దె ఉన్న మధ్యస్థాయి గృహాలకు 41 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.

జనవరిలో 5,411 రిజిస్ట్రేషన్లు

- వీటి విలువ రూ.3,279 కోట్లు
- 15 శాతం వాటా లగ్జరీ గృహాలదే
- నైట్‌ఫ్రాంక్‌ ఇండియా తాజా నివేదిక



సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌లో జనవరిలో రూ.3,279 కోట్ల విలువ చేసే 5,411 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్స్‌ జరిగాయి. గతేడాది మొదటి నెలలో రూ.2,650 కోట్ల విలువ చేసే 5,454 యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఏడాదిలో రిజిస్ట్రేషన్లలో 1 శాతం తగ్గుదల, విలువలలో 24 శాతం వృద్ధి నమోదయిందని నైట్‌ ఫ్రాంక్‌ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.

లగ్జరీ గృహాలకు డిమాండ్‌

రూ.కోటి, అంతకంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ గృహాలకు డిమాండ్‌ క్రమంగా పెరుగుతుంది. 2023 జనవరిలో జరిగిన రిజిస్ట్రేషన్లలో ఈ విభాగం వాటా 8 శాతంగా ఉండగా.. ఇప్పుడవి 14 శాతానికి పెరిగాయి. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల ధర ఉన్న ప్రాపర్టీల వాటా 47 శాతంగా ఉంది. గతేడాది జనవరిలో ఈ విభాగం వాటా 57 శాతంగా ఉంది. రూ.25 లక్షల కంటే తక్కువ ధర ఉన్న యూనిట్ల వాటా గతేడాది జనవరిలో 19 శాతం కాగా.. ఇప్పుడు 15 శాతానికి తగ్గింది.

పెద్ద ఇళ్ల వాటా 71 శాతం..

రిజిస్ట్రేషన్లలో 71 శాతం ప్రాపర్టీలు 1,000 చ.అ. నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం ఉన్నవే ఉన్నాయి. 2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన యూనిట్ల వాటా గతేడాది 9 శాతం కాగా.. ఇప్పుడవి 13 శాతానికి పెరిగాయి.

అందం..ఆనందం!



సాక్షి, హైదరాబాద్‌: కరోనా మహమ్మారి తర్వాతి నుంచి ఇంట్లో స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలను పెంచడం పెరిగిపోయింది. దీంతో దుర్వాసనకు దూరంగా ఉండటంతో పాటు అందం, ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. హోమ్‌ గార్డెనింగ్‌ మొక్కల ప్రత్యేకత ఏంటంటే.. వీటికయ్యే వ్యయం చాలా తక్కువ. నిర్వహణ కూడా తేలికే. పైగా అందంగా, అద్భుతమైన డిజైన్లతో అలంకార ప్రాయంగానూ ఉంటాయి. ఇండోర్‌ గార్డెనింగ్‌ మీద ఆసక్తి ఉన్న వాళ్ల తొలి ప్రాధాన్యం స్నేక్‌ ప్లాంట్‌ మొక్కే. తక్కువ కాంతి పరిస్థితుల్లో కూడా ఇది బాగా పెరుగుతుంది. దీని నిర్వహణ అత్యంత సులువు. చాలా తక్కువ నీటి అవసరం ఉంటుంది. చీకటి ప్రదేశంలో, గది మూలల్లోనూ ఇది పెరుగుతుంది. తక్కువ కాంతిలో ఈ మొక్కను ఉంచినప్పటికీ.. స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఇది నిలువుగా పెరుగుతుంది.

- మధ్యస్థ స్థాయిలో సూర్యరశ్మి లేదా పరోక్ష పద్ధతిలో సూర్యకాంతిలోనూ పెరగడం రబ్బర్‌ ప్లాంట్‌ ప్రత్యేకత. దీనికి ఆకులు పెద్ద సైజ్‌లో ఉంటాయి. అందువల్ల గాలి నుంచి వచ్చే వ్యర్థాలు, దుమ్ము, ధూళి కణాలను చాలా సులువుగా గ్రహిస్తాయి. ప్రతి రోజూ ఒకే సమయంలో నీటిని పోయాలి లేకపోతే ఆకులు రాలిపోయే ప్రమాదం ఉంది.
- గార్డెనింగ్‌ ఔత్సాహికులు, అనుభవజ్ఞులకు మనీ ప్లాంట్‌ సరైన మొక్క. నిర్వహణ కోసం పెద్దగా కష్టపడాల్సిన పన్లేదు. అంత త్వరగా ఎండిపోదు. ఇంటి గాలిలోని బెంజెన్లు, ఫార్మాల్డిహైడ్‌ వంటి విష రసాయనాలను మనీ ప్లాంట్‌ గ్రహిస్తుంది. వీటిని కుండీల్లో, బుట్టల్లో ఎక్కడైనా వేలాడదీయవచ్చు లేదా నీటి గిన్నెలలో కూడా పెంచుకోవచ్చు. ఇంటి లోపల, ఆరుబయట, ప్రవేశ ద్వారం వద్ద వీటిని ఉంచుకోవచ్చు. ఏ మొక్కకైనా సరే అతిగా నీళ్లు పోయకూడదు. ఎంత పరిమాణంలో నీటిని పోయాలో తెలుసుకోవాలంటే అది ఉండే మట్టిని పరిశీలించాలి.



అమ్మల పాదిలో..

జంపన్నవాగులో మునకలు. తల్లులను స్మరించి తలనీలాలు. ఎత్తుబంగారంతో నడకలు. వరంపట్టి వడివడిగా అడుగులు. దేవరలకు యాటబలులు. ఆడబిడ్డలకు తీరొక్క మొక్కులు. తన్మయత్వంలో భక్తులు. జువ్వి చెట్టు నీడన తల్లులు. తలిచినోళ్లందరికీ దీవెనార్తులు!

ఉప్పొంగిన భక్తిభావం.. పోటెత్తిన భక్తులు

- వనదేవతల దర్శనంతో తరించిన జనం
- 1.25 కోట్ల మంది మొక్కులు.. శుక్రవారం 40 లక్షలకు పైగా దర్శించుకున్నట్లు అంచనా
- తల్లుల సేవలో సీఎం రేవంత్, గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- వీవీఐపీల రాకతో క్యూలైన్‌లో ఉన్నవారికి అవస్థలు
- తిరుగు ప్రయాణమైన భక్తజనం.. నేడు వనంలోకి జనదేవతలు

మేడారం నుంచి సాక్షిప్రతినిధి, వరంగల్ :

మేడారం జనసంద్రమైంది. సమ్మక్క–సారలమ్మ నామస్మరణతో భక్తిభావం ఉప్పొంగింది. సమ్మక్క కో... సారక్క కో అంటూ.. గద్దెల ప్రాంగణం మార్మోగింది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనాలకు బారులుదీరారు. చీర, సారె, నిలువెత్తు బంగారం(బెల్లం), ఎదురుకోళ్లు, ఒడి బియ్యం, కొబ్బరికాయలు... ఇలా తీరొక్క రూపాల్లో వనదేవతలకు మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తడంతో మేడారం ప్రాంతమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అమ్మల ప్రసాదం (బెల్లం) దక్కించుకునేందుకు పోటీపడ్డారు. శుక్రవారం సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వేర్వేరుగా తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. కేంద్ర గిరిజనశాఖ మంత్రి అర్జున్ ముండా, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దర్శించుకున్నారు.

1.25 కోట్లు దాటిన భక్తులు..

ఈసారి జాతరకు కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. అయితే జనదేవతల వన ప్రవేశం.. జాతర ముగిసేందుకు మరో రోజు సమయం ఉండగా.. శుక్రవారం నాటికి దర్శనం చేసుకున్న భక్తుల సంఖ్య 1.25 కోట్లు దాటినట్లు అధికారుల అంచనా. ప్రధానంగా సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువై ఉండడంతో శుక్రవారం దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో భక్తుల సంఖ్య 40 లక్షలు దాటినట్లు అంచనా వేశారు. గురువారం వరకు ముందస్తు మొక్కులతో కలిసి 85 లక్షల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు ఇదివరకే ప్రకటించారు. ఈనేపథ్యంలో ఈసారి మేడారం జాతరలో వనదేవతలను దర్శించుకున్న భక్తుల సంఖ్య 1.25 కోట్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. జాతర చివరి రోజు శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుందని భావిస్తున్నామని, ఆ మేరకు భద్రతా, దర్శనం ఏర్పాట్లు కొనసాగుతాయని అధికారులు చెప్తున్నారు. కాగా.. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన గిరిజనులు సంప్రదాయ పద్ధతుల్లో డప్పుల మోతలు, బాకాలు, బూరల నాదాలతో వచ్చి అమ్మలకు ఇంకా మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వనంలోకి నేడు జన దేవతలు..

వనదేవతల దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరుగు పయనమయ్యారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మేడారం బాటపట్టిన భక్తజనం.. ఇష్టదైవాలకు మొక్కులు సమర్పించి ఇంటి బాటపట్టారు. అయితే శుక్రవారం ఒక్కరోజే సుమారు 40 లక్షల మంది వరకు జాతరలో అమ్మవార్లను దర్శించుకున్నట్లు చెప్తుండగా. తిరుగు ప్రయాణం భక్తులతో మేడారంలోని ఆర్టీసీ (టెర్మినల్) బస్టాండ్ కిటకిటలాడింది. ఇసుకేస్తే రాలనంత జనంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కిక్కిరిసిపోయింది. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మణుగూరు, భూపాలపల్లి, హుజూరాబాద్ వెళ్లేవారు మధ్యాహ్నం ఒంటిగంట సమీపంలో క్యూలైన్లో నిల్చుంటే సాయంత్రం ఆరు దాటితే గానీ బస్సుల్లోకి ఎక్కలేని పరిస్థితి ఏర్పడింది. అష్టకష్టాలు పడి తల్లులను దర్శించుకున్న భక్తులు చివరికి ఇంటికే చేరేందుకూ ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజుల పాటు గద్దెలపై కొలువుదీరిన దేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. ఈఘట్టం పూర్తవడంతో మేడారం జాతర ముగియనుంది.

తల్లుల దర్శనం మూడోసారి

- మహాజాతరకు రావడం నా అదృష్టం
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



మొక్కులు చెల్లిస్తున్న గవర్నర్ తమిళిసై

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'మేడారం మహా జాతరకు రాష్ట్ర గవర్నర్‌గా మూడోసారి రావడం నాఅదృష్టం. జాతరలో పాల్గొనడం చాలా సంతోషాన్నిచ్చింది' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శుక్రవారం ఆమె కేంద్ర గిరిజన మంత్రి అర్జున్ ముండాతో కలిసి మేడారంలోని సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. గవర్నర్ దంపతులు, గిరిజన మంత్రి అర్జున్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మీడియా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. మేడారం జాతర సందర్భంగా గిరిజనులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. లక్షలాదిమంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గవర్నర్‌గా విధులు నిర్వహిస్తూ.. తాను సైతం ఆరు గిరిజన, ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అవసరమైన కృషి చేస్తానని పేర్కొన్నారు.

దేశ అభ్యున్నతిలో గిరిజనుల పాత్ర కీలకం: కేంద్ర మంత్రి అర్జున్ ముండా

దేశ అభ్యున్నతిలో ఆదివాసీలు, గిరిజనులు కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. జాతర సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ, గిరిజనుల మేడారం మహాజాతర గురించి తెలుసుకోవాలని, రాబోయే రోజుల్లో ఇక్కడి అమ్మవార్లను దర్శించుకోవాలన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర మంత్రులు తెలంగాణ గవర్నర్, కేంద్ర గిరిజన మంత్రిని సత్కరించారు.

సమ్మక్క-సారలమ్మ పోరాటం ఆదర్శం

- వనదేవతల ఆశీర్వాదంతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం
- మేడారంలో శాశ్వత అభివృద్ధికి కేబినెట్ కమిటీ
- జాతీయ హోదాపై కేంద్రం వివక్ష..
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్ : పోరాట స్ఫూర్తికి నిదర్శనం మేడారం సమ్మక్క–సారలమ్మ.. ఆ వనదేవతలు అందరికీ ఆదర్శమని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మేడారం మహా జాతర సందర్భంగా శుక్రవారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్న ముఖ్యమంత్రి.. తల్లులకు ఎత్తు (66 కిలోలు) బంగారం(బెల్లం), పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం మేడారం మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలపై ఆధిపత్యం చెలాయించాలనుకున్న.. ప్రజలను పీడించైనా పన్నులు వసూలు చేయాలనుకున్న రాజులపై.. ఆదివాసీ బిడ్డలైన తల్లీకూతుళ్లు, తండ్రీ కొడుకులు కలిసికట్టుగా పోరాడారని కొనియాడారు. ఆ దేవతల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీ ప్రాంతం, మేడారం గడ్డ నుంచి 2023 ఫిబ్రవరి 6న 'హాత్ సే హాత్ జోడో' యాత్రను ప్రారంభించి సక్సెస్ అయ్యామని చెప్పారు. పదేళ్లగా పాలకులు చేస్తున్న అరాచకాన్ని, దోపిడీని, ప్రజలపై ఆధిపత్యం చెలాయిస్తున్న వారిపై తిరగబడి ప్రజల తరఫున కొట్లాడామన్నారు. అప్పుడు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని నిలబడినందునే ఈ రోజు పేదల ప్రభుత్వం ఏర్పడిందని సీఎం పేర్కొన్నారు. ఆబాధ్యతతోనే జాతరకు వచ్చే సుమారు కోటి యాభై లక్షల మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దని రూ.110 కోట్లు జాతరకు కేటాయించిందని చెప్పారు. ఎన్నికలు పూర్తికాగానే జాతరపై దృష్టి పెట్టాల్సి రావడంతో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బృందంగా ఏర్పాటు చేసి సమన్వయంతో పనులు చేయించినట్లు వివరించారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే తమ ప్రభుత్వ తొలి నిర్ణయమని, జాతరకు పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో ఆరు వేల ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. అదనంగా మరో వంద కొత్త బస్సులు కొనుగోలు చేసి జాతరకు వినియోగించామని సీఎం వెల్లడించారు. మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అందుకే బెల్లం బంగారమైంది..

సంపన్నులు, ఆగర్భ శ్రీమంతులు గుళ్లకు వెళ్తే వజ్రాలు, వైడూర్యాలు సమర్పించే సంప్రదాయం ఉందని, అయితే అత్యంత పేదలు, నిరుపేదలు బాధపడుతుంటే సమ్మక్క కలలో ప్రత్యక్షమై బెల్లం ఇస్తే అదే బంగారంగా భావిస్తామని చెప్పడంతోనే ఇక్కడ బెల్లం బంగారమైందని ముఖ్యమంత్రి అన్నారు. ఇక్కడికి రాలేని భక్తులకు ఆన్‌లైన్ ద్వారా బంగారం (బెల్లం) పంపించే ఏర్పాట్లను దేవాదాయ శాఖ చేసిందని వెల్లడించారు.

ఫొటోలు: మేడారం నుంచి సాక్షి ఫొటోగ్రాఫర్లు : సంపెట వెంకటేశ్వర్లు, పెద్దపెల్లి వరప్రసాద్, జిల్లెలమూడి మురళీమోహన్, చింతల అరుణ్‌రెడ్డి





ట్రాఫిక్ జామ్.. భక్తుల ఇక్కట్లు

మేడారం(వరంగల్) : మేడారం జాతర నిర్వహణ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని భక్తులు ఆరోపిస్తున్నారు. 2004 నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయని ట్రాఫిక్‌లో చిక్కుకున్న వారు పేర్కొంటున్నారు. వరంగల్ నుంచి మేడారం వెళ్లిన వీవీఐపీల వాహనాలను తాడ్వాయి–మేడారం మధ్య అడవిలో 14 కిలోమీటర్లపాటు సాయంత్రం 6 గంటల నుంచి నిలిపివేశారు. దీంతో వాహనాల్లో ఉన్న పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతరలో దర్శనం చేసుకున్న భక్తులను వెంటవెంటనే ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తే మేడారంలో జనం రద్దీ తక్కువగా ఉంటుందని భావించిన అధికార యంత్రాంగం మార్గమధ్యలో వాహనాలను నిలిపివేసినట్లు తెలిసింది. శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శనం చేసుకుంటారని అధికారులు భావించారు. కానీ, ట్రాఫిక్ జామ్ కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని తేటతెల్లమైంది. జాతర మొత్తం పోలీసుల కనుసన్నుల్లోనే జరగడంతో వారి కుటుంబాలు తప్ప మిగిలిన శాఖలతోపాటు వీవీఐపీ, వీఐపీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. వరంగల్ నుంచి పస్రా, తాడ్వాయి నుంచి పస్రా, పస్రా నార్లాపూర్, తాడ్వాయి నుంచి మేడారం మార్గాల్లో రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదని భక్తులు తెలిపారు.



కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

వీవీఐపీల రాకతో అవస్థలు

- మేడారానికి గవర్నర్, సీఎం, కేంద్రమంత్రి
- పలుమార్లు వనదేవతల దర్శనాల నిలిపివేత
- ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ భక్తుల నినాదాలు

మేడారం(కాటారం/ఏటూరునాగారం) : మేడారానికి శుక్రవారం పలువురు వీవీఐపీలు రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉదయం 11.30 గంటలకు చేరుకుని 12.20 గంటల వరకు తల్లులను దర్శించుకున్నారు. తర్వాత ప్రెస్‌మీట్ నిర్వహించి తిరుగు పయనమయ్యారు. మధ్యాహ్నం 2.02 గంటలకు మేడారం పరిసర ప్రాంతాలను సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే చేశారు. తర్వాత భారీ బందోబస్తు మధ్య వాహనంలో వచ్చిన సీఎం గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రాలను సమర్పించారు. సీఎంతోపాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితర వీవీఐపీలు శుక్రవారం వనదేవతలను దర్శించుకున్నారు. గవర్నర్ 60 కిలోల నిలువెత్తు బంగారం, సీఎం రేవంత్‌రెడ్డి 66 కిలోల నిలువెత్తు బంగారం, సీఎస్ శాంతికుమారి సైతం బంగారం సమర్పించారు.



సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న భక్తులు

సీఎం సార్ మా దిక్కు చూడండి..

సీఎం రేవంత్‌రెడ్డి గద్దెల వద్దకు వెళ్తున్న క్రమంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం సార్ మా దిక్కు చూడండి.. పొద్దటి నుంచి లైన్లలో ఉన్నాం అంటూ కేకలు వేశారు. సీఎం భక్తులను చూస్తూ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకెళ్లారు. భక్తులను వారించడానికి పోలీసులు నానా ప్రయత్నాలు చేశారు. సీఎం దర్శనానికి వెళ్లిన అనంతరం భక్తులు పోలీసులు డౌన్ డౌన్ అంటూ సైతం నినదించారు.



సీఎం వస్తుండగా నిరసన తెలుపుతున్న మహిళలను వారిస్తున్న పోలీసులు

ఫస్ట్ టైమ్


అదితి సేన్ డె

పాపులర్ అయిన తరువాత ఆ బాటలో ప్రయాణించడం విశేషమేమీ కాదు.
దార్శనికులు మాత్రం వర్తమానంలో ఉంటూనే భవిష్యత్ వెలుగును దర్శిస్తారు. ఇలాంటి వారిలో ఒకరు అదితి సేన్ డె. 'క్వాంటమ్' అనే కాంతి మిణుకు మిణుకుమంటున్న కాలంలోనే దాని ఉజ్వల కాంతిని ఊహించింది అదితి.
క్వాంటమ్ సైన్స్‌లో చేసిన కృషికి డా.అదితి సేన్ డె 'జీడీ బిర్లా అవార్డ్ ఫర్ సైంటిఫిక్ ఎక్సెలెన్స్' పురస్కారానికి ఎంపికైంది.
ఈ అవార్డ్‌కు ఎంపికైన 33వ శాస్త్రవేత్త, తొలి మహిళా శాస్త్రవేత్త అదితి సేన్ గురించి....

అద్వితీయ ప్రతిభ

అలహాబాద్‌లోని హరీష్‌చంద్ర రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ అండ్ కంప్యూటేషన్ (క్యూఐసీ)లో అదితి ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. 'క్యూఐసీ' అనేది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అత్యున్నత రూపం. ఎన్నో రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల శాస్త్రం. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన పరిశోధన రంగాలలో క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ అండ్ కంప్యూటేషన్ ఒకటి' అంటుంది అదితి.

కోల్‌కతాలో పుట్టి పెరిగిన అదితికి చిన్నప్పటి నుంచి గణితం ఇష్టమైన సబ్జెక్ట్. తల్లి లక్ష్మి టీచర్. తండ్రి అజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి. కలకత్తా యూనివర్శిటీలో అప్లాయిడ్ మ్యాథమేటిక్స్‌లో ఎంఎస్‌సీ చేసిన అదితి పోలాండ్‌లోని గడాన్స్క్ యూనివర్శిటీలో భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ చేసింది. తన థీసీస్‌కు క్వాంటమ్ ఫిజిక్స్‌కు సంబంధించిన అంశాన్ని ఎంచుకుంది.

'రెండు వేల సంవత్సరంలో నా కెరీర్‌ను మొదలు పెట్టాను. ఆ సమయంలో క్వాంటమ్ ఫిజిక్స్ ప్రారంభ దశలో ఉంది. పరిమిత సంఖ్యలో అప్లికేషన్‌లు ఉండేవి' అంటూ ఆనాటి పరిమితులను గుర్తు తెచ్చుకుంటుంది అదితి. పరిమితులు, ప్రతిబంధకాలతో పనిలేకుండా 'క్వాంటమ్ ఫిజిక్స్'పై తన ఇష్టాన్ని పెంచుకుంటూ పోయింది.

కాలంతో పాటు నడుస్తూ, ఎప్పటికప్పుడు 'క్వాంటమ్ ఫిజిక్స్'ను అధ్యయనం చేస్తూ ప్రయాణాన్ని కొనసాగించింది. క్వాంటమ్ థర్మల్ యంత్రాల రూపకల్పన(బ్యాటరీలు, రిఫ్రిజిరేటర్ లాంటివి) నుంచి క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ అల్గారిథమ్‌ల సమర్థవంతమైన అమలు, సూటబుల్ క్వాంటమ్ సిస్టమ్స్ వరకు... ఎన్నో విషయాలపై పని చేస్తోంది అదితి.

ప్రతిష్ఠాత్మక శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డ్ (2018) అందుకుంది. 2022లో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ మెంబర్‌గా ఎంపికైంది. క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ స్పిన్‌సిస్టమ్, క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ విత్ అల్ట్రా – కోల్డ్ గ్యాసెస్, క్వాంటమ్ కోరిలేషన్స్... మొదలైన వాటికి సంబంధించి అదితి లెక్చర్స్, టాక్స్ ఆదరణ పొందాయి. బెనర్జీ, శ్రీజన్ ఘోష్, శైలాధిత్యలతో కలిసి 'స్ప్రెడింగ్ నాన్ లోకాల్టీ ఇన్ క్వాంటమ్ నెట్‌వర్క్స్', కవన్ మోదీ, అరుణ్ కుమార్, ఉజ్వల్ సేన్‌లతో కలిసి 'మాస్కింగ్ క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్ ఈజ్ ఇంపాజిబుల్...మొదలైన పుస్తకాలు రాసింది.

క్లాసులో పాఠం చెప్పినా, సెమినార్‌లో ఉపన్యాసం ఇచ్చినా, పుస్తకం రాసినా విషయాన్ని కమ్యూనికేట్ చేయడంలో తనదైన శైలిని ఎంచుకుంది. సంక్లిష్టమైన శాస్త్రీయ విషయాలను సులభంగా అర్థమయ్యేరీతిలో కమ్యూనికేట్ చేయడం ఆమె శైలి. 'క్వాంటమ్'పై ఆసక్తి చూపుతున్న ఈతరంలోని చాలామందికి మొదటగా గుర్తుకు వచ్చే పేరు అదితి సేన్. 'క్వాంటమ్' అనేది ఆమె ఇంటి పేరుగా మారింది.



సమన్వయం చేసుకుంటూ...

కెరీర్, ఫ్యామిలీలో ఏదో ఒక ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడంపైనే మహిళా శాస్త్రవేత్తల కెరీర్ కొనసాగుతుందా, ఆగిపోతుందా అన్నట్లుగా ఉంటుంది. అయితే కెరీర్, ఫ్యామిలీని సమన్వయం చేసుకుంటూ వెళితే సమస్యలు ఉండవు. ఒక బిడ్డకు తల్లి అయిన తరువాత తిరిగి పనిలో చేరి అద్భుతమైన శక్తి సామర్థ్యాలను చాటుకున్న మహిళా శాస్త్రవేత్తలు ఎంతోమంది ఉన్నారు.
– అదితి సేన్

ఆ చిరు లేత గానానికి నూరేళ్లు

(గాయకుడు తలత్ మెహమూద్ శత జయంతి నేడు)

జల్తే హై జిస్కే లియే...
ఆ పాట చిరుకెరటాల అలికిడిలా ఉండేది.
ఫిర్ వహీ షామ్.. వహీ గమ్...
ఆ గొంతు సాయం సంధ్యలో వీచే వీవెన వలే ఉండేది.
సీనే మే సులగ్‌తే హై అర్మాన్...
ఆ గానం పడగ్గది దీగూటిలో శిఖను కంపించే దీపంలా అనిపించేది.
తలత్ మెహమూద్.. గజల్ నవాబ్.
మృదుగాన చక్రవర్తి.
హిందీ సినిమా గోల్డెన్ ఎరాలో వెలిగిన త్రిమూర్తులు... రఫీ, ముఖేష్, తలత్‌లలో ఒకడు.
నేడు అతని శతజయంతి.


తలత్ మెహమూద్

భారతీయ సినిమా సంగీతంలో మెత్తని గొంతును ప్రవేశపెట్టి శ్రోతలను సమ్మోహితులను చేసిన తొలి గాయకుడు తలత్ మెహమూద్. అతడు గజల్ గానానికి మార్గదర్శకుడు. నిరుపమానమైన గజల్ గాయకుడు మెహదీహసన్‌కు కూడా తొలి దశలో తలత్ మెహమూదే స్ఫూర్తి. తలత్‌ది ఘనమైన గాన చరిత్ర. అందుకే అతని శతజయంతి సందర్భం గాన ప్రియులకు వేడుక.

1941–44 మధ్య కాలంలో 'తపన్ కుమార్' పేరుతో కలకత్తాలో బెంగాలీ పాటలు పాడాడు తలత్. 1945లో కలకత్తాలో నిర్మితమైన 'రాజలక్ష్మీ' హిందీ సినిమాలో నటుడు–గాయకుడుగా తలత్ తన మెదటి సినిమా పాట 'ఇస్ జగ్ సే కుఛ్ ఆస్ నహీన్' పాడాడు. 1951లో 'తరానా'లో పాడిన 'సీనేమే సులగ్‌తే హైన్ అర్‌మా' పాట తలత్ తొలి సినిమా హిట్ పాట. అంతకు ముందు 'ఆర్జూ'లోని 'ఏ దిల్ ముఝే ఏసీ జగ్‌హ లేచల్' పాటా, 'బాబుల్' లోని 'మేరా జీవన్ సాథీ బిఛడ్ గయా' చెప్పుకోతగ్గవి.

'సంగ్‌దిల్' సినిమాలో తలత్ పాడిన 'ఏ హవా.. ఏ రాత్... ఏ చాందినీ' మన దేశంలో వచ్చిన ఒక ప్రశస్తమైన పాటగా నిలిచి పోయింది. 'సంగ్‌దిల్' సినిమాలోనే 'కహాన్ హో కహాన్' అంటూ తలత్ మరో గొప్ప పాట పాడాడు. 'దాగ్'లో పాడిన 'ఏ మేరే దిల్ కహీన్ ఔర్ చల్' పాట దేశాన్ని ఒక ఊపు ఊపేసింది. తలత్ పాడిన 'బారాదరీ' సినిమాలోని 'తస్వీర్ బనాతా హూ', 'ఫుట్‌పాత్'లోని 'షామే గమ్ కీ కసమ్', 'ఠోకర్'లోని 'ఏ గమే దిల్ క్యా కరూన్', 'దిల్–ఎ–నాదాన్' సినిమాలోని 'జిందగీ దేనే వాలే సున్' పాటలూ, ఈ స్థాయి ఇంకొన్ని పాటలూ సినిమా గానంలో కాలాలు ప్రశంసించేవయ్యాయి. హిందీ సినిమా పాటల్లోనే పెద్ద పల్లవి పాట 'ఉస్నే కహా థా' సినిమాలోని 'ఆహా రిమ్ జిమ్ కే యే ప్యారే ప్యారే గీత్ లియే' తలత్ పాడాడు.

అప్పటి వరకూ దేశం వింటూ వచ్చిన సైగల్ గానాన్ని మరపిస్తూ తలత్ క్రూనింగ్ (లాలిత్యమైన గానం) ఒక్కసారిగా దేశ గాన విధానాన్ని మార్చేసింది. 1944లో తలత్ పాడిన 'తస్వీర్ తేరే దిల్ మేరా బెహ్‌లాన సకే గీ' గజల్ రికార్డ్ విడుదలయింది. విడుదలయిన నెల రోజుల్లోనే లక్షన్నరకు పైగా ప్రతులు అమ్ముడయింది. ఆ గజల్ గానం దేశ సినిమా, లలిత, గజల్ గాన పరిణామానికి, పరిణతికి, ప్రగతికి మార్గదర్శకమైంది. తలత్ 1941లో 'సబ్ దిన్ ఏక్ సమాన్ నహీన్ థా...' గజల్‌ను రికార్డ్‌పై విడుదల చేశారు. ఆ తరువాత 'గమ్ –ఎ–జిందగీ కా యారబ్ న మిలా కోఈ కినారా' (1947), 'సోయే హువే హేన్ చాంద్ ఔర్ తారేన్' (1947), 'దిల్ కీ దునియా బసా గయా' (1948) వంటి గజళ్లతో సాగుతూ 1950వ దశాబ్దిలో 'రోరో బీతా జీవన్ సారా', 'ఆగయీ ఫిర్ సే బహారేన్', 'చన్ద్ లమ్హేన్ తేరీ మెహఫిల్ మేన్' వంటి గజళ్లతో రాణించి రాజిల్లింది. బేగం అఖ్తర్ గజల్ ధోరణికి భిన్నంగా గజల్ గానం పరివర్తనమవడానికి తలత్ ముఖ్యకారణమయ్యాడు. అందుకే అతను 'గజల్ నవాబ్' అనిపించుకున్నాడు.

గైర్–ఫిల్మీ (సినిమా పాటలు కాని) గానంగా తలత్ కృష్ణ భజన్‌లు, దుర్గా ఆర్తి, నాత్‌లు, గీత్‌లు చక్కగానూ, గొప్పగానూ పాడాడు. 'నిప్పులాంటి మనిషి' సినిమాలోని 'స్నేహమే నా జీవితం స్నేహమేరా శాశ్వతం' పాట మనకు తెలిసిందే. ఈ పాట 'జంజీర్'లో మన్నాడే పాడిన 'యారీ హైన్ ఇమాన్ మేరా' పాటకు నకలు. ఆ హిందీ పాటకు కొంత మేరకు ఆధారం ముబారక్ బేగమ్‌తో కలిసి తలత్ పాడిన 'హమ్ సునాతే హైన్ మొహమ్మద్' అన్న నాత్. 'అమృత' సినిమాలో ఎ.ఆర్. రహ్మాన్ చేసిన 'ఏ దేవి వరము నీవు' పాట పల్లవి తలత్ పాడిన గజల్ 'రాతేన్ గుజర్ దీ హైన్'కు దగ్గరగా ఉంటుంది.

తలత్ మహ్మూద్ 1959లో విడుదలైన 'మనోరమ' తెలుగు సినిమాలో రమేష్ నాయుడు సంగీతంలో మూడు పాటలు 'అందాల సీమ సుధా నిలయం', 'గతి లేనివాణ్ణి గుడ్డివాణ్ణి', 'మరిచిపోయేవేమో ' పాడాడు. అంతకు ముందు తెలుగువారైన ఈమని శంకరశాస్త్రి సంగీతంలో 1951లో 'సంసార్' హిందీ సినిమాలో 'మిట్ నహీన్ సక్తా', 'యే సంసార్ యే సంసార్ ప్రీత్ భరా సంసార్' పాటలూ, 1952లో వచ్చిన 'మిస్టర్ సంపత్' సినిమాలో 'ఓ మృగనయనీ...', 'హే భగవాన్' పాటలూ పాడారు. హిందీలోకి డబ్ ఐన తెలుగు సినిమాలు 'పాతాళభైరవి', 'చండీరాణి' సినిమాలలో ఎన్.టి.రామారావుకు తలత్ పాడారు.

1964లో వచ్చిన 'జహాన్ ఆరా' సినిమాలోని 'ఫిర్ వోహీ షామ్...' పాట తరువాత తలత్ చెప్పుకోతగ్గ పాటలు పాడలేదు. అంతకు ముందు 1963లో 'రుస్తమ్ సొహరాబ్' సినిమాలో తలత్ 'మాజన్దరాన్ మాజన్దరాన్' అంటూ ఒక విశేషమైన పాట పాడాడు. తలత్ పాడిన చివరి గొప్ప సినిమా పాట అది. అన్నీ కలుపుకుని తలత్ మొత్తం 747 పాటలు పాడాడు. తలత్ 16 సినిమాల్లో నటించాడు. పలు పురస్కారాలతో పాటు 1992లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నాడు తలత్. 1924 ఫిబ్రవరి 24న పుట్టిన తలత్ 1998లో తది శ్వాస విడిచాడు.

తలత్ క్రూనింగ్‌ను దక్షిణ భారతదేశంలో పి.బి. శ్రీనివాస్ అర్థం చేసుకుని అందుకుని అమలు చేశారు. పి.బి. శ్రీనివాస్ నుండి అది కె.జె.ఏసుదాస్‌కు, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు, ఇతరులకూ చేరింది. మనదేశంలో క్రూనింగ్ ఉంది అంటే అది తలత్ మెహమూద్ వచ్చింది అన్నది చారిత్రికం.

1968లో అమెరికాలో జరిగిన ఒక టాక్ షోలో తలత్‌ను ప్రముఖ ఇంగ్లిష్ గాయకుడు ఫ్రాంక్ సినాట్రాతో పోల్చి 'ఫ్రాంక్ సినాట్రా ఆఫ్ ఇండియా' అని అన్నారు. ఇవాళ్టికీ దేశ వ్యాప్తంగా తలత్ పాటలు వినిపిస్తూనే ఉన్నాయి; ఎప్పటికీ మన దేశంలో తలత్ గానం వినిపిస్తూనే ఉంటుంది. ఒక మెత్తని పాటలా తలత్ ఈ మట్టిపై వీస్తూనే ఉంటాడు.

– రోచిష్మాన్

లైఫ్@360

నల్లగా నిగనిగలాడే ఒత్తైన కురులు, అందంగా మెరిసే చర్మం, దృఢమైన పళ్లు, ఎర్రటి పెదవులు, పొడవాటి గోళ్ల కోసం సౌందర్య సాధనాల మీదనే ఆధారపడుతుంటారు చాలామంది. అవేమీ చౌకగా లభించవు. బోలెడంత డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. పైగా ఆయా ఉత్పత్తుల్లో వాడే రసాయనాల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి.

ఆహారం... సౌందర్యం





చర్మాన్ని సహజంగా... ఆరోగ్యంగా... అందంగా తయారు చేసే కొన్ని ఆహారాలు ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎలాంటి ఇతర ఖర్చులు చేయాల్సిన అవసరమే లేదు. అవేంటో చూద్దాం.

చిలగడదుంప..
విటమిన్ ఎ పుష్కలంగా ఉండే చిలగడదుంప చర్మానికి వరం. ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ముడతలను తగ్గిస్తుంది, మెరుపునిస్తుంది.



చేపలు..
ఇవి జుట్టును ఒత్తుగా, మెరిసేలా చేయడం లో సహాయపడతాయి. అలాగే, చర్మాన్ని మృదువుగా, యవ్వనంగా ఉంచుతుంది. సాల్మన్, ట్యూనా, మాకేరెల్ వంటి చేపలలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి.



అవకాడో..
అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వు, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది,



గింజలు..
బాదం, వాల్నట్, చియా సీడ్స్, అవిసెల వంటి గింజ ధాన్యం విటమిన్ ఇ, జింక్, బయోటిన్‌కు మంచి మూలాధారాలు. ఇవి గోళ్లను దృఢంగా మార్చడంతోపాటు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి.



గుడ్లు..
ప్రోటీన్, బయోటిన్, విటమిన్ డి పుష్కలంగా ఉండే గుడ్లు జుట్టు, గోళ్లను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అలాగే, ఇవి చర్మానికి పోషణనిచ్చి ఆరోగ్యవంతంగా చేస్తాయి.



ఆకుకూరలు..
పాలకూర, మెంతికూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి ,కె పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యవంతం చేస్తాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి చర్మం మీద ముడతలను తగ్గిస్తాయి.



నీరు అధికంగా ఉండే ఆహారాలు..
పుచ్చ, దోస, టమోటా వంటి నీరు అధికంగా ఉండే కూరగాయల వల్ల చర్మం తేమగా... మృదువుగా ఉంటుంది



ఆయిస్టర్
జింక్ పుష్కలంగా ఉండే ఆయిస్టర్ గోళ్లను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో కూడా ప్రభావం చూపుతుంది.

అందంగా కనిపించడం కోసం రకరకాల సౌందర్య సాధనాలను కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని, డబ్బును పాడు చేసే బదులు ఆహారంతోనే అందంగా... ఆరోగ్యంగా మెరిసిపోవచ్చు. ఏమంటారు?



ఆరోగ్య యోగం

ప్రస్తుతం మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం లేదంటే అతిశయోక్తి కాదు. పని ఒత్తిడితో పాటు ఆర్థికపరమైన సమస్యలు తదితర ఇతర సమస్యల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే దైనందిన జీవితంలో రోజూ కొద్దిసేపయినా యోగా చేయాలంటున్నారు నిపుణులు. యోగాతో కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని చెపుతున్నారు. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం.

యోగా అంటే శారీరక వ్యాయామాలు, యోగాసనాలు మాత్రమే కాదు. మన మేధాశక్తి, ఆత్మశక్తి పెరగడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా యోగా చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు. యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో చూద్దాం.

యోగా అనేది ఒక శక్తిమంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధన. యోగా ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా వుండేట్లు చేస్తుంది. యోగా చేయడం వల్ల రక్తపోటు కూడా అదుపులో వుంటుంది. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుంది.

యోగా చేయడం వల్ల శరీరానికి నూతనోత్సాహం కలుగుతుంది. బలాన్ని పెంపొందించుకోవడానికి యోగా సహాయపడుతుంది. కీళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది యోగ.

యోగా చేయడం వల్ల శ్వాసకు సంబంధించిన సమస్యల నుంచి బయటపడవచ్చు. మానసిక ప్రశాంతత పొందడంలో యోగా ఎంతో సహాయపడుతుంది. ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో కోపం, ద్వేషం వంటి లక్షణాలు కనిపిస్తు ఉంటాయి. ఈ సమస్యలను తగ్గించడంలో యోగా ఎంతగానో సహకరిస్తుంది. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పొందవచ్చు.

యోగా వల్ల శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయి. దీంతో పనులను సులువుగా చేసుకోవచ్చు. ఎముకలు, కండరాలు దృఢంగా మారతాయి. నీరసం, బలహీనత వంటి సమస్యల బారి నుంచి సులభంగా బయట పడవచ్చు.

శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడంలో ఎంతో సహాయపడుతుంది. రకరకాల ఇతర పద్ధతులను అనుసరించడం కన్నా యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందుతుంది. ముఖ్యంగా పిల్లలకు చిన్న వయసు నుంచే యోగా చేయడం అలవాటు చేయడం వల్ల వారి పెరుగుదలకు ఎంతో మేలు చేస్తుందని యోగా నిపుణులు, గురువులు చెబుతున్నారు.



అధిక టీతో ఐరన్ లోపం



అలసిన శరీరాన్ని సేదతీర్చడంలోనూ, మనసును సాంత్వన పరచడంలోనూ టీని మించింది లేదని అందరూ అంటారు. అలాగని టీ ఎక్కువగా తాగడం అంత మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎక్కువసార్లు టీ తాగడం వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడుతుందంటున్నారు.

టీలో అధికంగా ఉండే టానిన్ ఐరన్ శోషణను నిరోధిస్తుంది. ఐరన్ లోపం వల్ల శరీరంలో బలహీనత, అలసట, నిద్రలేమి, అనేక ఇతర సమస్యలు పెరుగుతాయి. టీ లో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది విశ్రాంతి లేకపోవడం, నిద్ర లేకపోవడం, వికారం వంటి దుష్ప్రభావాలకు కారణమవుతుంది. జీర్ణ సమస్యలు ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల శరీరంలో జీర్ణ సమస్యలు వస్తాయి. ఇది గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇది జీర్ణశక్తిని ప్రభావితం చేస్తుంది. జీర్ణక్రియ మందగిస్తుంది. గుండెల్లో మంట ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల గుండెల్లో మంట పుడుతుంది. దీని కారణంగా ఆహార నాళంలో యాసిడ్ ఏర్పడి యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలతో పాటు పుల్లని తేన్పులు, వికారం కలుగుతాయి.

నిద్ర సమస్యలు...
కొంతమందికి రాత్రి నిద్రపోయే ముందు టీ తాగడం అలవాటు. అయితే ఇది వారి నిద్రపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. ఇది రాత్రిపూట తరచుగా మూత్రవిసర్జన సమస్యను కలిగిస్తుంది. రాత్రి పడుకునే ముందు టీ కి బదులు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం మంచిది.

పేగులపై దుష్ప్రభావం...
అధికంగా తాగే టీ మన పేగులపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. ఎక్కువగా టీ తీసుకునే వ్యక్తులు కెఫిన్, టానిన్‌ల కారణంగా ఆందోళన, ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు.

గర్భిణులకు స్పెషల్ జ్యూస్



సన్నగా తరిగిన అరకప్పు లేత పాలకూర, నాలుగు పైనాపిల్ ముక్కలు, పావుకప్పు అవకాడో, అరకప్పు నీళ్లు తీసుకుని జ్యూసర్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ జ్యూస్‌ను వడగట్టకుండా అలాగే తాగాలి. గర్భిణులకు ఈ స్మూతీ అన్ని రకాల పోషకాలను అందిస్తుంది.

100 ఇంగ్లండ్ జట్టుపై టెస్టుల్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా రవిచంద్రన్ అశ్విన్ గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఎనిమిదో బౌలర్‌గా నిలిచాడు. గతంలో షేన్ వార్న్, డెన్నిస్ లిల్లీ, ట్రంబెల్, గ్లెన్ మెక్‌గ్రాత్, నాథన్ లయన్ (ఆస్ట్రేలియా), ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక), కొట్నీ వాల్ష్ (వెస్టిండీస్) ఇంగ్లండ్‌పై 100 కంటే ఎక్కువ వికెట్లు పడగొట్టారు.



8 అరంగేట్రం టెస్టులో నోబాల్‌పై తొలి వికెట్ తీసి దానిని దక్కించు కోలేకపోయిన ఎనిమిదో బౌలర్‌గా ఆకాశ్ దీప్ నిలిచాడు. ఈ జాబితాలో లసిత్ మలింగ (శ్రీలంక), మైకేల్ బీర్ (ఆస్ట్రేలియా), బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్), మార్క్ వుడ్ (ఇంగ్లండ్), స్టువర్ట్ బిన్నీ (భారత్), టామ్ కరన్ (ఇంగ్లండ్), నసీమ్ షా (పాకిస్తాన్) కూడా ఉన్నారు.

313 టెస్టుల్లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన 313 ప్లేయర్‌గా ఆకాశ్ దీప్ నిలిచాడు. ఇంగ్లండ్‌తో ప్రస్తుత సిరీస్‌లోనే భారత్ నుంచి నలుగురు (రజత్ పటిదార్, ధ్రువ్ జురేల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్) అరంగేట్రం చేయడం విశేషం.

10 భారత్‌పై టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా జో రూట్ గుర్తింపు పొందాడు. రూట్ భారత్‌పై 10 సెంచరీలు సాధించాడు. ఈ జాబితాలో స్టీవ్ స్మిత్ (9–ఆస్ట్రేలియా), గ్యారీ సోబర్స్ (8–వెస్టిండీస్), వివియన్ రిచర్డ్స్ (8–వెస్టిండీస్), రికీ పాంటింగ్ (8–రికీ పాంటింగ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

31 టెస్టుల్లో రూట్ సెంచరీల సంఖ్య. టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో రూట్ తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. మరో రెండు సెంచరీలు చేస్తే ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన అలిస్టర్ కుక్ (33) రికార్డును రూట్ సమం చేస్తాడు.

ఆకాశ్ దెబ్బ కొట్టినా... ఇంగ్లండ్ 'రూట్' మారింది


క్రాలీ వికెట్ తీసిన ఆనందంలో ఆకాశ్ దీప్


జో రూట్ సెంచరీ అభివాదం

అరంగేట్ర బౌలర్ ఆకాశ్ దీప్ పేస్‌కు... అశ్విన్, జడేజా స్పిన్‌కు... లంచ్ లోపే ఇంగ్లండ్ కీలకమైన ఐదు వికెట్లు కోల్పోయింది . దాంతో టీ విరామం వరకు ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెర పడుతుందేమోననే సందేహం కలిగింది... కానీ అలా జరగలేదు. అనుభవజ్ఞుడైన జో రూట్ తన అసలు సిసలు ఆటతీరును ప్రదర్శించాడు... ఈ సిరీస్‌లో తమ జట్టు దూకుడైన 'బజ్‌బాల్' వ్యూహానికి భిన్నంగా 'రూట్' మార్చాడు... సంయమనంతో ఆడుతూ ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు... సహచరుడు ఫోక్స్ సహాయంతో రెండో సెషన్‌లో భారత బౌలర్లను కాచుకున్నాడు ...ఆ తర్వాత ఫోక్స్ వెనుదిరిగినా... రాబిన్సన్ అండగా నిలబడటంతో... రూట్ పట్టుదలతో ఆడుతూ వీరోచిత సెంచరీతో ఇంగ్లండ్ స్కోరును 300 దాటించాడు.

- జో రూట్ అజేయ సెంచరీ
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 302/7
- అరంగేట్రంలో ఆకట్టుకున్న ఆకాశ్ దీప్

రాంచీ: సిరీస్ గెలిచేందుకు భారత్... సమం చేసేందుకు ఇంగ్లండ్... ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య మొదలైన నాలుగో టెస్టు తొలిరోజు ఆట ఆసక్తికరంగా సాగింది. కొత్త పేసర్ ఆకాశ్ దీప్ (3/70) నిప్పులు చెరిగే బౌలింగ్ భారత్‌ను మురిపిస్తే... సీనియర్ బ్యాటర్ జో రూట్ (226 బంతుల్లో 106 బ్యాటింగ్; 9 ఫోర్లు) అజేయ శతకం ఇంగ్లండ్‌ను కుప్పకూలకుండా కాపాడింది. దీంతో పూర్తిగా ఎవరి పైచేయి లేకుండా తొలిరోజు ఆట సమఉజ్జీగా ముగిసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలీ (42 బంతుల్లో 42; 6 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో బెన్ ఫోక్స్ (126 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. ఆకాశ్ దీప్ 3 వికెట్లు తీయగా.. సిరాజ్‌కు 2 వికెట్లు దక్కాయి. స్పిన్నర్లు జడేజా, అశ్విన్ చెరో వికెట్ తీశారు.

'టాప్'లేపిన ఆకాశ్

ఈ సిరీస్‌లో భారత్ తరఫున నాలుగో ఆటగాడిగా అరంగేట్రం చేసిన ఆకాశ్ దీప్ తన పేస్‌తో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ ఐదో బంతికి క్రాలీని ఆకాశ్ దీప్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కానీ అది నోబాల్ కావడంతో ఆకాశ్ దీప్‌కు నిరాశ తప్పలేదు. ఆ తర్వాత క్రాలీ దూకుడు పెంచాడు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో క్రాలీ చెలరేగిపోయాడు. వరుసగా 4,4,4,6తో అదరగొట్టాడు. సాఫీగా సాగిపోతున్న ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ఆకాశ్ దీప్ దెబ్బ కొట్టాడు. పదో ఓవర్లో ఆకాశ్ రెండో బంతికి ఓపెనర్ డకెట్ (11)ను, నాలుగో బంతికి వన్‌డౌన్ బ్యాటర్ ఒలీ పోప్ (0)లను అవుట్ చేసి భారత శిబిరాన్ని సంబరంలో ముంచాడు. ఇదే జోరుతో తన మరుసటి ఓవర్లో (ఇన్నింగ్స్ 12వ) ఓపెనర్ క్రాలీని క్లీన్‌బౌల్డ్ చేశాడు. 47/0తో ఉన్న ఇంగ్లండ్ ఆకాశ్ దెబ్బకు 57/3 స్కోరు వద్ద టాపార్డర్‌ను కోల్పోయింది. ఈ దశలో జో రూట్‌కు జతయిన బెయిర్‌స్టో (35 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) భారత బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగాడు. దీంతో వన్డేను తలపించేలా 20వ ఓవర్లోనే ఇంగ్లండ్ స్కోరు 100కు చేరింది. రెండో సెషన్ ఆరంభంలో బెయిర్‌స్టోను అశ్విన్ ఎల్బీగా పంపాడు. అంపైర్ తోసిపుచ్చినా... రివ్యూకు వెళ్లడంతో బెయిర్‌స్టో వికెట్ దక్కింది. కాసేపటికే కెప్టెన్ స్టోక్స్ (3)ను జడేజా వికెట్ల ముందు దొరక బుచ్చుకున్నాడు. అక్కడే 112/5 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది.

అడ్డుకుని... ఆదుకున్నాడు

ఒక్క సెషన్‌లోనే 5 వికెట్లను కోల్పోయిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు వెటరన్ బ్యాటర్ రూట్ అంతా తానై నడిపించాడు. బెన్ ఫోక్స్ అండతో రెండో సెషన్‌లో పరుగులు పేర్చాడు... వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో 108 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఈ సెషనంతా భారత సీమర్లు, స్పిన్నర్లు ఎంతగా కష్టపడినా రూట్, ఫోక్స్ జోడీని మాత్రం విడగొట్టలేకపోయారు. రెండో సెషన్‌లో 86 పరుగులు చేసిన ఇంగ్లండ్ ఒక్క వికెట్‌ను సమర్పించుకోలేదు. ఆఖరి సెషన్లో ఎట్టకేలకు సిరాజ్ పేస్ పదును పెంచడంతో ఫోక్స్ ఆట ముగిసింది. ఆరో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికి హార్ట్‌లీ (13)ని సిరాజే అవుట్ చేయగా... రాబిన్సన్ (60 బంతుల్లో 31 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) అండతో రూట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు.

ఇంకో వికెట్ చిక్కేదే కానీ...

మూడో సెషన్లో అప్పటికే భారత జట్టు 3 రివ్యూలు అయిపోవడంతో రాబిన్సన్ బతికిపోయాడు. ఇన్నింగ్స్ 81వ ఓవర్లో జడేజా బౌలింగ్‌లో రాబిన్సన్ ఎల్బీడబ్ల్యూ అప్పీల్‌ను అంపైర్ ధర్మసేన తిరస్కరించాడు. టీవీ రీప్లేలో బంతి వికెట్లను తాకుతున్నట్లు తేలింది. కానీ భారత జట్టుకు డీఆర్ఎస్‌కు వెళ్లే అవకాశం లేకపోవడంతో రాబిన్సన్ బతికిపోయాడు.

ఇంత కష్టంలో అంత స్కోరు...

ఈ సిరీస్‌లో మూడు టెస్టుల్లో రూట్ అత్యధిక స్కోరు 29! కానీ ఈ మ్యాచ్ తన అనుభవాన్నంతా రంగరించి క్లాసిక్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఆరంభంలో 57/3తో కష్టాల్లో పడిన ఇంగ్లండ్ లంచ్ విరామానికే 112/5 స్కోరు వద్ద సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఇంకా రెండు సెషన్ల ఆటలో ఏ జట్టయినా ఆలౌట్ అయినా అవుతుంది. లేదంటే... కిందామీదా పడినా 200 నుంచి 240 పరుగులు చేయడానికి కష్టపడుతుంది. కానీ ఇన్నింగ్స్‌ను నడిపించిన రూట్ ఆతిథ్య బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని జట్టు స్కోరును ఒక్కరోజులోనే 300 పైచిలుకు చేర్చడం అతని అసాధారణ పోరాటానికి నిదర్శనం!

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (బి) ఆకాశ్ దీప్ 42; డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ దీప్ 11; ఒలీ పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆకాశ్ దీప్ 0; రూట్ (బ్యాటింగ్) 106; బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 38; స్టోక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 3; ఫోక్స్ (సి) జడేజా (బి) సిరాజ్ 47; హార్ట్‌లీ (బి) సిరాజ్ 13; రాబిన్సన్ (బ్యాటింగ్) 31; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 302.** **వికెట్ల పతనం:** 1–47, 2–47, 3–57, 4–109, 5–112, 6–225, 7–245. **బౌలింగ్:** సిరాజ్ 13–3–60–2, ఆకాశ్‌దీప్ 17–0–70–3, జడేజా 27–7–55–1, అశ్విన్ 22–1–83–1, కుల్దీప్ 10–3–21–0, యశస్వి 1–0–6–0.

తండ్రి వద్దన్నా... తనయుడు వినలేదు!

స్ఫూర్తిదాయకం... ఆకాశ్ దీప్ ప్రస్థానం






పిల్లలు ఏదైనా ఇష్టపడితే అందుకోసం కష్టపడే తల్లిదండ్రులుంటారు. కానీ ఆకాశ్ దీప్ స్టోరీ మాత్రం భిన్నమైంది. బీహార్‌లోని రోహ్తాస్ జిల్లా బడ్డి గ్రామానికి చెందిన ఆకాశ్ క్రికెట్‌ను ఇష్టపడేవాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఆకాశ్ తండ్రి రామ్‌జీ సింగ్ తన కుమారుడి ఇష్టాన్ని గట్టిగానే వ్యతిరేకించాడు. ఆకాశ్ తనకు క్రికెట్టే ప్రపంచమంటే... కన్నతండ్రి ఆ ప్రపంచం నుంచి బయటికి రమ్మన్నాడు. క్రికెటర్ కావడం తన కల అంటే... ఆ కల కనడం మానేయమన్నాడు. ఎలాగైనా ఆటగాడిని అవుతానంటే... వద్దే వద్దని ఖరాకండీగా చెప్పేశాడు. కానీ ఈ బిహారీ కుర్రాడు వినలేదు. తండ్రి మాటల్ని తలకెక్కించుకోలేదు. కల సాకారం కోసం... తన క్రికెట్ ప్రపంచం కోసం ఇంటి నుంచి బయటికొచ్చాడు. మొదట దుర్గాపూర్‌లో తెలిసినవారి సాయంతో అకాడమీలో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. తర్వాత కోల్‌కతా పయనమై తన పేస్‌కు పదును పెట్టాడు. కానీ విధి అతనికి మరో పరీక్ష పెట్టింది. అనారోగ్యంతో 2015లో అతని తండ్రి... ఆరు నెలల్లోపే అన్న కూడా చనిపోవడంతో మధ్యలో మూడేళ్లు కుటుంబభారం మోశాడు. కానీ క్రికెట్ పట్టుమాత్రం వీడలేదు. ఎట్టకేలకు అతని కలకు బెంగాల్ తొలి రూపమిస్తే అతని పేస్ ప్రతాపం టీమిండియాలో చోటిచ్చింది. కట్ చేస్తే... ఆకాశ్ దీప్ ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో అరంగేట్రం చేశాడు. భారత 313 టెస్టు క్రికెటర్‌గా అతనికి హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ క్యాప్ అందిచ్చాడు. అతని ఇష్టం... పడ్డ కష్టం తెలుసుకున్న ద్రవిడ్ జట్టు సభ్యులందరి మధ్య అతని ప్రయాణాన్ని వివరించి స్ఫూర్తినింపాడు. ఓ బిహారీ కుర్రాడు కోల్‌కతాలో అండర్–23 జట్టు సభ్యుడయ్యాడు. అనంతరం బెంగాల్ రంజీ ప్లేయర్‌గా దేశవాళీ క్రికెట్‌లో సత్తాచాటుకోవడంతో అటునుంచి టీమిండియాకు ఎంపికయ్యాడు. బుమ్రా విశ్రాంతితో రాంచీలో అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. తన మాతృమూర్తి, ఇద్దరు సోదరిల కళ్లముందు అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆకాశ్ దీప్ భావోద్వేగానికి గురయ్యాడు.

ముంబై ఇండియన్స్ శుభారంభం

- తొలి పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నాలుగు వికెట్లతో విజయం
- చివరి బంతికి నెగ్గిన డిఫెండింగ్ చాంప్
- ఘనంగా మొదలైన డబ్ల్యూపీఎల్



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌ను డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ విజయంతో మొదలు పెట్టింది. గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 4 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అలైస్ క్యాప్సీ (53 బంతుల్లో 75; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగగా... జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (25 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సివర్ బ్రంట్, అమేలియా కెర్ చెరో 2 వికెట్లు పడగొట్టగా... తొలిసారి డబ్ల్యూపీఎల్ మ్యాచ్ ఆడిన దక్షిణాఫ్రికా పేసర్ షబ్నిమ్ ఇస్మాయిల్ పొదుపుగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీసింది. అనంతరం ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. యస్తిక భాటియా (45 బంతుల్లో 57; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 55; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. ఆఖరి ఓవర్లో విజయానికి 12 పరుగులు అవసరమయ్యాయి. 4 బంతుల్లో 7 పరుగులు వచ్చాయి. ఐదో బంతికి హర్మన్ అవుటైనా...చివరి బంతి ముంబై విజయానికి 5 పరుగులు అవసరంకాగా.. సజన సిక్సర్‌గా మలిచి ముంబైను గెలిపించింది.

క్యాప్సీ అర్ధసెంచరీ...

షఫాలీ వర్మ (1) ఆరంభంలోనే వెనుదిరగ్గా... లానింగ్, జెమీమాలతో రెండు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పి క్యాప్సీ జట్టును ఆదుకుంది. 10 ఓవర్లలో జట్టు 65 పరుగులు చేయగా లానింగ్‌ను బ్రంట్ అవుట్ చేయడంతో 64 పరుగుల (51 బంతుల్లో) రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం హేలీ మాథ్యూస్ ఓవర్లలో 2 సిక్స్‌లు, ఫోర్ బాదిన క్యాప్సీ 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. క్యాప్సీతో పాటు క్రీజ్‌లో ఉన్నంత సేపు జెమీమా దూకుడుగా ఆడటంతో మూడో వికెట్‌కు 40 బంతుల్లోనే 74 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా...కెర్ వేసిన చివరి ఓవర్లో 3 ఫోర్లు కొట్టి మరిజాన్ కాప్ (16 నాటౌట్) కీలక పరుగులు జోడించింది.

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో రెండో బంతికే హేలీ మాథ్యూస్ (0) అవుట్ కాగా, అయితే కాప్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో సివర్ బ్రంట్ (19) ధాటిని ప్రదర్శించింది. మరో ఎండ్‌లో యస్తిక చక్కటి ఇన్నింగ్స్‌కు హర్మన్ అండగా నిలిచింది. శిఖా పాండే ఓవర్లో యస్తిక కొట్టిన 2 ఫోర్లు, 2 సిక్స్‌లు హైలైట్‌గా నిలిచాయి. రాధ బౌలింగ్‌తో భారీ సిక్స్‌తో 35 బంతుల్లో యస్తిక హాఫ్ సెంచరీని అందుకుంది. యస్తిక, హర్మన్ రెండో వికెట్‌కు 56 పరుగులు జత చేసిన తర్వాత అరుంధతి ఈ జోడీని విడదీసింది. అయితే హర్మన్, అమేలియా కెర్ (18 బంతుల్లో 24; 3 ఫోర్లు) దూకుడైన భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. చివర్లో కొంత ఉత్కంఠ ఎదురైనా...ముంబై గెలుపు తీరం చేరింది.

ఆటా మాటా...

తొలి మ్యాచ్‌కు ముందు బాలీవుడ్ స్టార్ల ప్రదర్శనతో డబ్ల్యూపీఎల్ అట్టహాసంగా మొదలైంది. కార్తీక్ ఆర్యన్, టైగర్ ష్రాఫ్, షాహిద్ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా వేర్వేరు పాటలకు డ్యాన్స్‌లు చేసి అలరించారు. అనంతరం షారుఖ్ ఖాన్ ఐదుగురు కెప్టెన్లను పరిచయం చేయగా... వారంతా ప్రత్యేక రథాల్లో వేదిక వద్దకు వచ్చి ట్రోఫీని ఆవిష్కరించారు. **నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది.**

స్వీట్ 36...

హైదరాబాదీ వెటరన్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా పునరాగమనం

- డబ్ల్యూపీఎల్‌తో మళ్లీ వెలుగులోకి

అంతర్జాతీయ మ్యాచ్ ఆడి దశాబ్ద కాలం గడిచిన తర్వాత ఒక ప్లేయర్‌ను క్రీడా ప్రపంచం, అభిమానులు గుర్తుంచుకోవడం దాదాపు అసాధ్యం... ఇక మహిళా క్రికెటర్లకు మన వద్ద దక్కే గుర్తింపును బట్టి చూస్తే ఇంకా కష్టం... స్వయంగా ఆ ప్లేయరే ఆటను మరచిపోయి ఇక తన పని ముగిసినట్లే భావించి అజ్ఞాతంలోకి వెళ్లిపోతారు... కానీ 10 సంవత్సరాల విరామం తర్వాత కూడా ఒక పెద్ద టోర్నీలో మళ్లీ తెరపైకి రావచ్చని ఒక ప్లేయర్ నిరూపించింది. ఆమె పేరే గౌహర్ సుల్తానా. హైదరాబాద్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్. 2014లో భారత్‌కు ఆఖరిసారిగా ప్రాతినిధ్యం వహించిన గౌహర్ ఇప్పుడు 2024 డబ్ల్యూపీఎల్‌లో మళ్లీ కనిపించబోతోంది. వేలంలో యూపీ వారియర్స్ జట్టు సొంతం చేసుకున్న గౌహర్ 36 ఏళ్ల వయసులో తనలో ఇంకా క్రికెట్ మిగిలి ఉందని నిరూపించేందుకు సిద్ధమైంది.





మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తాజా సీజన్‌లో ఆడుతున్న వారిలో 2010కు ముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ప్లేయర్లు ఇద్దరే ఉన్నారు. 2009లో హర్మన్‌ప్రీత్ కౌర్ తన తొలి మ్యాచ్ ఆడితే అంతకుముందు ఏడాదే 2008లో గౌహర్ సుల్తానా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2008 నుంచి 2014 మధ్యలో గౌహర్ భారత్ తరఫున 50 వన్డేలు, 37 టి20లు ఆడి మొత్తం 95 వికెట్లు పడగొట్టింది. చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో ఆ సమయంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ ఆరేళ్ల కాలంలో వన్డేల్లో భారత బెస్ట్ బౌలర్‌గా (66 వికెట్లు) కొనసాగింది. రెండు వన్డే ప్రపంచకప్‌లలో ఆడింది కూడా. తన చివరి 2 వన్డేల్లో నాలుగేసి వికెట్లు చొప్పున తీసినా అనూహ్యంగా ఆమెపై సెలక్టర్లు వేటు వేశారు. అప్పుడు గౌహర్ వయసు 26 ఏళ్లు. కారణాలేమిటో తెలియకపోయినా మళ్లీ భారత జట్టు కోసం ఆమె పేరును పరిశీలించనేలేదు.

సైకాలజిస్ట్ సహాయంతో...

'సాధారణంగా భారత్‌లో మహిళా ప్లేయర్లకు 26–27 ఏళ్లు వస్తే వారిని ఇక వారి వయసు అయిపోయిందని, ఆటకు పనికి రారని భావిస్తారు. ఇక 30 తర్వాత అయితే బరువు పెరుగుతుంది. ఎవరూ పట్టించుకోరు. కానీ నా ఫిట్‌నెస్ విషయంలో రాజీ పడరాదని భావించాను. అందుకే చాలా కష్టపడ్డాను' అని గౌహర్ చెప్పింది. జాతీయ జట్టుకు దూరమైన తర్వాత ఆమె ఆగిపోలేదు. గత పదేళ్లలో దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్, పుదుచ్చేరి, బెంగాల్, రైల్వేస్ జట్లకు ఆడుతూ వచ్చింది. అయితే కొత్త అమ్మాయిలతో పోలిస్తే తాను బాగా ఆడలేక వెనుకబడిపోతున్నానని భావించి తనపై తనకే అనుమానం వేసింది. ఇది మానసికంగా ఆమె ఆరోగ్యంపై ప్రభావం చూపించింది. ఇలాంటి స్థితిలో మాజీ క్రికెటర్, భారత అండర్–19 జట్టు కోచ్ నూషీన్ అల్ ఖదీర్ తగిన రీతిలో అండగా నిలిచింది. భారత జట్టులో గౌహర్‌తో కలిసి ఆడిన నూషీన్... సైకాలజిస్ట్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించడంతో పరిస్థితి మెరుగైంది.

పట్టుదలగా నిలిచి...

గౌహర్ తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన రోజులతో పోలిస్తే మహిళా క్రికెట్ ఎంతో మారింది. వేగంలో, వ్యూహాల్లో, ఆదరణలో అంతా మారిపోయింది. అయితే చికిత్స తర్వాత దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా బౌలింగ్ చేస్తుండటంతో గౌహర్‌లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గత రెండేళ్లలో వరుసగా వికెట్లు పడగొట్టడంలో కూడా సఫలమైంది. దాంతో 2023 డబ్ల్యూపీఎల్ వేలం కోసం తన పేరును నమోదు చేసుకుంది. కానీ సహజంగానే ఈతరం అమ్మాయిల గురించి ఆలోచించే ఫ్రాంచైజీలు ఆమెను పట్టించుకోలేదు. ఈసారి కూడా సందేహంగానే అనిపించింది. కానీ ఎట్టకేలకు ఆ అవకాశం వచ్చింది. 36 ఏళ్ల వయసులో తాను పోటీ క్రికెట్ ఆడగలనని నమ్మకం వల్లే ఈ పునరాగమనం సాధ్యమైంది. 30 ఏళ్లు దాటిన తర్వాత ఒక సీనియర్ ప్లేయర్ ఎన్నో ప్రతికూలతలను దాటి దేశవాళీ క్రికెట్‌ను నమ్ముకొని ముందుకు సాగడం అసాధారణం. గత పదేళ్లు ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు గౌహర్ వేసే ప్రతీ బంతిపై అందరి దృష్టి ఉంటుంది. ఈ ఇన్నింగ్స్‌లో ఆమె అదృష్టం ఎలా ఉంటుందనేది ఆసక్తికరం.

– సాక్షి క్రీడా విభాగం

బంతితో మెరిసిన శశికాంత్, నితీశ్

మధ్యప్రదేశ్ 234/9 • రంజీ క్వార్టర్ ఫైనల్






ఇండోర్: భారీ స్కోరు దిశగా సాగుతోన్న మధ్యప్రదేశ్ జట్టును తమ మీడియం పేస్ బౌలింగ్‌తో ఆంధ్ర బౌలర్లు శశికాంత్ (4/37), నితీశ్ కుమార్ రెడ్డి (3/50) కట్టడి చేశారు. శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మధ్యప్రదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 234 పరుగులు సాధించింది. పచ్చికతో కూడిన పిచ్‌పై ఓపెనర్లు యశ్ దూబే (133 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్), హిమాన్షు మంత్రి (97 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 123 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే ఇన్నింగ్స్ 37వ ఓవర్లో హిమాన్షును శశికాంత్ అవుట్ చేయడంతో మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్ పతనం మొదలైంది. 36 పరుగుల తేడాలో మధ్యప్రదేశ్ 7 వికెట్లు కోల్పోయింది. దాంతో 123/0తో పటిష్టంగా కనిపించిన మధ్యప్రదేశ్ 159/7తో కష్టాల్లో పడింది. ఈ దశలో సారాంశ్ జైన్ (108 బంతుల్లో 41 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), కుమార్ కార్తికేయ (79 బంతుల్లో 29; 2 ఫోర్లు) ఎనిమిదో వికెట్‌కు 51 పరుగులు జోడించి మధ్యప్రదేశ్ స్కోరును 200 దాటించారు. కార్తికేయను అవుట్ చేసి శశికాంత్ ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టగా... అవేశ్ ఖాన్‌ను గిరినాథ్ రెడ్డి రనౌట్ చేయడంతో మధ్యప్రదేశ్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది.

ఆసీస్‌దే టి20 సిరీస్

రెండో మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ ఓటమి



ఆక్లాండ్: బ్యాటర్ల వైఫల్యంతో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ ఓటమి పాలైంది. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 2–0తో దక్కించుకుంది. శుక్రవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 72 పరుగుల తేడాతో గెలిచింది. 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 17 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా (4/34) న్యూజిలాండ్‌ను దెబ్బ తీశాడు. గ్లెన్ ఫిలిప్స్ (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకుముందు ఆస్ట్రేలియా 19.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. హెడ్ (22 బంతుల్లో 45; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కమిన్స్ (22 బంతుల్లో 28; 5 ఫోర్లు) రాణించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 15	73,143
నిఫ్టీ ▽ 5	22,213

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,039	▽	1
డోజోన్స్	39,156	△	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,706	▽	22
డాక్స్	17,419	△	49
షాంఘై	3,005	△	17
నికాయ్	39,099	△	836

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	61,300
బంగారం (22 క్యారెట్)	58,380
వెండి (కేజీ)	76,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.31	84.06
£	బ్రిటన్ పౌండ్	102.90	107.47
€	యూరో	87.78	90.86
¥	జపాన్ ఎన్ (100)	45.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.35	56.06
S$	సింగపూర్ డాలర్	59.59	63.82
SAR	సౌదీ రియాల్	21.21	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	21.69	23.47
¥	చైనా యువాన్	10.39	12.39

'పేటీఎం' కస్టమర్లకు సాయం చేయండి



- వేరే బ్యాంకులకు మార్చే అంశం పరిశీలించండి
- ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచన

ముంబై: యూపీఐ హ్యాండిల్ '@పేటీఎం'ను ఉపయోగిస్తున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) కస్టమర్లను 4–5 వేరే బ్యాంకులకు మార్చే అవకాశాలను పరిశీలించాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ)కి ఆర్‌బీఐ సూచించింది. తద్వారా చెల్లింపుల వ్యవస్థలో అంతరాయం కలగకుండా చూడాలని, కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా సహాయం చేయాలని పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనకు గాను మార్చి 15 నుంచి దాదాపు అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలంటూ పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సంస్థ కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. పీపీబీఎల్ వెబ్‌సైట్ ప్రకారం 30 కోట్ల వాలెట్లు, 3 కోట్ల మంది బ్యాంకు కస్టమర్లు ఉన్నారు. దేశీయంగా రిటైల్ చెల్లింపులు, సెటిల్మెంట్ వ్యవస్థను ఎన్‌పీసీఐ నిర్వహిస్తోంది. వేరే బ్యాంకులకు '@పేటీఎం' హ్యాండిల్‌ను మైగ్రేట్ చేసే క్రమంలో పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లుగా (పీఎస్‌పీ) 4–5 బ్యాంకులను ఎన్‌పీసీఐ ఎంపిక చేయొచ్చని సూచించింది. తద్వారా ఒకే బ్యాంకుపై ఆధారపడితే తలెత్తే రిస్కులు తగ్గుతాయని తెలిపింది. '@ పేటీఎం' హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న కస్టమర్లు, వ్యాపారుల హ్యాండిల్స్‌కు మాత్రమే మైగ్రేషన్ వర్తిస్తుందని, వేరే యూపీఐ అడ్రస్‌లు ఉన్నవారికి అవసరం లేదని పేర్కొంది. పీపీబీఎల్‌లో ఖాతాలు ఉన్న వారు మార్చి 15లోగా వేరే బ్యాంకులకు మారేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మరోసారి సూచించింది.

ఐఐఎస్‌సీతో నోకియా జట్టు

6జీ టెక్నాలజీపై పరిశోధనలు



న్యూఢిల్లీ: భారత్‌లో 6జీ టెక్నాలజీలు, వాటిని వినియోగించుకునేందుకు గల అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)తో నోకియా చేతులు కలిపింది. బెంగళూరులో తాము కొత్తగా ప్రారంభించిన 6జీ ల్యాబ్‌లో ఈ పరిశోధనలు సాగనున్నట్లు నోకియా వివరించింది.

కొటక్‌లో జ్యూరిచ్‌కు భారీ వాటా



70% కొనుగోలుకి రెడీ

న్యూఢిల్లీ: కొటక్ మహీంద్రా సాధారణ బీమా సంస్థలో ముందుగా (నవంబర్ నాటి) అనుకున్న 51 శాతానికి బదులుగా జ్యూరిచ్ ఇన్సూరెన్స్ కంపెనీ 70% వాటాను కొనుగోలు చేయనుంది. కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఈ విషయాన్ని తెలియజేసింది. ఇందుకు రూ. 5,560 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	588–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
23-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

రికార్డు గరిష్టాల నుంచి నిఫ్టీ వెనక్కి

స్వల్ప నష్టాలతో ముగింపు



ముంబై: ట్రేడింగ్‌లో లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆరంభంలోనే నిఫ్టీ 80 పాయింట్లు పెరిగి 22,297 వద్ద వరుసగా అయిదో రోజూ జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో ఆరంభ లాభాలు కోల్పోయాయి. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టపోయి 22,213 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 392 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 15 పాయింట్ల స్వల్ప నష్టంతో 73,143 వద్ద నిలిచింది.

రూ. 2 లక్షల కోట్ల పైకి జియో ఫైనాన్స్ మార్కెట్ క్యాప్



జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్లను అధిగమించింది. ట్రేడింగ్‌లో 14.50 శాతం పెరిగి రూ.347 లతో జీవిత కాల గరిష్ట స్థాయిని తాకింది. చివరికి పదిశాతం లాభంతో రూ.334 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2.12 లక్షల కోట్లు నమోదైంది.

ఫోన్ డిస్‌ప్లేపై కాలర్ పేరు



ట్రాయ్ సిఫారసు

న్యూఢిల్లీ: కొత్త నంబర్ నుంచి కాల్ వస్తుంటే ఎవరు చేస్తున్నారు? అనే సందేహం వస్తుంటుంది. ఆ సందేహానికి చెక్ పెడుతూ కాల్ చేస్తున్న వారి పేరు ఫోన్ డిస్‌ప్లేపై కనిపించే ఫీచర్ త్వరలో సాకారం కానుంది. టెలికం నెట్‌వర్క్‌లో 'కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ సప్లిమెంటరీ సర్వీస్'(సీఎన్‌ఏపీ)ను ప్రవేశపెట్టాలంటూ టెలికం రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ సిఫారసు చేసింది. సిఫార్సు అమలైతే కస్టమర్ అభ్యర్థన మేరకు టెలికం కంపెనీలు ఈ సేవను అందించాల్సి ఉంటుంది. స్పామ్, మోసపూరిత కాల్స్‌కు దీనితో చెక్ పెట్టొచ్చన్నది ట్రాయ్ ఉద్దేశ్యంగా ఉంది.

ప్రమోషన్లు .. ఇంక్రిమెంట్లు..

గ్రహాలేం చెబుతున్నాయ్..

జ్యోతిష్యానికి పెరుగుతున్న డిమాండ్ • ఆన్‌లైన్ ఆస్ట్రాలజీ పోర్టల్స్‌ను ఆశ్రయిస్తున్న యువత

పది రెట్లు పెరిగిన ఆస్ట్రోయోగి యూజర్లు • ఆస్ట్రోటాక్, గణేషాస్పీక్స్ ఆదాయాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: సర్వత్రా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఉద్యోగాల్లో మార్పులు ఉంటాయా, ఇంక్రిమెంట్లు పడతాయా వంటి అనేకానేక సందేహాలు చాలామంది ఉద్యోగులను వెంటాడుతున్నాయి. తమ భవిష్యత్తు గురించి గ్రహాలేం చెబుతున్నాయో తెలుసుకోవాలనే ఆరాటం కొద్దీ ఆన్‌లైన్ జ్యోతిష్యం పోర్టల్స్‌ను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారిలో యువ ఉద్యోగులే కాకుండా ఔత్సాహిక వ్యాపారవేత్తలు కూడా ఉండటం గమనార్హం. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, కెరియర్‌లో పురోగతి, ఉద్యోగంలో మార్పులు వంటి అంశాలపై ఉద్యోగులు ఆరాటపడుతుండగా, స్టార్టప్ వ్యవస్థాపకులు తమ నిధుల సమీకరణ యత్నాలు సక్రమంగా సాగుతాయా లేదా, ఇతర వ్యవస్థాపకులతో సంబంధాలు బాగుంటాయా లేదా అనే విషయాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆన్‌లైన్ ఆస్ట్రాలజీ పోర్టల్స్‌కి డిమాండ్ పెరుగుతోంది. కెరియర్, బిజినెస్ గురించి తెలుసుకునేందుకు డిజిటల్ ఆస్ట్రాలజీ ప్లాట్‌ఫాం గణేషాస్పీక్స్‌డాట్‌కామ్‌కి యువ ప్రొఫెషనల్స్, ఎంట్రప్రెన్యూర్ల నుంచి వచ్చే కన్సల్టేషన్ల అభ్యర్థనలు పది రెట్లు పెరిగాయి. వారిలో చాలా మంది 23–35 ఏళ్ల మధ్య వారే కావడం విశేషం. ఇక ఆస్ట్రోయోగి ప్లాట్‌ఫాంపై యూజర్ల సంఖ్య .. కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 10 రెట్లు పెరిగింది. ఆస్ట్రోటాక్, ఆస్ట్రోయోగి వంటి ప్లాట్‌ఫాంలు అందించే మొత్తం కన్సల్టేషన్‌లలో సుమారు 30 శాతం కన్సల్టేషన్లు .. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, ఉద్యోగాల్లో కోతల భయాలు మొదలైన వాటి గురించే ఉంటున్నాయి.

రూ. 10 నుంచి కన్సల్టేషన్..

జ్యోతిష్యుల అనుభవాన్ని బట్టి కన్సల్టేషన్‌కు వసూలు చేసే చార్జీలు ఉంటున్నాయి. నిమిషానికి రూ. 10 నుంచి మొదలుపెడితే రూ. 200 వరకు కూడా ఇవి ఉంటున్నాయి. జ్యోతిష్యుల్లో పక్కాగా జ్యోతిష్యం నేర్చుకున్నవారే కాకుండా ఇంజనీర్లు, ఎంటెక్, సీఏలు చేసిన వారు కూడా ఉంటున్నారు. సోషల్ మీడియా వినియోగం అత్యధికంగా ఉండే నగరాల్లోని మొత్తం ఆన్‌లైన్ ఆస్ట్రాలజీ యూజర్లలో 60 శాతం వాటా జనరేషన్ జెడ్ యువతదే ఉండటం ప్రస్తావించతగ్గ అంశమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. వ్యాపారాల విషయంలో అనిశ్చితి నెలకొన్న తరుణంలో చిన్న పట్టణాలు మొదలుకుని మెట్రో నగరాల వరకు అన్ని చోట్లా యువ యూజర్ల నుంచి దాదాపు ఒకే తరహా సందేహాలకు కన్సల్టేషన్ అభ్యర్థనలు వస్తున్నాయని పేర్కొన్నాయి. ఆస్ట్రో యూజర్లలో ఎక్కువ శాతం మంది ఢిల్లీ, ముంబై, బెంగళూరు, లక్నో, జైపూర్, చండీగఢ్, లూధియానా వంటి పెద్ద నగరాల నుంచి ఉంటున్నట్లు వివరించాయి.



పెరుగుతున్న యూజర్ల సంఖ్యకు అనుగుణంగా ఆస్ట్రో పోర్టల్స్ ఆదాయాలు కూడా జోరుగా ఉంటున్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో ఆస్ట్రోటాక్ ఆదాయం రూ. 65 కోట్లుగా ఉండగా 2023 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 282 కోట్లకు పెరిగింది. లాభాలు రూ. 11.2 కోట్ల నుంచి రూ. 27 కోట్లకు చేరాయి. యూజర్ల సంఖ్య 25 లక్షల నుంచి ఇప్పటివరకు 1.9 కోట్లకు ఎగిసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 630 కోట్లకు, లాభం రూ. 130 కోట్లకు చేరగలదని ఆస్ట్రోటాక్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లకు కూడా విస్తరించాలనే యోచనలో కంపెనీ ఉంది. ఇందులో భాగంగా ఇతర సంస్థలను కొనుగోలు చేయడం, కొత్త విభాగాలను ప్రారంభించడం, సీనియర్ల హోదాలో నియామకాలు చేపట్టడం మొదలైన వాటిపై కసరత్తు చేస్తోంది. మరోవైపు, గణేషాస్పీక్స్ పోర్టల్‌ను తీసుకుంటే 2022 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 58 శాతం పెరిగింది.

ఏటా రూ. 1,000 కోట్ల పెట్టుబడులు

థర్మాక్స్ ఎండీ ఆశీష్ భండారీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే మూడేళ్లలో కార్యకలాపాల విస్తరణపై ఏటా రూ. 500–1,000 కోట్ల మేర పెట్టుబడి వ్యయాలు చేయనున్నట్లు పర్యావరణహిత శక్తికి సంబంధించిన సొల్యూషన్స్ అందించే థర్మాక్స్ లిమిటెడ్ ఎండీ ఆశీష్ భండారీ తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్, బయో–సీఎన్‌జీ వంటి పర్యావరణ అనుకూల విద్యుత్ విధానాల వైపు మళ్లడంలో కంపెనీలకు సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణలో ఫార్మా, ఫుడ్ అండ్ బేవరేజెస్ తదితర రంగాల సంస్థలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు వివరించారు. వివిధ ఉత్పత్తుల తయారీ కోసం తమ 9 అధునాతన ప్లాంట్లు ఉన్నాయని సంస్థ ఉత్పత్తులు, కార్యకలాపాలపై అవగాహన పెంచేందుకు శుక్రవారమిక్కడ నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంగా భండారీ పేర్కొన్నారు. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, తమిళనాడులో తమకు ప్లాంట్లు ఉన్నట్లు తెలిపారు.

రూ. 160 కోట్ల రుణాలపై 'ద్వార ఈ–రిజిస్ట్రీ' దృష్టి




తారకేశ్వర్ గంటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్రి ఫిన్‌టెక్ సంస్థ 'ద్వార ఈ–రిజిస్ట్రీ' రైతులకు వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 160 కోట్ల రుణ వితరణను లక్ష్యంగా పెట్టుకుంది. రెండేళ్ల క్రితం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత నుంచి ఇప్పటి వరకు ఏడు వేల మంది పైచిలుకు రైతులకు దాదాపు రూ. 59 కోట్లు అందించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు తారకేశ్వర్ గంటా తెలిపారు. రైతు రుణ అవసరాలకు సంబంధించి ఆరు బ్యాంకులతో భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పారు.

సినిమా

మేలో ఇండియన్ 2?



• కమల్ హాసన్

కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇండియన్ 2' ఈ ఏడాది మేలో విడుదల కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను కూడా స్టార్ట్ చేశారట మేకర్స్. త్వరలోనే 'ఇండియన్ 2' సినిమా రిలీజ్ గురించిన అధికారిక ప్రకటన కూడా రానుందని కోలీవుడ్ బోగట్టా. కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన సూపర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2'(తెలుగులో 'భారతీయుడు 2') రూపొందుతోంది. 'ఇండియన్' సినిమాకు దర్శకత్వం వహించిన శంకరే 'ఇండియన్ 2'ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా, సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రలు పోషించారు. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ నిర్మించిన 'ఇండియన్ 2' కి అనిరుధ్ స్వరకర్త.



• వెంకటేష్



• త్రిష

టార్గెట్ ఫిక్స్!



• రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఐఏఎస్ ఆఫీసర్ రామ్‌నందన్ పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్నారని తెలిసింది. ఇటీవల 'గేమ్‌చేంజర్' సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'కేజీఎఫ్' ఫేమ్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్బు, అరివు డిజైన్ చేసిన ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణలో రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటుగా, రామ్‌చరణ్, నవీన్‌చంద్ర, మరికొందరు కీలక పాత్రధారులపై టాకీపార్టు చిత్రీకరణ కూడా జరగనుంది. కాగా ఈ సినిమా చిత్రీకరణను జులైలోపు పూర్తి చేయాలని చిత్రయూనిట్ టార్గెట్ పెట్టుకుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంజలి, శ్రీకాంత్, జయరాం, సునీల్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'గేమ్‌చేంజర్' డిసెంబరులో విడుదల కానుందనే ప్రచారం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జరుగుతోంది.

ఆలియా సాహసం



• ఆలియా భట్, వేదంగ్ రైనా

'జిగ్రా' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశారు హీరోయిన్ ఆలియాభట్. అలాగే ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబరు 27న రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించి ఆన్ లొకేషన్ ఫోటోలను షేర్ చేశారామె. ఆలియాభట్, వేదంగ్ రైనా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'జిగ్రా'. హిందీలో 'మౌనిక ఓ మై డార్లింగ్', 'పెడ్లర్స్' వంటి సినిమాలు తీసిన వాసన్ బాల 'జిగ్రా' కి దర్శకుడు. కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, ఆలియాభట్ ఈ సినిమాను నిర్మించారు. తన సోదరుడి రక్షణ కోసం ఎలాంటి సాహసానికైనా వెనకాడని ఓ అమ్మాయి కథే ఈ చిత్రం అని బాలీవుడ్ టాక్. ఇదిలా ఉంటే.. 'జిగ్రా' కాకుండా సంజయ్ లీలా భన్సాలీ డైరెక్షన్‌లో 'లవ్ అండ్ వార్', ఆదిత్యాచోప్రా నిర్మాణంలో ఓ స్పై థ్రిల్లర్, 'బ్రహ్మాస్త్రం' ఫ్రాంచైజీతో బిజీగా ఉన్నారు ఆలియాభట్.

హీరో వెంకటేశ్, హీరోయిన్ త్రిష నాలుగోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. వీరిద్దరూ గతంలో 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' (2007), 'నమో వెంకటేశ'(2010), 'బాడీగార్డ్'(2012) వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ హిట్ జోడీ ఇప్పుడు నాలుగోసారి కలిసి నటించేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ మూవీకి త్రిష గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. వెంకటేశ్, వరుణ్ తేజ్‌లతో 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' వంటి సినిమాలు తీసి, హిట్ అందుకున్నారు అనిల్ రావిపూడి. ఈ ఫ్రాంచైజీలో 'ఎఫ్ 4' సినిమా ఉంటుందని 'ఎఫ్ 3' క్లైమాక్స్‌లో హింట్ ఇచ్చింది చిత్రయూనిట్.

జోడీ కుదిరిందా?

'ఎఫ్ 2, ఎఫ్ 3' సినిమాలు నిర్మించిన 'దిల్' రాజే తాజాగా వెంకీ–అనిల్ కాంబినేషన్‌లో మూడో సినిమా నిర్మించనున్నారట. ఈ మూవీలో హీరోయిన్‌గా త్రిషని ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. అంటే.. దాదాపు పుష్కర కాలం తర్వాత వెంకటేశ్–త్రిష మరోసారి జోడీగా నటించనున్నారన్నమాట. పూర్తి గ్రామీణ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. వెంకటేశ్‌తో అనిల్ రావిపూడి తెరకెక్కించేది 'ఎఫ్ 4' సినిమానా? లేక మరొక చిత్రమా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విమానంలో చోరీ



• టబు • కృతీ సనన్ • కరీనా కపూర్

టబు, కరీనా కపూర్, కృతీసనన్ ప్రధాన పాత్రల్లో, దిల్జీత్ సింగ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ది క్రూ'. కార్పొరేట్ ఏవియేషన్ బిజినెస్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో టబు, కరీనా, కృతీ ఎయిర్‌హోస్టెస్‌గా నటించారు. ఓ విమానం హైజాకింగ్, దొంగతనం నేపథ్యంలో 'ది క్రూ' సినిమా కథనం ఉంటుందని బీ టౌన్ టాక్. ఇక బాలీవుడ్‌లో 'లూట్‌కేస్' సినిమా తీసిన రాజేష్ కృష్ణన్ ఈ సినిమాకు దర్శకుడు. 'వీరే ది వెడ్డింగ్ (2018)', 'థ్యాంక్యూ ఫర్ కమింగ్(2023)' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ నిర్మించిన రేఖా కపూర్, ఏక్తా కపూర్ 'ది క్రూ' సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమాలోని ప్రధాన తారాగణం అయిన టబు, కరీనా, కృతీసనన్‌ల కొత్త పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. తొలుత ఈ సినిమాను మార్చి 22న రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ తర్వాత మార్చి 29కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

మార్చిలో తంత్ర



• ధనుష్ రఘుముద్రి, అనన్య నాగళ్ల

అనన్య నాగళ్ల లీడ్ రోల్‌లో నటించిన 'తంత్ర' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. మార్చిలో ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహించిన ఈ మూవీలో ధనుష్ రఘుముద్రి, సలోని, 'టెంపర్' వంశీ, మీసాల లక్ష్మణ్, కుశాలిని కీలక పాత్రల్లో నటించారు. ఫస్ట్ కాపీ మూవీస్, బి ద వే ఫిల్మ్స్, వైజాగ్ ఫిల్మ్ ఫ్యాక్టరీపై నరేష్ బాబు పి, రవి చైతన్య నిర్మించారు. ఈ మూవీని మార్చి 15న విడుదల చేయనున్నట్లు పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''హారర్ నేపథ్యంతో రూపొందిన 'తంత్ర' చిత్రం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందనే నమ్మకం ఉంది. పల్లెటూరి అమ్మాయిగా, క్షుద్రపూజలకి గురైన బాధితురాలిగా అనన్య నాగళ్ల చక్కగా నటించారు'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సహ నిర్మాత: తేజ్ పల్లి, కెమెరా: సాయి రామ్ ఉదయ్, విజయ భాస్కర్ సద్దాల, సంగీతం: ఆర్‌ఆర్ ధ్రువన్.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



• విజయ్ ఆంటోనీ, మృణాళిని రవి

'బిచ్చగాడు' వంటి బ్లాక్‌బస్టర్ మూవీతో తెలుగు ప్రేక్షకుల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన హీరోగా తెరకెక్కుతున్న తాజా తమిళ చిత్రం 'రోమియో'. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మృణాళినీ రవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్‌పై విజయ్ ఆంటోనీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగులో 'లవ్ గురు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భరత్ ధనశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెల్లెమ్మవే చెయ్యి పట్టు కోవే..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సాంగ్‌కి భాష్యశ్రీ సాహిత్యం అందించగా, ఆదిత్య అర్కే పాడారు. ''విజయ్ ఆంటోనీ తొలిసారి రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో నటిస్తున్న చిత్రం 'లవ్ గురు'. ఇందులో మనసుని కదిలించే చెల్లెలి సెంటిమెంట్ కూడా ఉంటుంది. వేసవిలో ఈ చిత్రం విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: ఫరూక్ జే బాషా.

క్లుప్తంగా...

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- జనగామ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు బదిలీ
- దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు ఐఏఎస్‌ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సిద్దిపేట కలెక్టర్‌ ప్రశాంత్‌ జీవన్‌పాటిల్‌ను నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది. గ్రేటర్‌ వరంగల్‌ మునిసిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ రిజ్వాన్‌ బాషాను జనగామ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసి, అక్కడి కలెక్టర్‌ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్‌ చేయాలని ఆదేశించింది. కామారెడ్డి అడిషనల్‌ కలెక్టర్‌(స్థానిక సంస్థలు) మిక్కిలినేని మను చౌదరిని సిద్దిపేట కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుత పర్యాటక, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌కు దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదనపు బాధ్యతల్లో ఉన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మను ఆ బాధ్యతలను నుంచి తప్పించింది.

మాజీ ఎంపీ రమేశ్‌ రాథోడ్‌ శిక్ష రద్దు

సాక్షి, హైదరాబాద్‌: అటవీ అధికారుల విధులకు అడ్డుపడ్డారంటూ నమోదైన కేసులో మాజీ ఎంపీ రమేశ్‌ రాథోడ్‌కు జిల్లాకోర్టు విధించిన శిక్షను హైకోర్టు రద్దు చేసింది. అటవీ అధికారుల విధులకు అడ్డుపడ్డారన్న ఫిర్యాదుపై 2006లో ఆయనపై కేసు నమోదుకాగా, విచారణ జరిపిన లక్సెట్టిపేట కోర్టు 2 ఏళ్ల శిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించింది. దీనిపై రమేశ్‌ జిల్లా కోర్టును ఆశ్రయించారు. శిక్షను రద్దు చేసి, రూ.10 వేల జరిమానా విధిస్తూ 2007లో జిల్లాకోర్టు తీర్పునిచ్చింది. దీన్ని సవాల్‌ చేస్తూ రాథోడ్‌ అప్పట్లో హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ శుక్రవారం తీర్పునిచ్చారు. రాథోడ్‌ తరఫున న్యాయవాది సురేందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జిల్లా కోర్టు తీర్పును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్కారు బడులకు ఆలంబన

- సీఎస్‌ఆర్‌ కింద రూ.1.5 కోట్ల కేటాయింపు.. కంప్యూటర్‌ ల్యాబ్‌లు, డిజిటల్‌ బోర్డుల ఏర్పాటు
- జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ ఉదారత

ఫిలింనగర్‌ (హైదరాబాద్‌): తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనే లక్ష్యంగా జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌.. కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్‌) కింద రూ.1.5 కోట్లు అందించింది. ఈ నిధులను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్‌ ల్యాబ్‌లు, డిజిటల్‌ బోర్డుల ఏర్పాటుకు వెచ్చిస్తోంది. అందులో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ ల్యాబ్‌, డిజిటల్‌ బోర్డులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

11 వేల పోస్టులతో డీఎస్సీ!

- లోక్‌సభ ఎన్నికల్లోపే టీచర్‌ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు
- పదోన్నతుల తర్వాతే మొత్తం ఖాళీల భర్తీ.. ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదానికి ఫైల్‌
- అనుమతి లభిస్తే త్వరలో నోటిఫికేషన్‌



సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికల్లోపే వీలైనంత త్వరగా డీఎస్సీ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. డీఎస్సీ ద్వారా మొత్తం 11 వేల టీచర్‌ పోస్టుల భర్తీ ఉండొచ్చని అధికార వర్గాలు సూచనప్రాయంగా చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రెండ్రోజుల క్రితం కలిసిన ఉన్నతాధికారులు.. టీచర్‌ పోస్టుల ఖాళీలు, వాటి భర్తీ విధానం, న్యాయపరమైన చిక్కుల గురించి వివరించారు. పదోన్నతుల ద్వారా భర్తీ చేసే ఖాళీలు విడిచిపెట్టి మిగతా వాటిని డీఎస్సీలో చేర్చాలని ఈ భేటీలో సీఎం నిర్ణయించారు. దీంతో టీచర్‌ పోస్టుల భర్తీకి విద్యాశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదానికి ఫైల్‌ను పంపింది. దానికి అనుమతి రావాల్సి ఉంది. ఒకట్రెండు రోజుల్లో ఇది పూర్తవుతుందని, వెనువెంటనే ఏ క్షణమైనా నోటిఫికేషన్‌ ఇచ్చే వీలుందని అధికార వర్గాల సమాచారం.

ఇప్పటికే ఓసారి నోటిఫికేషన్‌..

గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు 5,089 టీచర్‌ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ ఇచ్చింది. ఈ పోస్టులకు 1,77,502 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే డీఎస్సీ పరీక్ష తేదీల సమయంలోనే అసెంబ్లీ పోలింగ్‌ తేదీలు రావడంతో డీఎస్సీని రద్దు చేయాల్సి వచ్చింది. అదీగాక.. డీఎస్సీలో ప్రకటించిన 5,089 పోస్టులు కూడా రోస్టర్‌ విధానం తర్వాత కొన్ని జిల్లాల్లో ఖాళీల్లేని పరిస్థితి తలెత్తింది. నాన్‌-లోకల్‌ జిల్లా కోటాలో డీఎస్సీకి వెళ్లేందుకూ పోస్టులు లేకపోవడం నిరుద్యోగులను నిరాశపరిచింది.

లోపాల్లేకుండా చూడాలి..

నిరుద్యోగుల్లో డీఎస్సీ నిర్వహణ ఆనందం నింపుతోంది. ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాల్లే కుండా చూడాలి. వీలైనంత త్వరగా టీచర్ల పదోన్నతులు చేపట్టి.. ఖాళీలను భర్తీ చేయాలి. **– రామ్మోహన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు, డీఎడ్‌, బీఎడ్‌ అభ్యర్థుల సంఘం**

ఖాళీలు ఎన్ని?.. భర్తీ చేసేవి ఎన్ని?

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు సహా మొత్తం టీచర్‌ పోస్టులు 21 వేల వరకూ ఖాళీగా ఉన్నాయి. వాటిలో స్కూల్‌ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడం ద్వారా 1,974 హెచ్‌ఎం పోస్టులను, ప్రమోషన్ల ద్వారా 2,043 ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు 7,200 వరకూ ఖాళీలు ఉండగా వాటిలో 70 శాతం ప్రమోషన్ల ద్వారా మిగిలిన 30 శాతం పోస్టులను నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. పదోన్నతుల ప్రక్రియకు కోర్టు చిక్కులున్నాయి. కాబట్టి నేరుగా భర్తీ చేసే పోస్టులను డీఎస్సీ పరిధిలోకి తెచ్చే యోచనలో అధికారులు ఉన్నారు. అలాగే సెకండరీ గ్రేడెడ్‌ ఉపాధ్యాయుల పోస్టుల్లో 6,775 ఖాళీలున్నాయి. వాటిని భర్తీ చేసేందుకే ప్రయత్నిస్తున్నారు. పండిట్‌, పీఈటీ పోస్టులు దాదాపు 800 వరకూ ఉండొచ్చని అంచనా వేశారు. ఈ లెక్కన మొత్తంగా 11 వేలకు పైగా పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసే అవకాశం ఉంది.

జర్నలిస్ట్‌ శంకర్‌పై దాడి

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడనే పక్కా ప్లాన్‌తో వచ్చారు : సహచర జర్నలిస్టు

ఎల్‌బీనగర్‌ పీఎస్‌ పరిధిలో ఘటన... నలుగురు నిందితుల అరెస్టు


శంకర్‌

నాగోలు(హైదరాబాద్‌): జర్నలిస్టు శంకర్‌పై కొందరు రాళ్ల దాడికి దిగారు. ఈ ఘటన ఎల్‌బీనగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌ సిరిస్‌ రోడ్డులో చెలమల శంకర్‌ అలియాస్‌ జర్నలిస్ట్‌ శంకర్‌ న్యూస్‌ లైన్‌ తెలుగు చానల్‌తోపాటు 'తెలంగాణం'పేపర్‌ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాడు. గురువారం రాత్రి తన కార్యాలయం మూసివేసి రాత్రి 10:40 గంటల సమయంలో తోటి జర్నలిస్టులు దండిగ నర్సింహ, పుల్కారం శివతో కలసి తుర్కయాంజాల్‌కు కారులో బయలుదేరారు. కొద్దిదూరం ప్రయాణించగానే ఓ వ్యక్తి అడ్డుగా వచ్చాడు. దీంతో శంకర్‌ తన కారును స్లో చేశాడు. యాక్టివాపై ఇద్దరు యువతులు వస్తూ వెనుక నుంచి ఆ కారు ఢీకొట్టారు. వెంటనే శంకర్‌ కారులో నుంచి దిగి యువతులను ప్రశ్నిస్తుండగానే, వారు అసభ్యపదజాలంతో దూషణలకు దిగారు. తప్పు చేసింది మీరే కదా అని అంటుండగానే ఆ యువతులకు తెలిసిన కొందరు యువకులు బైకులపై అక్కడకు చేరుకొని శంకర్‌ను చేతులు, రాళ్లతో కొట్టారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన దండిగ నర్సింహ, శివపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న శివను ఆ యువకులు అడ్డుకుని సెల్‌ఫోన్‌ పగులగొట్టారు. ఈ క్రమంలోనే శంకర్‌కు చెందిన రెండు సెల్‌ఫోన్లు తీసుకొని, మూకుమ్మడి దాడి చేయడంతో అక్కడి నుంచి ప్రాణభయంతో శంకర్‌ ఓ ఇంట్లోకి వెళ్లాడు. రోడ్డుపై గొడవ పెద్దది కావడంతో స్థానికులు 100 సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన శంకర్‌ను చికిత్స నిమిత్తం సోమాజిగూడలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడు దండిగ నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. కాలనీలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి జర్నలిస్టులు శంకర్‌, శివపై దాడి చేసిన కవాడిగూడకు చెందిన ప్రవీణ్‌, హయత్‌నగర్లోని ఎల్లారెడ్డి కాలనీకి చెందిన మహేష్‌, ఎల్‌బీనగర్‌ హాస్టల్‌లో ఉండే శ్రీదుర్గ, హేమలతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌ తరలించారు. దాడికి పాల్పడిన మిగతా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులే తమను అసభ్య పదజాలంతో దూషించారంటూ నల్లగొండలోని ఎస్‌ఎల్‌ఎన్‌ స్వామి కాలనీ చెందిన శ్రీదుర్గ ఎల్‌బీనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాడి వెనుక కాంగ్రెస్‌ పార్టీ నాయకుల హస్తం ఉంది

జర్నలిస్టు శంకర్‌, శివతో పాటు తనపై జరిగిన దాడిలో కుట్రకోణం ఉందని, జర్నలిస్టు దండిగ నర్సింహ ఆరోపించారు. కాంగ్రెస్‌ పార్టీ చేస్తున్న ఆరాచకాలు, తప్పిదాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడనే అక్కసుతో కాపు కాసి దాడి చేశారన్నారు. కాంగ్రెస్‌ నాయకులు కొండగల్‌లో పేదల అసైన్డ్‌ భూములు లాక్కుంటున్నారనే విషయంపై ఇటీవల తాము ప్రసారం చేశామని, ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌ పార్టీకి చెందిన వారే తమపై దాడులకు పాల్పడ్డారని, ఇందుకు కావాల్సిన సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు.

తెలంగాణలో ఫ్యాక్షన్‌ దాడుల సంస్కృతి: కేటీఆర్‌

తెలంగాణలో ఫ్యాక్షన్‌ దాడుల సంస్కృతి మొదలైందని, మీడియాపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపైనే దాడి అని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ అన్నారు. శంకర్‌పై దాడి ఘటనను 'ఎక్స్‌' వేదికగా ఆయన ఖండించారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ప్రశ్నిస్తే దాడులా: హరీశ్‌రావు

ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రసారం చేస్తున్నారనే ముద్ర వేసి భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించడం అంటే ప్రజల గొంతు నొక్కడమే అన్నారు.

డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎంపిక అభ్యర్థుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్‌: డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ విభాగంలోని డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(టీఎస్‌పీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఎంపికైన అభ్యర్థులు సమాచారం కోసం కమిషన్‌ వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సూచించారు.

గాంధీభవన్‌కు మాజీ డీహెచ్‌ గడల

సాక్షి, హైదరాబాద్‌: ప్రజారోగ్య శాఖ మాజీ సంచాలకుడు గడల శ్రీనివాసరావు శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ కోసం ఇటీవల శ్రీనివాసరావు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. సికింద్రాబాద్‌, ఖమ్మం స్థానాల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరినట్టు తెలిసింది.

3 రోజుల్లో కొత్త కరెంట్‌ కనెక్షన్‌

- దరఖాస్తు చేసుకున్న మూడురోజుల్లోపు ఇవ్వాలని కేంద్రం ఆదేశాలు
- గ్రూప్‌ హౌసింగ్‌ సొసైటీకి సింగిల్‌ పాయింట్‌ కనెక్షన్‌
- సొసైటీల్లో ఎలక్ట్రిక్‌ వాహనాల చార్జింగ్‌ కోసం ప్రత్యేక కనెక్షన్‌
- వినియోగదారుల హక్కుల రూల్స్‌ విడుదల చేసిన కేంద్ర విద్యుత్‌ శాఖ

సాక్షి, హైదరాబాద్‌: మెట్రోపాలి టన్‌ నగరాల్లో వినియోగదారులు అవసరమైన పత్రాలన్నీ పొందుపరిచి, కొత్త కరెంట్‌ కనెక్షన్‌ కోసం దరఖాస్తు చేసుకుంటే మూడు రోజుల్లోగా కనెక్షన్‌ ఇవ్వాలని కేంద్ర విద్యుత్‌ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అలాగే పాత కనెక్షన్‌లో మార్పుల విషయంలో కూడా ఇదే నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఎలక్ట్రిసిటీ(వినియోగదారుల హక్కులు) రూల్స్‌-2020ని సవరిస్తూ రూల్స్‌-2024ను శుక్రవారం జారీ చేసింది. అదేవిధంగా మున్సిపల్‌ ప్రాంతాల్లో వారంరోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లోగా కనెక్షన్‌ జారీ చేయాలని నిర్దేశించింది. రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాల్లోని కొండ ప్రదేశాల్లో అయితే 30 రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేసింది. పంపిణీ వ్యవస్థల విస్తరణ, కొత్త సబ్‌స్టేషన్‌ నిర్మాణం చేపట్టాల్సి ఉంటే.. 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకొని, విద్యుత్‌ సరఫరా చేయాలని నిర్దేశించింది. ఇక గ్రూప్‌ హౌసింగ్‌ సొసైటీ కింద అన్ని ఇళ్లకు అవకాశం ఉంటే.. సింగిల్‌ పాయింట్‌ కనెక్షన్‌ (ఒకే కనెక్షన్‌) ఇవ్వాలని పేర్కొంది. సొసైటీలో 50 శాతం దాకా యాజమానులు వ్యక్తిగత కనెక్షన్‌ కోరితే.. వారందరికీ వ్యక్తిగత కనెక్షన్‌ ఇవ్వాలని స్పష్టం చేసింది. సింగిల్‌ పాయింట్‌ కనెక్షన్‌ టారిఫ్‌ కూడా సగటు గృహ కనెక్షన్‌ టారిఫ్‌ను దాటడానికి వీల్లేదని స్పష్టం చేసింది. సొసైటీల్లో ఎలక్ట్రిక్‌ వాహనాల చార్జింగ్‌ కోసం ప్రత్యేకంగా కనెక్షన్‌ కావాలంటే జారీ చేయాలని నిర్దేశించింది. మీటర్లలో లోపాలు లేదా దెబ్బతినడం.. కాలిపోవడం వంటి అంశాలపై దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లోపు కొత్త మీటర్‌ బిగించాలని, మీటర్‌ రీడింగ్‌లో లోపాలు ఉన్నట్లు గుర్తించి ఫిర్యాదు చేస్తే కొత్త మీటర్‌ను ఐదురోజుల్లోగా బిగించడమే కాకుండా తప్పుడు బిల్లింగ్‌పై ఫిర్యాదును మూడు నెలల్లోపు పరిష్కరించాలని పేర్కొంది. సోలార్‌ విద్యుత్‌ కోసం పెట్టుకున్న దరఖాస్తును పరిశీలించి, సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదికను 15 రోజుల్లోగా అందించాలన్నారు. 10 కిలోవాట్ల దాకా రూఫ్‌టాప్‌ సోలార్‌ వ్యవస్థ కోసం వచ్చిన దరఖాస్తును సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక అవసరం లేకుండా అనుమతించాలని ఆదేశించింది. రూఫ్‌టాప్‌ సోలార్‌ వ్యవస్థ బిగించిన తర్వాత సర్టిఫికెట్‌ను వినియోగదారుడు దాఖలు చేస్తే కనెక్షన్‌ అగ్రిమెంట్‌, కొత్త మీటర్‌ను 15 రోజుల్లోగా అందించాలని స్పష్టం చేసింది.

కేసుల దర్యాప్తులో జాగిలాలు కీలకం

పోలీస్‌ జాగిలాల పాసింగ్‌ ఔట్‌పరేడ్‌లో డీజీపీ రవిగుప్తా..



సాక్షి, హైదరాబాద్‌: కేసుల దర్యాప్తులో పోలీసులతోపాటు జాగిలాల పాత్ర కీలకమని డీజీపీ రవిగుప్తా అన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్‌ ఇంటెలిజెన్స్‌ ట్రైనింగ్‌ అకాడమీ (ఐఐటీఏ)లో శుక్రవారం 23వ పోలీసు జాగిలాల పాసింగ్‌ ఔట్‌ పరేడ్‌ నిర్వహించారు. వివిధ అంశాల్లో శిక్షణ పొందిన 21 జాగిలాలు, 28 మంది కేనైన్‌ హ్యాండర్లు పాసింగ్‌ ఔట్‌ పరేడ్‌లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథి డీజీపీ రవిగుప్తా పోలీస్‌ జాగిలం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు రాష్ట్రాల జాగిలాలకు ఐఐటీఏ శిక్షణ ఇస్తోందని పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్‌ అడిషనల్‌ డీజీ బి.శివధర్‌ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌ శాఖ సాధించిన విజయాలలో పోలీస్‌ జాగిలాలు ప్రశంసాపూర్వక పాత్రను నిర్వహించాయని వెల్లడించారు. ఇంటెలిజెన్స్‌ సెక్యూరిటీ వింగ్‌ డీఐజీ తఫ్సీర్‌ ఇక్బాల్‌ ప్రారంభోపన్యాసం చేస్తూ.. బిహార్‌, మధ్యప్రదేశ్‌, రాజస్తాన్‌, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల పోలీస్‌ జాగిలాలకు ఐఐటీఏలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన జాగిలాలు, వాటి హ్యాండర్లకు డీజీపీ బహుమతులు ప్రదానం చేశారు. అకాడమీలో నూతనంగా నిర్మించిన క్రికెట్‌ మైదానాన్ని డీజీపీ ఈ సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్య, పోలీస్‌హౌసింగ్‌ కార్పొరేషన్‌ ఎండీ, ఐజీ ఎం.రమేష్‌, ఆర్పీఎఫ్‌ ఐజీ అరోనా సింగ్‌ ఠాకూర్‌, ఆర్పీఎఫ్‌ డీఐజీ ఎస్‌.జెడ్‌ ఖాన్‌, ఇంటెలిజెన్స్‌ ఎస్పీ భాస్కరన్‌, రాజేంద్రనగర్‌ డీసీపీ సి.హెచ్‌.శ్రీనివాస్‌, ఐఐటీఏ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీడీడీ అధికారులకు శిక్షణ కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్‌: ఎస్‌సీడీడీ అధికారులకు ఓరియెంటేషన్‌ అండ్‌ సెన్సిటైజేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఎంసీఆర్‌ హెచ్చార్డీ శుక్రవారం ప్రారంభించింది. ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి పెంపొందించేందుకు, హాస్టళ్లలో ఉండే విద్యార్థుల ఆత్మహత్యలను, మానసిక సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులకు ఈ శిక్షణను అందిస్తున్నారు. ముఖ్య అతిథి శశాంక్‌ గోయల్‌ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లోని సెంటర్‌ ఫర్‌ మేనేజ్‌మెంట్‌ బిహేవియరల్‌ స్టడీస్‌ కోర్సు కో ఆర్డినేటర్‌ కందుకూరి ఉషారాణి హాస్టళ్లలో విధులు నిర్వహించే అధికారులకు కౌన్సెలింగ్‌ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి విభాగం ప్రిన్సిపల్‌ సెక్రటరీ, ఐఏఎస్‌ ఎన్‌.శ్రీధర్‌, కమిషనర్‌, ఐఏఎస్‌ రాహుల్‌ బొజ్జా మాట్లాడారు.

సెస్‌ను రద్దు చేయండి.. డిస్కమ్‌లో కలపండి..

ఈఆర్సీ సిఫార్సు

సాక్షి, హైదరాబాద్‌, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సహకార విద్యుత్‌ సరఫరా సొసైటీ(సెస్‌)పై తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) కన్నెర్ర చేసింది. భారీగా అక్రమాలు జరిగాయని గుర్తించిన ఈఆర్సీ... దీన్ని రద్దుచేసి, ఉత్తర డిస్కమ్‌ (టీఎస్‌ఎన్పీడీసీఎల్‌-వరంగల్‌)లో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈమేరకు తెలంగాణ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీకి కమిషన్‌ కార్యదర్శి శుక్రవారం లేఖ రాశారు. గతేడాది 2023 ఫిబ్రవరి 20వ తేదీన 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సిరిసిల్లలో బహిరంగ విచారణ జరిగింది. ఈ క్రమంలో సిరిసిల్ల డివిజన్‌ వినియోగదారుల సంక్షేమ సొసైటీతో పాటు పలువురి నుంచి సెస్‌ అక్రమాలపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో సెస్‌లో భారీగా అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దాంతో 2014–2022 మధ్యకాలంలో సెస్‌ కార్యకలాపాలపై ఈఆర్సీ ఆడిటింగ్‌ చేయించగా.. ఈ మధ్యకాలంలో రూ.94.88 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం జరిగిందని ఆడిట్లో తేలింది. ఉత్తర డిస్కమ్‌ నుంచి కరెంట్‌ను తీసుకుంటూ... ఆ కరెంట్‌ను వినియోగదారులకు సరఫరా చేస్తున్నప్పటికీ వినియోగానికి తగ్గట్లుగా బిల్లులు వసూలు చేయలేదని గుర్తించారు. ఇక ఉత్తర డిస్కమ్‌ నుంచి తీసుకున్న కరెంట్‌కు సంబంధించి రూ.558.44 కోట్ల బకాయిలు సెస్‌ చెల్లించాల్సి ఉందని తేల్చారు. ఆడిట్‌ నివేదిక ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని 2024 జనవరి 10వ తేదీన సెస్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌కు స్పష్టం చేసింది. ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తించిన ఈఆర్సీ, వెంటనే సెస్‌ను రద్దుచేసి, ఉత్తర డిస్కమ్‌లో విలీనం చేయాలని సిఫార్సు చేసింది. బిల్లింగ్‌లో లోపాల కోసం హైటెన్షన్‌ (హెచ్‌టీ) కనెక్షన్లపై ఆడిట్‌ చేయాలని కోరింది. ఒకే ప్రాంగణానికి ఒకటికి మించి సెస్‌ లోటెన్షన్‌(ఎల్టీ) కనెక్షన్లు జారీ చేయగా... వాటిని ఇతరత్రా అవసరాలకు వాడుతున్నారని కమిషన్‌ గుర్తించింది. ఎల్టీ కనెక్షన్లను పారిశ్రామిక, వాణిజ్య వినియోగానికి వాడుతున్నారని స్పష్టం చేసింది. ఆడిట్లో తేలిన అంశాలను కమిషన్‌ ప్రభుత్వానికి నివేదించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.